ప్రతిపక్షం

www.prathipaksham.in

సోమవారం 02.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 313 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

ఇండియాతో మ్యాచ్.. ఆడేది లేదన్న పాక్ 10

మొత్తం బడ్జెట్ రూ.53,47,315 కోట్లు

రెవెన్యూ రాబడులు	రూ.35,33,150 కోట్లు
పన్నులు	రూ.28,66,922 కోట్లు
పన్నేతర ఆదాయం	రూ.6,66,228 కోట్లు
మూలధన రాబడులు	రూ.18,14,165 కోట్లు
రెవెన్యూ వ్యయం	రూ.41,25,494 కోట్లు
వడ్డీ చెల్లింపులకు	రూ.14,03,972 కోట్లు
మూల ధన వ్యయం	రూ.12,21,821 కోట్లు

ధరలు పెరిగేవి: విదేశీ మద్యం, లగ్జరీ వాచ్‌లు, ఇంపోర్టెడ్ స్మార్ట్ టీవీలు, హై ఎండ్ బ్రాండ్ ల్యాప్‌టాప్‌లు, ఆల్కహాల్, సిగరెట్లు, బీడీలు, పాన్‌మసాలా, గుట్కా

ధరలు తగ్గేవి: క్యాన్సర్ ఔషధాలు, డయాబెటిక్ మందులు, ఈవీ బ్యాటరీలు, సోనాల్ ప్యానల్స్, విదేశీ యాత్రలపై పన్ను, మైక్రో అవెర్స్, విదేశీ విద్య, చెప్పులు, ఎయిర్‌క్రాఫ్ట్ విడిభాగాలు, వీటితో పాటు దేశీయంగా తయారయ్యే మొబైల్స్, ట్యాబ్లెట్ ధరలు కాస్త తగ్గే అవకాశం ఉంది.

సబ్‌కా వికాస్!

రూ.53,47,315 కోట్లతో నిర్మలమ్మ పద్దు

"పేదలు, సమాజంలో బాగా వెనుకబడినవారు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వారిపై దృష్టిపెట్టాలని మా ప్రభుత్వం సంకల్పించింది. ఈ సంకల్పానికి కార్యరూపం ఇచ్చేందుకు తొలిసారి ఈ బడ్జెట్ కర్తవ్య భవన్‌లో రూపొందించాం. దీనిద్వారా మూడు కర్తవ్యాలతో స్ఫూర్తి పొందాం. మొదటి కర్తవ్యం ఉత్పాదకను, పోటీతత్వాన్ని పెంచడం ద్వారా ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, స్థిరీకరించడం. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొనేందుకు స్థిరత్వాన్ని సాధించడం. రెండో కర్తవ్యం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడం, వారి సామర్థ్యాల్ని పెంచడం, ప్రగతి ప్రస్థానంలో వారిని భాగస్వాములుగా తీర్చిదిద్దడం. మూడో కర్తవ్యం సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ మార్గానికి అనుగుణంగా ప్రతి కుటుంబం, ప్రతి కమ్యూనిటీ, ప్రాంతం, రంగానికి అన్ని వనరులను అందుబాటులో ఉంచడం, సౌకర్యాలు కల్పించడం, అవకాశాలు పెంపొందించడం."

నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక మంత్రి

యువశక్తి కేంద్రంగా సాగిన బడ్జెట్

- ఐదు రకాలుగా సెంట్రల్ సెక్టార్ స్కీమ్స్
- పథకాలకు 43శాతం నిధులు
- రాష్ట్రాలకు రూ. 4.41 లక్షల కోట్లు
- వ్యవసాయ రంగానికి రూ.1,27,290 కోట్లు
- రైతుల కోసం 'భారత్ విస్తార్'
- రక్షణ రంగానికి భారీగా కేటాయింపులు
- ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం
- చిన్న పన్ను చెల్లింపుదారుల కోసం ప్రత్యేక పథకం
- 7 శాతం వృద్ధితో ముందుకు సాగుతున్నాం: కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం జంబో బడ్జెట్‌ప్రవేశపెట్టారు. రూ.53,47,315 కోట్లతో పద్దు ప్రతిపాదించారు. వికసిత్‌భారత్‌దిశగా అడుగులు వేస్తున్నామని ప్రకటించారు. యువశక్తి కేంద్రంగా బడ్జెట్ ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. గ్లోబల్‌మార్కెట్లతో పోటీ పడుతున్నామని తెలిపిన ఆర్థికమంత్రి 9వ సారి బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈసారి బడ్జెట్‌లో పథకాలకు అగ్రతాంబూలం ఇచ్చారు. మొత్తం బడ్జెట్‌లో 43శాతం నిధులను కేవలం పథకాల కోసమే కేటాయించడం గమనార్హం. కేంద్రం 2026-27 ఆర్థిక సంవత్సరంలో రూ.23.21లక్షల కోట్లను వివిధ రకాల పథకాల కోసం కేటాయింపులు చేసింది. అయితే ఈ పథకాలను రెండు వర్గాలుగా కేంద్రం విభజించింది. అందులో ఒకటి సెంట్రల్ సెక్టార్ స్కీమ్స్, రెండోది కేంద్ర ప్రాయోజిత పథకాలు (సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్స్). ఈ రెండింటిలో కూడా సెంట్రల్ సెక్టార్ స్కీమ్స్‌కు ఏకంగా 17.22 లక్షల కోట్లు కేటాయించింది. భారత చరిత్రలో తొలిసారి ఆదివారం కేంద్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశగా సంస్కరణల పథాన్ని

...:: మిగతా 2లో

తెలంగాణకు 3 హైస్పీడ్ రైళ్లు

తెలంగాణకు 3 హైస్పీడ్ కారిడార్లను కేంద్రం ప్రకటించింది. దేశంలో కొత్తగా 7 నగరాల మధ్య హైస్పీడ్ రైల్ కారిడార్లు ప్రకటించగా పుణెహైదరాబాద్, హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌చెన్నై కారిడార్లు తెలంగాణ మీదుగా వెళ్లనున్నాయి. వీటితో పాటు ముంబయిపుణె, ఢిల్లీవారణాసి, వారణాసిసిలిగుడి, చెన్నైబెంగళూరు మధ్య కూడా కొత్త కారిడార్ల నిర్మాణం చేపట్టనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. వీటికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు రూ.12.2 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గత సంవత్సరం రూ.11.2 లక్షల కోట్లు కేటాయించగా ఈసారి స్వల్పంగా పెంచారు. దేశ మౌలిక సదుపాయాల కల్పన గురించి మాట్లాడుతూ ఈ కారిడార్ల గురించి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. వీటి ద్వారా ప్రధాన ఆర్థిక, సాంస్కృతిక కేంద్రాల మధ్య అనుసంధానం పెరుగుతుందని అన్నారు.

తెలంగాణకు కేటాయింపులు ఇవే

- గతేడాదితో పోలిస్తే పెరిగిన పన్నులు
- హైదరాబాద్ మీదుగా మూడు హైస్పీడ్ రైల్వే కారిడార్లు
- సింగరేణికి రూ.2,500 కోట్లు కేటాయించిన కేంద్రం

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు సంబంధించిన నిధుల కేటాయింపులు, పన్నుల వాటా వివరాలు ఇలా ఉన్నాయి. కేంద్ర

...:: మిగతా 3లో

రాష్ట్రానికి కేటాయింపులు లేకపోవడం అన్యాయం

- బయో ఫార్మా అంటే ముందుగా గుర్తుకు రావాల్సింది తెలంగాణ
- ఫార్మా హబ్‌గా ప్రపంచానికి హైదరాబాదు నగరం గుర్తింపు
- ఆరెంజ్ ఎకానమీలో హైదరాబాద్ సెంట్రిక్ ముంబాయికి తరలించారు
- జాతీయ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచారు
- ఎస్సీ ఎస్టీ మైనార్టీల సంక్షేమం గురించి పట్టించుకోలేదు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్లో ప్రవేశపెట్టిన 53.47 లక్షల కోట్ల బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయింపులు లేకపోవడం అన్యాయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు కేబినెట్ మంత్రులు, పార్లమెంటు సభ్యులు బృందాలుగా వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ లను పలుమార్లు కలిసి విన్నవించినప్పటికీ బడ్జెట్లో కేటాయింపులు లేకపోవడం తీవ్ర నిరాశపరిచిందని పేర్కొన్నారు. ఆదివారం ప్రజాభవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసి పునర్జీవం, రీజినల్ రింగ్ రోడ్ హైదరాబాద్ నగర అభివృద్ధి మెట్రో రైల్ విస్తరణ ఇతర మౌలిక సదుపాయాల కోసం బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని ఆశించామన్నారు. బయో ఫార్మా అంటే ముందుగా కేంద్రానికి గుర్తు రావాల్సింది తెలంగాణ ప్రభుత్వం. కేంద్రం ప్రకటించిన బయో ఫార్మాలో తెలంగాణకు నిధులను పొందుపరచకపోవడం తీవ్ర నిరాశపరిచింది కేంద్ర బడ్జెట్లో ఎలక్ట్రానిక్స్ కు రూ.40 వేల కోట్ల కేటాయింపులు చేశారు ఇందులో కూడా తెలంగాణకు

...:: మిగతా 3లో

ఎస్ఎల్బీసీ పనుల పునరుద్ధరణకు ప్రణాళికలు

- నిరంతరం పనుల సమీక్ష పై రూట్ మ్యాప్
- భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి
- ప్రభుత్వం చేతికి హెలి-బోర్న్ సర్వే నివేదిక
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఎల్బీసీ సొరంగ మార్గం పనుల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సొరంగ నిర్మాణ పనులలో ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన వివరించారు. అర్ధాంతరంగా

...:: మిగతా 3లో

ఫోన్ ట్యాపింగ్ చేయమని ఆదేశాలిచ్చారా?

- కేసీఆర్‌ను నేరుగా ప్రశ్నించిన అధికారులు
- నాలుగున్నర గంటలకు పైగా విచారణ
- ఎప్పటి నుంచి ట్యాపింగ్ జరిగింది? మీ పాత్ర ఏంటీ?
- ప్రభాకర్‌రావుకు నియామకం ఇందుకేనా?
- ఎమ్మెల్యే కొనుగోలు కేసులో సమాచారం ఎలా వచ్చింది?
- ఎలక్టోరల్ బాండ్స్ ఇచ్చిన వారి నంబర్లు ఎందుకు లిస్టులో?
- ఆ ఆధారాలతో కేసీఆర్‌ను ప్రశ్నించిన సిట్?

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ కీలక దశకు చేరుకుంది. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును ప్రత్యేక దర్యాప్తు బృందం ఆదివారం సుదీర్ఘంగా విచారించింది. హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమైన ఈ విచారణలో కేసీఆర్‌కు సిట్ అధికారులు పలు ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. కేసీఆర్‌ను నాలుగున్నర గంటలకుపైగా

...:: మిగతా 3లో

నిస్సారమైన బడ్జెట్.. ఆర్భాటం తప్ప ఏమీ లేదు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. బడ్జెట్‌కు ముందు భారీ హైప్ సృష్టించారని, కానీ అందులో విషయం లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు.

9

92 మది బలూచ్ మిలిటెంట్లు హతం

బలూచిస్తాన్‌లో దాడులకు పాల్పడుతున్న మిలిటెంట్లను పాకిస్థాన్ మిలిటరీ ఏరివేస్తున్నది. ఈ నేపథ్యంలో భాగంగా చేపట్టిన ఆపరేషన్‌లో 92 మంది బలూచిస్తానీ మిలిటెంట్లను హతమార్చినట్లు పాకిస్థాన్ మిలిటరీ పేర్కొన్నది.

9

రాష్ట్రపతి భవన్‌లో అమృత్ ఉద్యాన్

అమృత్ ఉద్యాన్ పేరుతో సందర్శనకు అనుమతించనున్నారు. ఈ నెల 3 మంగళవారం నుంచి మార్చి 31 వరకు సందర్శకుల్ని గార్డెన్ లోపలికి అనుమతిస్తారు. ఢిల్లీలో కాలుష్యం ఎక్కువనే సంగతి తెలిసిందే.

9

ప్రధాని మోడీ రాజీనామా చేయాలి

ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో ఏమాత్రం సంబంధం ఉన్నా.. ఇలాంటి ప్రజాస్వామ్య దేశంలో నైతిక బాధ్యతగా మోదీ తనకుతాను పదవి నుంచి తప్పుకొని విచారణ కోరాలి అని మమత డిమాండ్ చేశారు.

9

ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించిన బడ్జెట్: ప్రధాని మోదీ

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి ప్రవేశపెట్టిన బడ్జెట్ 140 కోట్ల ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కేంద్ర బడ్జెట్ భవిష్యత్తుకు రోడ్‌మ్యాప్‌గా నిలుస్తుందని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. 2047 మిషన్ లక్ష్యాల మేరకు కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టామన్నారు. సంస్కరణలను బలోపేతం చేయటంతోపాటు వికసిత్ భారత్ నిర్మాణానికి రోడ్‌మ్యాప్‌గా పనిచేస్తుందని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్‌కు కేటాయింపులు చేసినట్లు తెలిపారు. త్వరలో భారత్ మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించనుందని, చరిత్రాత్మక బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు.

దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

బడ్జెట్ పై రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. భద్రత, అభివృద్ధి, ఆత్మనిర్భర్‌ను బ్యాలెన్స్ చేస్తూ ఈ బడ్జెట్‌ను సిద్ధం చేశారని తెలిపారు. బడ్జెట్ లో అత్యంత ముఖ్యమైన అంశం మూడు సాయుధ దళాల ఆధునీకరణ అని వెల్లడించారు. మరోవైపు, త్రివిద దళాలకు కేటాయించిన నిధులపై రక్షణ శాఖ సంతృప్తి వ్యక్తం చేసింది.

సంక్షోభంలో ఉన్న ప్రజలను ఆదుకునే చర్యలు శూన్యం: రాహుల్

రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా బడ్జెట్‌పై స్పందించారు. దేశంలోని దయనీయ పరిస్థితులను వివరిస్తూ ఆరు కీలక అంశాలను ప్రస్తావించారు. "దేశంలోని యువతకు ఉద్యోగాలు లేవు, తయారీ రంగం కుప్పకూలుతోంది. పెట్టుబడిదారులు భయపడి తమ నిధులను వెనక్కి తీసుకుంటున్నారు. సామాన్యుడి ఇంట్లో పొదుపు ఆవిరైపోతోంది. దేశానికి అన్నం పెట్టే రైతన్న తీవ్ర ఆవేదనలో ఉన్నాడు. ప్రపంచవ్యాప్తంగా రాబోయే ఆర్థిక ముప్పులను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించింది. దేశం తప్పుడు మార్గంలో వెళ్తున్నప్పుడు, బడ్జెట్ ద్వారా దాన్ని సరిదిద్దాలి. కానీ ఈ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోంది. వాస్తవాలను చూడటానికి ఇష్టపడటం లేదు. సంక్షోభంలో ఉన్న ప్రజలను ఆదుకునే చర్యలు ఇందులో శూన్యం" అని రాహుల్ విమర్శించారు.

ఐడియాలు అయిపోయాయి: ఖర్గే

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కూడా మోదీ ప్రభుత్వంపై సెటైర్లు వేస్తూనే, లోతైన విశ్లేషణ చేశారు. "మోదీ ప్రభుత్వానికి కొత్త ఆలోచనలు రావడం లేదు. 'మిషన్ మోడ్' అని గొప్పలు చెప్పుకునే వారు ఇప్పుడు 'ఛాలెంజ్ రూట్' లోకి వెళ్లిపోయారు. సంస్కరణల ఎక్స్‌ప్రెస్ ఎక్కడా ఆగడం లేదు. రాజకీయ చిత్తశుద్ధి లేదు. కనీసం విధానపరమైన లోపాలను దాచుకోవడానికి కొత్త స్లోగన్లు కూడా ఈ బడ్జెట్ లో లేకపోవడం విడ్డూరం" అని అన్నారు. దేశంలో పెరిగిపోతున్న అసమానతలపై ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. "దేశంలో అసమానతలు బ్రిటిష్ పరిపాలన కాలం నాటి కంటే దారుణంగా పెరిగిపోయాయి. అయినా సరే ఈ బడ్జెట్ లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు, పేదలకు ఎలాంటి భరోసా ఇవ్వలేదు. వారి గురించి కనీసం ప్రస్తావన కూడా లేదు" అని అన్నారు.

డేటా సెంటర్లకు 20 యేండ్లు ట్యాక్స్ హాలిడే

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎనారై పరిశ్రమకు శుభవార్త తెలిపారు. ఈ బడ్జెట్ లో భారత స్టాక్ మార్కెట్ లో పెట్టుబడులు పెట్టే పరిమితి పెంపునకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. భారత ఆర్థిక మార్కెట్లను మరింత బలోపేతం చేయడం,ప్రపంచ స్థాయి మూలధనాన్ని ఆకర్షించడం లక్ష్యంగా కీలక చర్యలను ప్రకటించారు. గతంలో భారత కంపెనీల ఈక్విటీలలో ఎనారై పెట్టుబడి 10 శాతం ఉండగా.. ఇప్పుడు అదే పరిమితిని 24 శాతానికి పెంచుతున్నట్లు కేంద్రం ప్రకటించింది. అదనంగా,పోర్ట్‌ఫోలియో మేనేజ్ మెంట్ సర్వీసెస్(PMS)ద్వారా లిస్టెడ్ కంపెనీలలో పెట్టుబడి పరిమితి 5 శాతం నుంచి 10 శాతానికి పెరిగింది. ఈ చర్యల కారణంగా భారత మార్కెట్ లో భారీ నిధులు ప్రవహించే అవకాశం ఉంది. భారతదేశంలో డేటా సెంటర్లు ఏర్పాటు చేసే సంస్థలకు కేంద్రం మరో గుడ్ న్యూస్ ఇచ్చింది. 2047 వరకు కొత్తగా డేటా సెంటర్లు ఏర్పాటు చేసే సంస్థలకు ట్యాక్స్ హాలీడే ప్రకటిస్తున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ నిర్ణయం క్లౌడ్ సేవల కంపెనీలకు భారీ ప్రయోజనం చేకూరుస్తుంది, పెట్టుబడులను ప్రోత్సహిస్తుంది. నిర్మలా సీతారామన్ 202627 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను లోక్‌సభలో ఉదయం 11 గంటలకు ప్రవేశపెట్టారు. సుమారు ఒక గంట 30 నిమిషాల పాటు ఆమె ప్రసంగం కొనసాగింది, ఇందులో ప్రధానంగా మార్కెట్ పరిమితులు, డేటా సెంటర్లకు సంబంధించిన మేనేజ్మెంట్ విధానాలు, పెట్టుబడి అవకాశాలపై ప్రస్తావించారు.

సబ్‌కా.. వికాస్!

మొదటిపేజీ తరువాయి

కొనసాగింపునకే మొగ్గుచూపారు. ఈ మేరకు 2026-27 వార్షిక బడ్జెట్‌ను లోక్‌సభకు సమర్పించిన ఆమె మొత్తం రూ.53,47,315 కోట్లతో ప్రతిపాదించారు. ఇందులో రెవెన్యూ రాబడులను రూ.35,33,150 కోట్లుగా అంచనా వేసిన ఆర్థిక మంత్రి, అందులో పన్నుల ద్వారా రూ.28,66,922 కోట్లు, పన్నేతర ఆదాయం ద్వారా రూ.6,66,228 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. మూలధన రాబడులను రూ.18,14,165 కోట్లుగా ప్రతిపాదించారు. మూలధన రాబడుల్లో రూ.16,95,768 కోట్లు అప్పులు ద్వారా సమీకరించనున్నట్లు వివరించారు. కేటాయింపుల్లో రక్షణ, రవాణా రంగాలకు అగ్రతాంబూలం ఇచ్చిన నిర్మలమ్మ, గ్రామీణ భారతానికి నిధులు విదిల్చారు. అలాగే, వ్యవహాయానికి టెక్నాలజీ సొబగులు అద్దేలా కేటాయింపులు చేశారు. వ్యయానికి సంబంధించి, రెవెన్యూ వ్యయం రూ.41,25,494 కోట్లుగా పేర్కొన్నారు. ఇందులో వడ్డీ చెల్లింపులకే రూ.14,03,972 కోట్లు వెళ్లనున్నట్లు వివరించారు. మూల ధన వ్యయం రూ.12,21,821 కోట్లుగా ప్రతిపాదించారు. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 4.4 శాతంగా అంచనా వేసిన ఆర్థికమంత్రి వచ్చే ఏడాది 0.1 శాతం తగ్గించాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. ఇక రాబడులకు సంబంధించి ప్రతి రూపాయిలో రుణాలు ద్వారానే అత్యధికంగా 24 పైసలు సేకరించనున్నట్లు తెలిపారు. ఆదాయ పన్ను ద్వారా 21 పైసలు, కార్పొరేట్ పన్నుల ద్వారా 18 పైసలు, జీఎస్టీ, ఇతర పన్నుల ద్వారా 15 పైసలు, పన్నేతర ఆదాయం 10 పైసలు, కేంద్ర ఎక్సైజ్ సుంకాల ద్వారా 6 పైసలు, కస్టమ్స్ సుంకాల ద్వారా 4 పైసలు, రుణేతర మూల ధన రాబడుల ద్వారా 2 పైసలు వస్తాయని అంచనా వేశారు.

ఐదు రకాలుగా సెంట్రల్ సెక్టార్ స్కీమ్స్

సెంట్రల్ సెక్టార్ స్కీమ్స్‌ను సైతం కేంద్రం ఐదు రకాలుగా విభజించింది. 1. జనరల్ సర్వీస్, 2. ఎకానమిక్ సర్వీస్, 3. సోషల్ సర్వీస్, 4. సబ్సిడీ, 5. ఇతర స్కీమ్స్ ఉన్నాయి. వీటిలో సబ్సిడీల కోసం ఏకంగా రూ.4.55లక్షల కోట్లను కేంద్రం ప్రతిపాదించింది. ఇందులో ఫుడ్ సబ్సిడీ కోసం రూ.2.28 లక్షల కోట్లు కాగా, ఫెర్టిలైజర్ సబ్సిడీ కోసం రూ. 1.71లక్షల కోట్లను కేటాయించింది. అలాగే, పెట్రోలియం సబ్సిడీ కోసం రూ. 0.12లక్షల కోట్లను ప్రతిపాదించింది.

రాష్ట్రాలకు రూ.4.41లక్షల కోట్లు

ఈ బడ్జెట్ లో కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చే నిధుల విషయాన్ని కూడా ప్రస్తావించింది. రూ.4.41లక్షల కోట్లను 202627 ఆర్థిక సంవత్సరంలో పన్నులు, ఇతర రూపాల్లో ఇవ్వనున్నట్లు పేర్కొంది. ఇందులో 16వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.29 లక్షల కోట్లు ఉంటాయని ఆర్థిక మంత్రి బడ్జెట్ లో ప్రతిపాదించారు.

వడ్డీలకు రూ.14.04లక్షల కోట్లు

20262027 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం వడ్డీ చెల్లింపులకు భారీగా కేటాయింపులు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.14.04లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకే కేటాయించినట్లు కేంద్రం వెల్లడించింది. అలాగే, జీతాల కోసం రూ.1.66లక్షల కోట్లు, పెన్షన్స్ కోసం రూ.2.96లక్షల కోట్లను కేంద్రం ఈ బడ్జెట్ లో ప్రతిపాదించింది.

బడ్జెట్ – 2026

రూపాయి రాక

అప్పులు	24%
ఆదాయ పన్ను	21%
కార్పొరేషన్ పన్ను	18%
జీఎస్టీ, ఇతర పన్నులు	15%
పన్నేతర ఆదాయం	10%
ఎక్సైజ్ డ్యూటీ	6%
కస్టమ్స్ ఆదాయం	4%
రుణం లేని మూలధనం	2%

రూపాయి పోక

రాష్ట్రాలకు పన్ను చెల్లింపులు	22%
రుణాలకు వడ్డీ చెల్లింపులు	20%
కేంద్ర ప్రభుత్వ పథకాలు	17%
రక్షణ రంగం	11%
కేంద్ర ప్రాయోజిత పథకాలు	8%
ఆర్థిక సంఘం, ఇతర బదిలీలు	7%
ఇతర ఖర్చులు	7%
ప్రధాన సబ్సిడీలు	6%
పౌర పింఛన్లు	2%

బడ్జెట్‌లో 43% పథకాలకే

రంగాల వారీగా కేటాయింపులు

రవాణా	రూ. 5,98,520 కోట్లు
రక్షణ	రూ.5,94,585 కోట్లు
గ్రామీణాభివృద్ధి	రూ.2,73,108 కోట్లు
హోంశాఖ	రూ.2,55,234 కోట్లు
వ్యవసాయ అనుబంధ	రూ.1,62,671 కోట్లు
విద్యారంగం	రూ.1,39,289 కోట్లు
ఇంధన రంగం	రూ.1,09,029 కోట్లు
వైద్య, ఆరోగ్యం	రూ.1,04,599 కోట్లు
పట్టణాభివృద్ధి	రూ.85,522 కోట్లు
ఐటీ, టెలికాం	రూ.74,560 కోట్లు
వాణిజ్యం, పరిశ్రమలు	రూ.70,296 కోట్లు
సాంఘిక సంక్షేమం	రూ.62,362 కోట్లు
శాస్త్ర సాంకేతిక రంగాలకు	రూ.55,756 కోట్లు
పన్ను నిర్వహణ	రూ.45,500 కోట్లు
ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్	రూ.22,119 కోట్లు
ఆర్థిక నిర్వహణ	రూ.20,649 కోట్లు
ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి	రూ.6,812 కోట్లు

రక్షణ రంగానికి భారీగా బడ్జెట్

భారత్‌కు ఓ వైపు పాక్, మరో వైపు చైనా, బంగ్లాదేశ్ నుంచి పెరుగుతున్న భద్రత సవాళ్ల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో రక్షణ బడ్జెట్‌ను పెంచింది. ఆపరేషన్ సిందూర్‌తో అత్యాధునిక యుద్ధతంత్రం అవసరాలను గుర్తించిన భారత్ అందుకు తగ్గట్లు కేటాయింపులను చేసింది. గతేడాది రక్షణ రంగానికి రూ.6.81లక్షల కోట్లు కేటాయించగా, ఈసారి రూ.7.85 లక్షల కోట్లు కేటాయించింది. ముఖ్యంగా రక్షణ దళాల ఆధునికీకరణకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేసి దాదాపు 22 శాతం కేటాయింపులను పెంచింది. రక్షణ రంగానికి కేటాయించిన మొత్తం మూలధన వ్యయాన్ని రూ.2,19,306 కోట్లుగా నిర్మలా సీతారామన్ నిర్ణయించారు. రెవెన్యూ వ్యయాన్ని రూ.5,53,668 కోట్లుగా ఉంచారు. ఇందులో రక్షణ రంగానికి చెందిన ఉద్యోగుల పింఛన్ల కోసం రూ.1,71,338 కోట్లు కేటాయించారు. మూలధన వ్యయం కింద విమానాలు, ఏరో ఇంజిన్ల కోసం రూ.63,733 కోట్లు, నౌకాదళం కోసం రూ.25,023 కోట్లు కేటాయించారు.

ప్రాథమిక కస్టమ్స్ సుంకం మినహాయింపు

శిక్షణ, ఇతర విమానాల తయారీకి అవసరమైన విడిభాగాలు, భాగాలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని మినహాయించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. రక్షణ రంగంలోని విమానాల విడిభాగాల తయారీకి దిగుమతి చేసుకునే ముడి పదార్థాలపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ఈ మేరకు వ్యాఖ్యానించారు. నిర్మలమ్మ తీసుకున్న ఈ రెండు నిర్ణయాలు డిఫెన్స్ ఏరోస్పేస్ పరిశ్రమకు మరింత ఊతమిస్తాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

వీటి ధరలు తగ్గుతాయ్..

విదేశీ పర్యాటక ప్యాకేజీలపై ట్యాక్స్ కలెక్ట్ ఎట్ సోర్స్‌ను 2 శాతానికి తగ్గించారు. విదేశీ విద్యపై టీడీఎస్‌ను లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ కింద విద్యాఖర్చుల కోసం తగ్గించారు. ఆల్కహాలిక్ లిక్కర్ తుక్కు, కొన్ని రకాల ఖనిజాలపై కస్టమ్స్ డ్యూటీని 5 శాతం నుంచి 2 శాతానికి కుదించారు. షూ అప్పర్ ఎగుమతుల కోసం అవసరమైన మెటీరియల్ దిగుమతిని డ్యూటీ రహితంగా ప్రకటించారు. సోలార్ గ్లాస్‌లకు సంబంధించిన కీలక మెటీరియల్‌పై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని తొలగించారు. ఎనర్జీ ట్రాన్సిషన్ పరికరాలపై కూడా బీసీడీని తొలగించారు. క్యాపిటల్ గూడ్స్, క్రిటికల్ మినరల్స్‌పై బీసీడీని మినహాయించారు. వ్యక్తిగత వినియోగానికి వాడే పరికరాలపై బీసీడీని 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గించారు. క్యాన్సర్ తదితర అరుదైన వ్యాధులు, డయాబెటిక్ చికిత్సకు వాడే 17 రకాల ఔషధాలపై బీసీడీని పూర్తిగా తొలగించారు. అదేవిధంగా మన దేశ తీరప్రాంతం నుంచి ప్రత్యేక ఆర్థికమండలి పరిధి వరకు ఉన్న సముద్ర జలాల్లో మన జాలర్లు పట్టుకొన్న చేపల ధరలు కూడా తగ్గనున్నాయి. అదేవిధంగా అణు విద్యుత్తు ప్రాజెక్టులకు వాడే పరికరాలు, విద్యుత్తు వాహనాల్లో వాడే బ్యాటరీలు, భారత్‌లో తయారయ్యే స్మార్ట్‌ఫోన్‌లు, ట్యాబ్‌లెట్‌లు, విమానాల విడిభాగాలు తదితర వస్తువులు ధరలు తగ్గే వస్తువుల జాబితాలో ఉన్నాయి.

వీటి ధరలు పెరుగుతాయ్..

ఆదాయం వివరాలు సరిగ్గాచూపని వారికి విధించే జరిమానా 100 శాతానికి పెరగనుంది. బహిర్గతం చేయని చరాస్థులపై జరిమానా విధిస్తారు. విలాసవంతమైన వాచ్‌లు, ఆల్కహాల్, సిగరెట్‌లు, బీడీలు, పాన్ మసాల, గుట్కా ధరలు పెరుగుతాయి. కాఫీ రోస్టింగ్, బ్రూవింగ్, వెండింగ్ యంత్రాల ధరలు కూడా పెరగనున్నాయి. అమోనియం పాస్ఫేట్, అమోనియం నైట్రో పాస్ఫేట్ వంటి వాటి ధరలు పెరుగుతాయి. చిత్రీకరణకు వాడే పరికరాలు, కెమెరాల ధరలు కూడా పెరగనున్నాయి.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించినట్లుగా ఇరాన్‌పై అమెరికా దాడికి దిగితే అది రెండు దేశాలకే పరిమితం కాదు. భీకరమైన ప్రాంతీయ యుద్ధంగా మారుతుంది. తాము యుద్ధాన్ని కోరుకోవడం లేదు. కానీ తమపై దాడి జరిగితే మాత్రం గట్టిగా సమాధానం చెబుతాం.

- ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ

రైతుల కోసం 'భారత్ విస్తార్'

- ప్రాంతీయ భాషల్లో వ్యవసాయ సూచనలిచ్చే ఏఐ టూల్
- వ్యవసాయ రంగానికి రూ.1,27,290 కోట్ల బడ్జెట్
- పశుపోషణ, డైరీ, పౌల్ట్రీ పరిశ్రమలకు 'క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ పథకం'

'భారత్ విస్తార్' పేరుతో ఏఐ బహుభాషా టూల్‌ను తీసుకొస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 'భారత్ విస్తార్' టూల్‌తో కేంద్ర ప్రభుత్వ అగ్రిస్టాక్ వెబ్‌సైట్లను, భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) వ్యవసాయ మార్గదర్శకాలను, అధునాతన ఏఐ సిస్టమ్‌లను అనుసంధానిస్తారు. దేశ రైతుల వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి 'భారత్ విస్తార్'లోని ఏఐ సమాచారం దోహదపడుతుందని నిర్మల తెలిపారు. పంటసాగు చేపట్టే క్రమంలో ముప్పును తగ్గించే విలువైన సలహాలను ఇది అందిస్తుందన్నారు.

పశుపోషణ, ఫిషరీస్, డైరీ, పౌల్ట్రీ రంగాలకు వరాలు

ఈసారి కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.1,27,290 కోట్లు కేటాయించారు. రూ.10,466.39 కోట్లను వ్యవసాయ పరిశోధన, విద్యకు కేటాయించారు. ఫిషరీస్ (మత్స్యకార) రంగం కోసం 500 రిజర్వాయర్లు, అమృత్ సరోవర్‌ల సమీకృత అభివృద్ధి చేయనున్నారు.

దేశంలోని సముద్ర తీర ప్రాంతాల మత్స్యకారులకు చేయూత. స్టార్టప్‌లు, మహిళా సంఘాలు, రైతుల ద్వారా మత్స్యకారులకు మార్కెట్ లింకేజీ ఏర్పాట్లు చేయనున్నారు. పశుపోషణ, డైరీ, పౌల్ట్రీ రంగాల్లోని పరిశ్రమల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు, ఆధునికీకరణ కోసం 'క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ పథకం' అమలు. సప్లై చైన్ వ్యవస్థలను బలోపేతం చేసుకునేందుకు డైరీ, పౌల్ట్రీ పరిశ్రమలకు చేయూతనిచ్చేందుకు నిర్ణయించారు. తద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు ఏర్పాట్లు చేస్తారు. పలు రాష్ట్రాల్లో కొబ్బరి, చందనం (శాండల్ వుడ్), జీడిపప్పు, కొకోవా, అగార్ చెట్లు, బాదం, వాల్ నట్స్, పైన్ నట్స్ లాంటి పంటలను సాగు చేసే దిశగా రైతులకు ప్రోత్సాహం ఇవ్వాలని నిర్ణయించారు. జీడిపప్పు, కొకోవా ప్రాసెసింగ్‌లో భారత పరిశ్రమలు స్వయం సమృద్ధిని సాధించేలా ప్రోత్సాహం ఇవ్వడంతో ఈ విభాగంలో 2030 నాటికి భారతీయ బ్రాండ్ల ఆవిర్భావానికి చేయూత లభించనుంది.

వ్యవసాయ రంగం వల్లే 7 శాతం ఆర్థిక వృద్ధి రేటు

"భారతదేశ ఆర్థిక వృద్ధి రేటు 7 శాతానికి పెరిగిందంటే అందుకు ప్రధాన కారణం వ్యవసాయ రంగమే. మేం వ్యవసాయ రంగ వికాసానికి గతంలోనూ చాలా చర్యలను చేపట్టాం. అవి మంచి ఫలితాలను ఇచ్చాయి. లక్షలాది మంది చిన్న, సన్నకారులు జీవితాల్లో ఎదిగారు. విత్తనాలు, ఎరువులతో ముడిపడిన సప్లైలో రైతులు కొన్ని సవాళ్లను ఎదుర్కొన్నారు. అయినప్పటికీ సాగునీరు, విద్యుత్, ఎరువులను సమర్థంగా వినియోగించుకొని భారత రైతులు పంటల ఉత్పాదకతను పెంచుతున్నారు. దేశంలో దాదాపు కోటి మంది రైతులు, 3 కోట్ల మంది చిరువ్యాపారుల జీవితాలు కొబ్బరిసాగుపై ఆధారపడి ఉన్నాయి. కొబ్బరి ఉత్పత్తిలో ప్రపంచ నంబర్ 1 స్థానంలో భారత్ ఉంది. రైతుల ఆదాయాలను రెట్టింపు చేయడంతో పాటు చిన్న, సన్నకారు రైతులను పైకి తీసుకురావడమే వికసిత భారత్ మిషన్ లక్ష్యం" అని ఆర్థిక మంత్రి నిర్మల చెప్పారు.

రాజకీయం

రాష్ట్రానికి కేటాయింపులు లేకపోవడం అన్యాయం

మొదటిపేజీ తరువాయి

ఒక పైసా ఇవ్వకపోవడం అన్యాయం. హైదరాబాదులో ఎలక్ట్రానిక్ ఎకో సిస్టం విస్తారంగా అభివృద్ధి చెందింది. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈసీఐ లాంటి సంస్థలను హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేయడం జరిగింది ఎలక్ట్రానిక్స్ అంటే హైదరాబాద్ హైదరాబాద్ అంటే ఎలక్ట్రానిక్స్ అన్నట్టుగా ఉన్న తెలంగాణ రాష్ట్రానికి ఈ విభాగంలో కూడా నిధులు ఇవ్వకపోవడం అన్యాయం. ఫార్మ హబ్ గా ప్రపంచానికి హైదరాబాదు గుర్తింపు కోవిడ్ సమయంలో ఈ దేశానికే కాకుండా ప్రపంచాన్ని కూడా భారత్ బయోటెక్ ఔషధాలను అందించింది సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కోవిడ్ సమయంలో సందర్శించారు. కానీ ఫార్మ హబ్ లో కూడా తెలంగాణను పేర్కొనలేదు. తెలంగాణ ప్రభుత్వం క్రీడారంగం పైన ఫోకస్ పెట్టింది గ్లోబల్ సమ్మిట్ లో 2047 విజన్ డాక్యుమెంట్ సందర్భంగా కూడా ప్రపంచ ప్రఖ్యాత క్రీడాకారుడితో క్రీడలు నిర్వహించాం. క్రీడారంగం పైన ప్రత్యేక దృష్టి సారించి ముందుకెళ్తున్న క్రమంలో తెలంగాణ కేంద్రానికి ఎందుకు గుర్తుకు రాలేదు. ఆరెంజ్ ఎకానమిలో హైదరాబాద్ సెంట్రిక్ ముంబైకి తరలించారు. తెలంగాణ ఏమి తప్పు చేసింది. ఆడియో వీడియో గేమింగ్ కామెక్స్ లాంటి వాటికి హైదరాబాద్ నగరం బిగ్గెస్ట్ సెంటర్. ఆరెంజ్ ఎకానమీలో హైదరాబాద్ పై దృష్టి పెట్టకుండా ముంబైలో పెట్టడం ఎంటి హైదరాబాద్ మెడికల్ హబ్ గా అభివృద్ధి చెందుతున్నది దేశంతో పాటు ఇతర దేశాల నుంచి కూడా హైదరాబాదులో అందుబాటులో ఉన్న మెడికల్ ఫెసిలిటీని ఉపయోగించుకోవడానికి వస్తున్నారు. రీజినల్ మెడికల్ వ్యాల్యూ హబ్ లో ఇతర రాష్ట్రాలకు ఇచ్చి తెలంగాణకు ఎందుకు ఇవ్వలేదు. టూరిజం విభాగంలో కూడా తెలంగాణ రాష్ట్రాన్ని పొందుపరచకపోవడం అన్యాయం యునెస్కో గుర్తించిన రామప్ప లాంటి హెరిటేజ్ దేవాలయం మన్ననూరు టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్ వాటర్ ఫాల్స్ కృష్ణ గోదావరి తీరం వెంట ఉన్న ఆలయాలు అటవీ ఇటీవల జరిగిన మేడారం సమ్మక్క సారక్క జాతరకు న్యూజిలాండ్ దేశస్తులు వచ్చి దర్శించుకున్నారు ఇంత గొప్పగా ఉన్న తెలంగాణ టూరిజంను ప్యాకేజీలో పేర్కొనలేదు. రేర్ ఎర్త్ మినరల్స్ లో కూడా తెలంగాణ పై కేంద్రం దృష్టి సారించ లేదు. ఇప్పటికే సింగరేణి సంస్థ సత్తుపల్లి రామగుండంలో స్కాండియం, లిథియంను వెలికితీయడానికి రేర్ ఎర్త్ మినరల్స్ ప్రాసెస్ ను నడుపుతున్నది. తెలంగాణ రాష్ట్రానికి సెమీ కండక్టర్ మంజూరు చేయాలని ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు స్వయంగా వెళ్లి ప్రధానమంత్రిని కలిసినప్పటికీ బడ్జెట్లో మిగతా రాష్ట్రాలకు ఇచ్చి తెలంగాణకు మొండి చేయి చూపించారని మండిపడ్డారు. ఎస్సీ ఎస్టీ మైనార్టీల సంక్షేమంపై ఈ బడ్జెట్ లో దృష్టి సారించలేదు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచే పని చేస్తున్నారు దీనివల్ల గ్రామీణ ప్రాంత పేదలకు తీవ్ర నష్టం జరగనుంది కేంద్ర ప్రభుత్వం తీసుకున్న వికసిత్ భారత్ గోలుకు కాంట్రిబ్యూట్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 2047 నాటికి త్రీ మిలియన్ డాలర్ ఎకానమీగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ లక్ష్యం చేరుకోవడానికి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి బలమైన పునాదులకు ప్రోత్సాహం అందించి ముందుకెళ్లాల్సిన కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా పెట్టుకొని రాజకీయాల కతీతంగా తెలంగాణ పార్లమెంటు సభ్యులు ఈ బడ్జెట్ సెషన్ లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ లను కలిసి నిధులు కేటాయించాలని వినతి పత్రాలు ఇవ్వాలని కోరుతున్నాను. ఫిజికల్ డెఫిషిట్ లో రాష్ట్రానికి నాలుగు శాతం ఉండాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది కానీ కేంద్రం మాత్రం 4.3 శాతం ఫిజికల్ డెఫిషిట్ పెట్టుకుంది తెలంగాణకు మాత్రం అనుమతి ఇవ్వలేదు తెలంగాణ దేశంలో అంతర్భాగం కాదా? ప్రజల జీవన ప్రమాణాలు ఆర్థిక గతులు పెంచడానికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించే వీలుగా బడ్జెట్ ఉండాలని ఆశిస్తున్నానకక్ష్య సాధింపు చర్యలకు ఈ ప్రభుత్వం పాల్పడదు అత్యంత ప్రజాస్వామ్యతమైన పరిపాలన అందించడమే మా ప్రజా ప్రభుత్వం ధ్యేయంరాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బడ్జెట్ ఉందన్నారు.

సిట్‌కు సహకరించండి తప్పు చేస్తే శిక్ష అనుభవించండి

- ఫోన్ ట్యాపింగ్ ఆధారాలు చేరిపివేసి.. ఇప్పుడు తెలంగాణ ఆత్మ గౌరవం గుర్తుకు వస్తుందా
- బీఆర్ఎస్ నేతలపై ఎంపీ చామల కిరణ్ కుమార్ ఆగ్రహం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 1: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్‌ను సిట్ విచారణకు పిలిచిన నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆందోళనలపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఆదివారంఢిల్లీలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ... ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇస్తే తెలంగాణ ఆత్మ గౌరవం అంటూ లబోదిబోమంటున్నారని.. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్‌కు తెలియకుండా ఫోన్ ట్యాపింగ్ కోసం ఇజ్రాయిల్ నుంచి పరికరాలు కొనుగోలు చేస్తారా అని నిలదీశారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్‌లో సీసీ కెమెరాలు బంద్ చేసి పరికరాలు, ఫైల్స్ ధ్వంసం చేసి మూసీ నదిలో, వికారాబాద్ అడవుల్లో పడేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో పింకీలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా ఎవరినీ ఎదగకుండా చేద్దామనే కుట్ర చేశారని ఎంపీ ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ ఆధారాలు చేరిపేసి ఇప్పుడు తెలంగాణ ఆత్మ గౌరవం గుర్తుకు వస్తుందా అని ఫైర్ అయ్యారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ పౌర హక్కులు హరించబడ్డాయని.. ప్రతిపక్ష నాయకులు, అధికారులు, సొంత బిడ్డ, అల్లుడి ఫోన్ ట్యాప్ చేశారని విమర్శించారు. తెలంగాణలో అరాచక పాలన చేశారని కవిత చెప్పారని తెలిపారు. టీఆర్ఎస్ పేరులో తెలంగాణ అనే పదాన్ని తీసివేసి బీఆర్ఎస్ అని పెట్టినప్పుడు తెలంగాణ ఆత్మగౌరవం ఎక్కడికి పోయిందని నిలదీశారు. తెలంగాణ ప్రజలకు ముళ్ళు గుచ్చుకుంటే పంటితో తీస్తా అని కేసీఆర్ చెప్పారని.. తెలంగాణ అమరవీరులను విస్మరించినప్పుడు కేసీఆర్‌కు తెలంగాణ ఆత్మ గౌరవం గుర్తుకు రాలేదా అని ఎంపీ ప్రశ్నలు సంధించారు.

తెలంగాణకు కేటాయింపులు ఇవే

మొదటిపేజీ తరువాయి

పన్నుల నుంచి రాష్ట్రానికి వచ్చే వాటాలో స్వల్ప పెరుగుదల కనిపించగా, మౌలిక వసతుల కల్పనలో భాగంగా హైదరాబాద్కు మూడు హైస్పీడ్ రైల్వే కారిడార్లను ప్రతిపాదించారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో కేంద్రం వసూలు చేసే పన్నుల్లో రాష్ట్రాలకు పంచే వాటా కింద ఈసారి తెలంగాణకు 2.174 శాతం ఖరారైంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి మొత్తం రూ.33,180.78 కోట్లు రానున్నాయి. ఇందులో కార్పొరేషన్ పన్ను రూ.9,740.28 కోట్లు, ఆదాయపు పన్ను రూ.11,808.15 కోట్లు, కేంద్ర జీఎస్టీ (సీజీఎస్టీ) రూ.9,074.92 కోట్లు, కస్టమ్స్ సుంకం రూ.1,770.30 కోట్లు, కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ రూ.754.15 కోట్లు, ఇతర ట్యాక్సుల రూ.32.98 కోట్లు ఉన్నాయి. సింగరేణికి రూ.2,500 కోట్లు కేంద్రం కేటాయించింది. కాగా గత బడ్జెట్లో కేంద్రం పన్నుల రూపంలో తెలంగాణకు రూ.29,899.77 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. గతేడాదితో పోలిస్తే రాష్ట్రానికి వస్తున్న పన్నుల నిధులు రూ.3,281.01 కోట్లు అధికం.

దేశ హితం, ప్రజా సంక్షేమం కోసమే కేంద్ర బడ్జెట్

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

దేశ హితం, ప్రజా సంక్షేమం కోసమే కేంద్ర వార్షిక బడ్జెట్ అని కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. ఈ బడ్జెట్ ద్వారా తెలంగాణకే కాదు, యావత్ దేశానికి న్యాయం జరుగుతుందన్నారు. ఇక హైదరాబాద్ మెట్రో రెండోదశ విస్తరణకు ఇప్పటికే సూత్రప్రాయంగా కేంద్రం అంగీకారం తెలిపింది ఆయన వెల్లడించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించిన కేంద్ర బడ్జెట్ అభివృద్ధి మంత్రమని, ప్రతి విభాగం, అన్ని రంగాలను పరిగణనలోకి తీసుకున్నారని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. ఆర్థిక మంత్రికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర బడ్జెట్ 2026.27 భారతదేశ యువత, మహిళలు, రైతులను ప్రోత్సహిస్తూ.. ఆర్థిక వృద్ధి, జాతీయ అభివృద్ధిలో భాగం చేశారన్నారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో ఈ బడ్జెట్ ను సమర్పించారు. అభివృద్ధి చెందిన భారతదేశం వైపు నిర్ణయాత్మక అడుగులు వేస్తున్నందుకు, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నాను" అని ఆయన అన్నారు.

కేంద్ర ప్రభుత్వానిది వివక్షాపూరిత సమాఖ్య ధోరణి

మంత్రి శ్రీధర్ బాబు

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 1 ప్రకారం.. ఇండియా అంటే రాష్ట్రాల సమూహం . రాష్ట్రాల ఆర్థిక స్వావలంబన లేనిదే దేశాభివృద్ధి సాధ్యపడదని రాజ్యాంగం చెబితే, కేంద్రం మాత్రం ఈ బడ్జెట్ లో ఆ మూలసూత్రాన్నే విస్మరించింది" అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విమర్శించారు. దేశ జీడీపీలో 5 శాతానికి పైగా వాటాను కలిగి ఉన్న తెలంగాణ గురించి బడ్జెట్ ప్రసంగంలో ఒక్కసారి కూడా ప్రస్తావించకపోవడం గర్హనీయమని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రం తరచూ వల్లించే "సబ్ కా సాథ్ సబ్ కా వికాస్" అనే నినాదం "తెలంగాణ" విషయంలో కేవలం నీటి మూటలేనని మరోసారి ఈ బడ్జెట్ లో స్పష్టం అయ్యిందన్నారు. "హై స్పీడ్ రైల్ కారిడార్స్"తో "తెలంగాణ"కు మమ అనిపించిన కేంద్ర ప్రభుత్వ వివక్షపూరిత వైఖరిపై తెలంగాణ నుంచి బీజేపీ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న 8 మంది ఎంపీలు ఈ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. ఇకనైనా కేంద్రం తన ధోరణిని వీడి, రాజ్యాంగబద్ధమైన సమానత్వం పాటించాలని కోరారు.

తెలంగాణకు బడ్జెట్‌లో బూడిదే!

- టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

"తెలంగాణకు కేంద్ర బడ్జెట్ లో కనీస గౌరవం కూడా దక్కలేదు. ఇది రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవంపై దాడి" అని విమర్శించారు. కేంద్రం తీరు మార్చుకోకపోతే కాంగ్రెస్ పార్టీ ప్రజలతో కలిసి రోడ్డెక్కుతుందని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, "మూసి పునరుజ్జీవనానికి హామీలు... మెట్రో విస్తరణకు ఆశలు... స్పోర్ట్స్ యూనివర్సిటీకి మాటలు... అన్నీ బడ్జెట్ తో గాలిలో కలిశాయి. తెలంగాణ యువత, రైతులు, పర్యాటక రంగంపై కేంద్రం మొండి చేయి చూపింది" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

డీసీసీ స్థాయిలో ఆందోళన పిలుపు

కేంద్ర బడ్జెట్ లో జరిగిన అన్యాయానికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కాంగ్రెస్ కమిటీలు (డీసీసీలు) ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చాయి. జిల్లా కేంద్రాల్లో నిరసన ర్యాలీలు, ధర్నాలు, కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని డీసీసీ అధ్యక్షులు ప్రకటించారు.

ఎస్ఎల్బీసీ పనుల పునరుద్ధరణకు ప్రణాళికలు

మొదటిపేజీ తరువాయి

నిలిచి పోయిన ఎస్ఎల్బీసీ పనుల పునరుద్ధరణ కై చేపట్టిన హెలిబోర్న్ సర్వే నివేదిక ప్రభుత్వానికి చేరిందని ఆయన చెప్పారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువతో పాటు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన మెడిగడ్డ, సుందిళ్ళ, అన్నారం బ్యారేజ్ ల పునరుద్ధరణ పనులపై ఆయన ఆదివారం సాయంత్రం నీటిపారుదల శాఖాధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఎల్బీసీ సొరంగ మార్గం మిగిలిన భాగం పూర్తి చేయడానికి అవసరమైన నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సహకారంతో నిర్వహించిన ఏరియల్ ఎలాక్ట్రో మాగ్నెటిక్ సర్వే నివేదిక ప్రభుత్వానికి చేరిందని ఆయన తెలిపారు. సొరంగమార్గం పూర్తికి సర్వే ఆధారంగా రూపొందించిన నివేదిక దోహద పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భౌగోళికంగా ప్రతికూల పరిస్థితిలు ఏర్పడితే ముందస్తుగా బందోబస్తు చర్యలు చేపట్టడానికి ఈ సర్వే ఉపకరిస్తుందని ఆయన పేర్కొన్నారు. సొరంగమార్గం పూర్తి చేయడానికి గాను ఆధునిక పరిజ్ఞానం వినియోగించడంతో పాటు శాస్త్రీయ పద్ధతిలో నిరంతరం అధికారుల పర్యవేక్షణలో పనులు కొనసాగేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు నిర్వహణకై ప్రత్యేకంగా డివిజన్ ఏర్పాటు చేయడంతో పాటు ఆపరేషన్ బృందానికి ప్రత్యేక చీఫ్ ఇంజనీర్ ను నియమించాలని ఆయన అధికారులను ఆదేశించారు. నిర్మాణం జరుగుతున్న సమయంలో ఎప్పటికప్పుడు భద్రతా, నాణ్యత ప్రమాణాలను పాటించేలా చూడడంతో పాటు అధికారులు రూపొందించిన డిజైన్ ప్రకారం నిర్మాణం కొనసాగేందుకు వీలుగా ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన చీఫ్ ఇంజినీర్ కు సహకరించేలా ఉండేందుకు స్వతంత్ర పర్యవేక్షణ కన్సల్టెంట్ ను నియమించాలని ఆయన సూచించారు. నిరంతరం పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు గాను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ క్షేత్ర స్థాయిలో భాగస్వామ్యులు అవుతారని ఆయన చెప్పారు. అదే సమయంలో సొరంగ మార్గంలో ఏర్పడుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు గాను ప్రత్యేక జియో టెక్నికల్, జియాలజికల్ బృందాలను ఏర్పాటు చేయాలని ఆయన చెప్పారు. దీనితో పాటు కాళేశ్వరం బ్యారేజ్ ల పనుల పునరుద్ధరణ పనులు వేగవంతంచేయడానికి అవసరమైన సాంకేతిక సంస్థలను, డిజైన్ కన్సల్టెంట్స్ సమన్వయం ఆవశ్యకత గురుంచి ఆయన వివరించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నిర్వహించే పరీక్షల షెడ్యూల్, ప్రాజెక్ట డిజైనర్ల పనితో సమన్వయం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పరస్పరం సమన్వయం చేసుకుంటూ పోతే కేంద్ర జల వనరుల సంఘం పరిధిలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నుండి డిజైన్ లకు దశలవారిగా అనుమతులు పొందడం సులభతరమౌతుందని ఆయన చెప్పారు .ఈ మేరకు ఫిబ్రవరి 16 తరువాత ఎన్.డి.ఎస్.ఏ నిపుణుల కమిటీ తో సమావేశం నిర్వహించాలని అధికారులకు సూచించారు. పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు అవసరమైన అనుమతులు పొంది పనులు వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు.. పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు అవసరమైన అనుమతులు పొంది పనులు వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు.

ఫోన్ ట్యాపింగ్ చేయమని ఆదేశాలిచ్చారా?

మొదటిపేజీ తరువాయి

ప్రశ్నించారు. ఆధారాలో కూడిన ప్రశ్నలను వేయడంతో కేసీఆర్ఒకింత ఇబ్బందిపడినట్లు సమాచారం. ముఖ్యంగా ఈ కేసులో నింధితులుగా ఉన్న వారు ఇచ్చిన వాగ్మూలాన్ని కేసీఆర్ఎదుట ప్రశ్నించినట్లు సమాచారం.

సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా..

నందినగర్ నివాసంలో కేసీఆర్‌ను ఆరుగురు అధికారుల బృందం ప్రశ్నించింది. గతంలో సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా కేసీఆర్‌ను సిట్ అధికారులు ప్రశ్నించారు. కేసీఆర్ ఎదుట ఆధారాలు ఉంచి ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు అంశంపై ఆడియోలు ఎలా వచ్చాయనే అంశంపై సిట్ సుదీర్ఘంగా విచారణ చేపట్టింది. ఈ కేసు విచారణని ముగించుకున్న అనంతరం కేసీఆర్ నివాసం నుంచి సిట్ అధికారులు వెళ్లిపోయారు. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ ఆదేశాలు ఎవరి సూచనలతో జారీ అయ్యాయన్న విషయంపై, నిర్ణయ ప్రక్రియలో కేసీఆర్ పాత్రపై సిట్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

ఫోన్ ట్యాపింగ్ చేయమని ఆదేశాలు జారీ చేశారా?

ఫోన్ ట్యాపింగ్ చేయమని ఆదేశాలు జారీ చేశారా? అని నేరుగా ప్రశ్నించారు. ఈ విచారణలో భాగంగా సిట్ అధికారులు కేసీఆర్‌ను నేరుగా ప్రశ్నించారు. 'ఫోన్ ట్యాపింగ్ చేయమని ఇంటెలిజెన్స్ అధికారులకు మీరు స్వయంగా ఆదేశాలు జారీ చేశారా?' అనే ప్రశ్నను స్పష్టంగా అడిగినట్లు సమాచారం. ఈ అంశంపై కేసీఆర్ నుంచి క్లారిటీ తీసుకునేందుకు సిట్ అధికారులు తీవ్రంగా ప్రయత్నించినట్లు తెలిసింది. ఏ సంవత్సరం నుంచి ఫోన్ ట్యాపింగ్ మొదలైంది?, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఎప్పటి నుంచి ప్రారంభమైందనే విషయంపై సిట్ అధికారులు ప్రత్యేకంగా ఆరా తీశారు. 'ఏ సంవత్సరం నుంచి ఫోన్ ట్యాపింగ్ చేయమని చెప్పారు?, అది సాధారణ భద్రత కోసమా? లేక రాజకీయ అవసరాల కోసమా?' అంటూ పలు అనుబంధ ప్రశ్నలు వేసినట్లు సమాచారం. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేశారా?, ఈ విచారణలో అత్యంత కీలకంగా మారిన ప్రశ్న ఇదేనని చెబుతున్నారు. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాప్ చేయమని ఆదేశాలు ఇచ్చారా? అంటూ సిట్ అధికారులు నేరుగా ప్రశ్నించిందని సమాచారం. ఈ ప్రశ్నపై కేసీఆర్ ఇచ్చిన సమాధానాలు సిట్ దర్యాప్తుకు కీలకంగా మారనున్నాయి.

ప్రభాకర్ రావుకు పదవిని ఎందుకు పొడిగించారు?

ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు వ్యవహారం కూడా సిట్ అధికారుల విచారణలో ప్రధాన అంశంగా మారింది. పదవీకాలం ముగిసిన ప్రభాకర్ రావుకు మళ్లీ పదవిని ఎందుకు పొడిగించారు? ఆ నిర్ణయం వెనుక కారణాలు ఏంటి? అంటూ కేసీఆర్‌ను సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఒకే వ్యక్తికి రెండు కీలక పోస్టులు ఎందుకు? పరిపాలనా నియమావళికి విరుద్ధంగా ఒకే వ్యక్తికి రెండు కీలక బాధ్యతలు అప్పగించడంపై కూడా సిట్ అధికారులు ప్రశ్నలు సంధించారు. ఒకే వ్యక్తికి రెండు కీలక పోస్టులు ఎందుకు అప్పగించారు?, అది ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో సంబంధం ఉందా? అనే కోణంలో విచారణ సాగినట్లు సమాచారం.

ఎమ్మెల్యే కొనుగోలు కేసులో సమాచారం ఎలా వచ్చింది?

ఎమ్మెల్యే కొనుగోలు కేసు సమయంలో తీసుకున్న చర్యలపై కూడా సిట్ అధికారులు ప్రశ్నించారు. 'మీ పార్టీ ఎమ్మెల్యేలు ఇతర పార్టీలకు వెళ్తున్నారని మీకు ఎలా తెలిసింది?, ఆ సమాచారం ఫోన్ ట్యాపింగ్ ద్వారానే వచ్చిందా? అన్న అనుమానాలతో అధికారులు ఆరా తీసినట్లు తెలుస్తోంది. పార్టీ ఫండ్‌తో ఫోన్ ట్యాపింగ్ పరికరాల కొనుగోలు? చేశారా అని సెట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. ఈ విచారణలో మరో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. ఫోన్ ట్యాపింగ్ పరికరాల కొనుగోలుకు పార్టీ ఫండ్‌ను కేటాయించారా? ప్రభుత్వ నిధులు కాకుండా పార్టీ డబ్బులు ఎందుకు ఉపయోగించారు? అంటూ సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. ఈ విచారణలో అత్యంత సంచలనంగా మారిన ప్రశ్న ఇదేనని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. 'మీ పార్టీకి ఎలక్టోరల్ బాండ్స్ ఇచ్చిన వారి ఫోన్ నంబర్లు ట్యాపింగ్ లిస్ట్‌లో ఎందుకు ఉన్నాయి?, ఈ ప్రశ్నపై కేసీఆర్ వివరణ కోరుతూ సిట్ అధికారులు తీవ్రంగా విచారణ చేసినట్లు తెలుస్తోంది. మొత్తంగా ఫోన్ ట్యాపింగ్ నిర్ణయం ఎవరు తీసుకున్నారు? ఎలాంటి అధికారిక ఫైళ్లు ఉన్నాయి? భద్రతా కారణాల పేరుతో రాజకీయ ప్రయోజనాల కోసం ట్యాపింగ్ జరిగిందా? అన్న అంశాలపై సిట్ అధికారులు సమగ్ర విచారణ జరిపినట్లు తెలుస్తోంది. కేసీఆర్ వయస్సు, భద్రతా కారణాల దృష్ట్యా, సిట్ అధికారులు ఆయన నివాసంలోనే విచారణ జరుపుతున్నారు. ఈ విచారణ సమయంలో మాజీమంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, సంతోశ్ రావు, న్యాయ నిపుణులు నందినగర్ నివాసంలోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విచారణను రాజకీయ కక్షసాధింపుగా అభివర్ణిస్తూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు నిరసనలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. కేసీఆర్‌పై సిట్ అధికారుల విచారణ తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఇది రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణం అంటూ విమర్శలు గుప్పిస్తున్నాయి. బీఆర్ఎస్ వర్గాలు మాత్రం ఇది రాజకీయ కక్ష సాధింపే అంటూ ఆరోపణలు చేస్తున్నాయి

నేటి నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్

- సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహణ
- 1,440 కేంద్రాలను ఏర్పాటు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి1: రాష్ట్రవ్యాప్తంగా రేపటి నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ ప్రారంభమవుతాయని, అందుకు 1,440 కేంద్రాలను ఏర్పాటు చేశామని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య వెల్లడించారు. అన్నీ ప్రాక్టికల్ కేంద్రాల్లో 6 నుంచి 8 సీసీ కెమెరాల చొప్పున ఏర్పాటు చేస్తామని, ఇంటర్ బోర్డు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షిస్తామని తెలిపారు. ఇంటర్ బోర్డు కార్యాలయంలో అధికారులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీసీ విద్యార్థులు 2,74,007 మంది, బైపీసీ విద్యార్థులు 1,33,415 మంది ప్రాక్టికల్స్‌కు హాజరవుతారని కృష్ణ ఆదిత్య అన్నారు. వారితో పాటు ఒకేషనల్ విద్యార్థులు మరో 1,18,770 మంది (ప్రథమ, ద్వితీయ) హాజరవుతారని అన్నారు. వారి కోసం మరో 484 ప్రాక్టికల్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్షల నిర్వహణ కోసం 7,559 మంది ఎగ్జామినర్లను నియమించామని తెలిపారు. ప్రాక్టికల్స్‌కు సంబంధించి ప్రత్యేకంగా ఇచ్చే హాల్ టికెట్ల లింక్‌ను విద్యార్థుల ఫోన్లకు పంపించామని, విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉంటే 9240205555 అనే టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. దాదాపు 35 నుంచి 40 శాతం మంది విద్యార్థులు రాత పరీక్షల్లో ఫెయిల్ అవుతుండగా ప్రాక్టికల్స్‌లో మాత్రం ఒక్కో సబ్జెక్టులో 30కి 28 నుంచి 30 మార్కులు ఎలా వస్తున్నాయన్న ప్రశ్నపై కృష్ణ ఆదిత్య స్పందిస్తూ దానిపై అధ్యయనం చేస్తామని వెల్లడించారు.

ఫిబ్రవరి 25 నుంచి పరీక్షలు ప్రారంభం ..

ఇంటర్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 25 తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 25న ఫస్ట్ ఇయర్, 26న సెకండియర్ పరీక్షలు మొదలు కానున్నాయి. సబ్జెక్టుల వారీగా పరీక్షల కాలపట్టికను ఇంటర్ బోర్డు గతంలో విడుదల చేసింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాత పరీక్షలు నిర్వహిస్తారు. ప్రయోగ పరీక్షలు ఫిబ్రవరి 2 నుంచి 21 వరకు ప్రతి రోజూ 2 షిఫ్టుల్లో నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి 12, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ప్రాక్టికల్స్ జరుగుతాయి. ఇంగ్లీష్‌లో ప్రాక్టికల్స్ (20 మార్కులకు) ఫస్టియర్ విద్యార్థులకు జనవరి 21న, సెకండియర్‌కు 22న జరుగుతాయి. ప్రథమ ఏడాది విద్యార్థులకు జనవరి 24వ తేదీన పర్యావరణ విద్య పరీక్ష నిర్వహిస్తామని కృష్ణ ఆదిత్య తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ కలిపి సుమారు 9.50 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

"

రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌ను కాపాడటంలో రాజీపడే ప్రసక్తే లేదు. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎవరినీ వదలి పెట్టం. ఏపీ రాజకీయాలను నేరమయం చేసిన సంస్కృతి వైసీపీదే. రాష్ట్ర పునర్నిర్మాణాన్ని ప్రతిపక్షం తట్టుకోలేకపోతోంది. ఆ పార్టీ పాలన అంతా చట్టరహితంగా సాగింది. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నిబంధనలు అందరికీ ఒకటే.

- ఏపీ సీఎం చంద్రబాబు

బహుళ

సమీక్ష

కదిలించే జీవన గాథలు ‘అవరోధాలే అవకాశాలు’

ప్రొ. రవీందర్ రేనా
+27 847828059

అవరోధాలను దాటుకుంటూ,
అవమానాలను ఓర్పుగా మోస్తూ,
కన్నీళ్లను ధైర్యంగా తుడుచుకుంటూ
నిలబడ్డ కొంతమంది అసాధారణ వ్యక్తుల
జీవిత ప్రయాణాలే “ఈ అవరోధాలే అవకాశాలు”.

ఈ పుస్తకంలోని ప్రతి వ్యాసం ఒక వ్యక్తి గెలుపు కథ మాత్రమే కాదు ఓడిపోకుండా నిలబడిన మనిషి ఆత్మవిశ్వాసానికి సాక్ష్యం. వెనుకడుగులు వేయాలని పరిస్థితులు బలవంతం చేసినా, ముందడుగు వేయాలని మనసు చెప్పినప్పుడు జీవితం ఎలా మలుపు తిరుగుతుందో ఈ రచనలు తెలియజేస్తాయి. కోట దామోదర్ గారి కలం తన అనుభవాలను, ఆవేదనలను, ఆశలను ఎంతో సూటిగా పాఠకుల హృదయాల్లో నాటుతుంది. ప్రతి వ్యాసాన్ని చదువుతుంటే, అది కేవలం ఒక కథగా కాకుండా మన జీవితానికే అద్దం పట్టినట్టుగా అనిపిస్తుంది. ఆయన రచనల్లోని నిజాయితీ, జీవన స్పర్శ పాఠకుడిలో మెల్లగా “నేనూ చేయగలను” అనే ఆత్మవిశ్వాసాన్ని మొలకెత్తిస్తుంది. ఇదే ఆయన రచనల గొప్పతనం, పాఠకులను ముందుకు నడిపించే అసలైన శక్తి.

గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి మెకానిక్ ఇంజనీరింగ్ లో డిప్లొమా పూర్తి చేసిన వ్యాసకర్త కోట దామోదర్ రచించిన "అవరోధాలే అవకాశాలు" వ్యాస సంపుటి పాఠకులకు జీవితం పైన పాజిటివ్ దృక్పథాన్ని కలగజేస్తుంది. కొన్ని సందర్భాల్లో ఊరటనిస్తుంది. ఎంతోమంది సామాన్యులు..తమ నిరంతర సాధన,పట్టుదలతో అసాధారణ వ్యక్తులుగా ఎదగడంలోని కృషిని, జీవన విలువలను తెలియజేస్తుంది. ఈ పుస్తకం లోని 27 వ్యాసాలు ఏదో విధంగా పాఠకుల మనసులకు సాంత్వన చేకూర్చేవే. స్ఫూర్తిని అందించేవే..!. సమస్యలు వచ్చినప్పుడు బాధపడుతూ ఉండే దానికన్నా, ధైర్యం మరియు దృఢ సంకల్పంతో ముందుకు సాగడానికి ప్రయత్నించు అంటారు రచయిత.

అవరోధాలనే అవకాశాలుగా మార్చుకుంటే ఎన్నో అద్భుతాలను సృష్టించవచ్చని చెప్పిన స్వామి వివేకానంద స్ఫూర్తితో... మనిషికి వైకల్యం ఉన్నా, పూర్ణ సుందరి ఐఏఎస్ గా ఎదిగిన యథార్థ జీవిత కథను తనదైన శైలితో వివరించారు. అవరోధాలు మనల్ని ఆపేందుకు కాదు, మనలోని శక్తిని వెలికి తీయడానికి వచ్చిన అవకాశాలు. శారీరక పరిమితులు విజయానికి అడ్డంకులు కావు; ఆత్మ విశ్వాసం, పట్టుదల, స్పష్టమైన లక్ష్యం ఉంటే ఏ వైకల్యాన్నైనా జయించవచ్చు. జీవితంలో ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని నిర్ధారించుకొని, ఎన్ని కష్టాలు ఎదురైనా నిరంతర కృషితో ముందుకు సాగితే విజయం తప్పక అతనిదే. జీవిత పాఠాలతో మనల్ని మనమే మలుచుకుంటూ, ఇతరులకు మార్గనిర్దేశం చేసే స్థాయికి ఎదగడమే నిజమైన విజయం అంటారు రచయిత కోట దామోదర్.

ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన మహా అథ్లెట్ "ఉసేన్ బోల్ట్" జీవితాన్ని రచయిత అత్యంత స్ఫూర్తివంతంగా ఆవిష్కరించారు. అలుపెరుగని కృషి, అచంచలమైన పట్టుదలతో తొమ్మిదేళ్ల పాటు ప్రపంచ అథ్లెటిక్స్ రంగాన్ని ఏలిన మకుటం లేని రాజుగా బోల్ట్ నిలిచాడని వివరించారు. ఎన్నో ప్రపంచ రికార్డులు, ఒలింపిక్ విజయాలు సాధించినప్పటికీ, “నేను మీలాంటి సామాన్యుడినే” అని గర్వం లేకుండా చెప్పుకోవడం అతని మానవత్వానికి అద్దం పడుతుంది. బోల్ట్‌కు చిన్ననాటి నుంచి ఎక్కువగా నచ్చిన ఆట క్రికెట్ అయినప్పటికీ, తన కోచ్ ఇచ్చిన సలహాలు గౌరవించి రన్నింగ్ వైపు అడుగులు వేయడం అతని జీవితానికి మలుపుగా మారింది. అదే నిర్ణయం అతన్ని ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన మనిషిగా, విశ్వవిజేతగా నిలిపింది. ఈ వ్యాసం ద్వారా రచయిత తెలియజేసిన ముఖ్య సందేశం ఏమిటంటే సరైన మార్గనిర్దేశం, కష్టం, వినయం కలిసినప్పుడు అసాధ్యమనే మాట ఉండదు. ఉసేన్ బోల్ట్ జీవితం ప్రతి యువతకు స్ఫూర్తిగా నిలుస్తుంది.

అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి వయసు అడ్డంకి కాదని నిరూపించిన విజయవంతమైన వ్యక్తులను మనం చూస్తూనే ఉంటాం. ప్రవీణ్ తాంబే ఆ కోవకు చెందిన వారంటూ.. ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో అతని జీవన ప్రస్థానం ఎలా కొనసాగిందో ఆసక్తికరంగా వివరించారు. సాటి మానవుల పట్ల ప్రేమ దయ కలిగి ఉండటం మరియు సేవా తత్పరత జీవిత పరమార్థమని మదర్ థెరిసా జీవిత సందేశాన్ని ఓ వ్యాసంలో వివరించారు. పద్మశ్రీ కె. ఎస్. రాజన్న తన సామాజిక సేవలో ముందుకెళ్లినా వైనాన్ని దివ్యాంగుల తో పాటు.. నేటి యువతకు కూడా ఆదర్శమన్నారు. నేటి విద్యా వ్యవస్థలో జ్ఞాన సముపార్జన కంటే అధిక మార్కులు సాధించడానికే ఎక్కువ ప్రాధాన్యత ఉందనీ... విషయ పరిజ్ఞానం కోసం కాకుండా కేవలం మార్కులు, సర్టిఫికెట్ల కోసం చదవడం వల్ల చదువుకు విలువ లేకుండా పోతుందని ఆందోళన చెందారు.

ఈ వ్యాసాలలో రచయిత సమాజంలో మార్పు తీసుకు వచ్చిన గొప్ప వ్యక్తుల జీవితాలను అద్భుతంగా వివరించారు. ఎన్నో సామాజిక అడ్డంకులు, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా వెనకడుగు వేయకుండా, ఏడు సంవత్సరాల కఠినమైన శ్రమ తో చేనేత కార్మికుల కష్టాలు తగ్గించేందుకు “లక్ష్మీ ఆసు” యంత్రాన్ని కనుగొన్న చింతకింది మల్లేశం జీవితం ద్వారా ఆవిష్కరణకు పట్టుదల ఎంత ముఖ్యమో తెలియజేశారు.

ఇంకొక వ్యాసంలో, ఆపదలో ఉన్నవారికి సహాయం చేసే ప్రతి మనిషి భగవంతుడితో సమానమని, ప్రజలకు సేవ చేయాలనే తపన ఉన్నవారికి డబ్బు కంటే మంచి మనసే అసలైన సంపద అనే సందేశాన్ని ఒక నిజ జీవిత సంఘటన ద్వారా హృద్యంగా అందించారు.

మరొక వ్యాసంలో, “ఈ దేశ పౌరుడిగా నాకు విద్యనభ్యసించే హక్కు ఉంది” అంటూ సమానత్వం కోసం న్యాయస్థానంలో పోరాడిన ఉద్యమ వీరుడి కథను వివరించి, హక్కుల కోసం పోరాటం చేయడం ప్రజాస్వామ్యంలో ఎంత అవసరమో బలంగా చాటారు.

ఇవి కేవలం వ్యాసాలు కావు...
జీవితానికి దారి చూపే దీపాలు.

పుస్తకాల కొరకు
సంప్రదించండి

అవరోధాలే అవకాశాలు
(వ్యాసాలు)
రచయిత: కోట దామోదర్
మొబైల్ 9391480475
ధర: 200



నిరాశలో ఉన్నవారికి ఆశ్వాసం,
అలసిపోయిన వారికి ఉత్తేజం,
సంకల్పం కోల్పోయిన వారికి స్ఫూర్తి.

అవరోధాలే అవకాశాలవుతాయని
నమ్మించే శక్తి ఈ పుస్తకానికి ఉంది.
జీవితం ఎదురయ్యే ప్రతి కష్టాన్ని
ఒక పాఠంగా, ఒక మెట్టుగా మార్చుకోవచ్చని
ఈ పుస్తకం మౌనంగా చెబుతుంది.

ఈ పుస్తకంలోని ప్రతి వ్యాసం ఒక నిజ జీవిత కథ ఆధారంగా చేసుకుని, జీవితం పట్ల ఆశావాదాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పాఠకులలో నింపుతుంది. పేదరికం, ఆకలి, పరిమితులు, ఓటమి విజయానికి అడ్డంకులు కావని——సంకల్పబలం, నిరంతర కృషి ఉంటే పల్లె నుంచి ప్రపంచ స్థాయి విజయాల దాకా ఎదగవచ్చని స్పష్టంగా తెలియజేస్తుంది. గెలుపు-ఓటములు జీవితంలో సహజమని, వాటికి అతిగా పొంగిపోకుండా లేదా కుంగిపోకుండా సమతా భావంతో ముందుకు సాగితేనే నిజమైన విజయం సాధ్యమని ఈ వ్యాసాలు బోధిస్తాయి. మొత్తం మీద, ఈ రచనలు ప్రతి పాఠకుడిలో ధైర్యం, ఆశ, లక్ష్యసాధన పట్ల విశ్వాసం పెంపొందించడమే ప్రధాన సందేశం గా నిలుస్తాయి. వారు భవిష్యత్తులో ఇలాంటి మంచి రచనలతో... పాఠకులకు స్ఫూర్తిని పంచాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను.

(సమీక్షకులు ప్రొఫెసర్,
డర్బన్ యూనివర్సిటీ అఫ్ టెక్నాలజీ, సౌత్ ఆఫ్రికా)

పరిచయం

కాశ్మీరీ సాహిత్యంలో ఆధునిక గొంతు

నిఘత్ సాహిబా

డా.టి.రాధాకృష్ణమాచార్యులు
9849305871

ఎన్నో శతాబ్దాలుగా లాలా దేజ్,ఆర్నిమాల్, హెబ్బా ఖాతూన్ వంటి కాశ్మీర్ మిస్టిక్, సూఫీ, రొమాంటిక్ వుమన్ పోయెట్స్ యొక్క పుట్టిల్లుగా ఉన్నది.ఇరువయ్యో శతాబ్దపు చివరలో కవి నజీమ్ సోఫియా ఈ ఆధ్యాత్మిక, సూఫీ,శృంగార ఇతివృత్తాలనుండి వైదొలగి సమకాలీన ఉద్యమంలో కాశ్మీరీ స్త్రీల బాధలను ఉద్దేశించి రాసే మోతిలాల్ సాఖీ, రహమాన్ రాఖీవంటి కవుల దారిని వెలుగుపరిచారు.చాలా చాలా సంవత్సరాల తర్వాత, నిఘత్ సాహిబ్ ఉర్దూ భాషలో రచనలు చేశారు. వివిధ కవులు,శ్రోతల ప్రోత్సాహంతో ఆమె అలాగే కాశ్మీరీలో కాశ్మీరీ సాహిత్యానికి, అలాగే ఈ సజీవ సాహిత్యానికి ఈ సాహిత్య రంగంలో ఎవరైనా ఆసక్తి చూపుతారో లేదో ఖచ్చితంగా తెలియని నిఘత్ సాహిబ్ కూ ఇదొక కీలక దశగా చెప్పవచ్చు. కాశ్మీరీ సాహిత్యంలో సమకాలీన కాశ్మీరీ కవయిత్రి, రచయిత్రి, ఉపాధ్యాయురాలైన నిఘత్ సాహిబా అనంతనాగ్ జిల్లాలోని అబాచల్ గ్రామంలో జన్మించారు.ఆమె కాశ్మీరీ మరింకా ఉర్దూ సాహిత్యానికి గుర్తింపు పొందారు. సాహిత్యంలో ఆమె కాశ్మీరీ కవితా సంకలనం ‘జర్ద్ పనికి దైర్’ కృషికి ప్రసిద్ధి, కేంద్ర సాహిత్య యువ పురస్కారం 2017లో అందుకున్నది. కాశ్మీరీ సాహిత్యంలో ఆమె చేసిన కృషికి ముఖ్యంగా 2017లో సాహిత్య అకాడమీ యువ పురస్కారాన్ని గెలుచుకున్న ఆమె సంకలనం ‘శరదృతువు ఆకుల కుప్ప’ (‘జర్ద్ పనికే దైర్’,Pile of autumn leaves) రచనకు ప్రసిద్ధి చెందింది. అట్లాగే ఆమె ఉర్దూ కవిత్వానికి 2014లో అక్బర్ జైపురి స్మారక అవార్డును అందుకుంది. 2018 మల్లికా సేన్‌గుప్తా అవార్డును కూడా అందుకున్నారు. ఆమె కవిత్వశైలిలో కాశ్మీరీ గజల్స్, నాజ్మ్స్ కలవు. కాశ్మీరీ కవిత్వంలో సమకాలీన, యువ స్వరంగా ఆమె రచనలు ప్రకృతి దృశ్యాలు ఇంకా భావోద్వేగాల ఇతివృత్తాలపై దృష్టి పెట్టిన కొత్త యువ ఆలోచనలు.ఇక ఆమె ఇతివృత్తాలన్నీ ఆమె కవిత్వంలో సంఘర్షణ, కాశ్మీర్‌లోని మానవ పరిస్థితి, స్త్రీవాద దృక్పథాలు మరియు శాంతి కోసం కాంక్ష వంటి అంశాలు ఎక్కువగా ఉన్నాయి.సాహిత్య ప్రభావం ఆమెను కాశ్మీరీ కవిత్వంలో శక్తివంతమైన, ఆధునిక స్వరంగా తీర్చిదిదదింది. ఆమె తరచుగా ప్రభావవంతమైన స్త్రీవాద కవయిత్రుల వరుసలో ఉన్నారు. ఆమె కవితలు, రచనలు అందుబాటులో ఉన్నాయి. ‘‘నిఘాట్ సాహిబా ది బ్రేవ్ న్యూ వాయిస్ ఇన్ కాశ్మీరీ పోయెట్రీ’’ అనే వ్యాసం ఆమె రచనల యొక్క లోతైన విశ్లేషణను అందిస్తుంది. నిఘత్ సాహిబా ఒక సందర్భంలో ‘‘నన్ను కవయిత్రి అని పిలవకండి. సింపుల్ గా నన్ను కవి అని పిలవండి” అంటారు. కాశ్మీరీ కవి నిఘత్ సాహిబా అలా అన్నప్పుడు ఆమె గొంతులోని దృఢ నిశ్చయం, అట్లాగే ఆమె కళ్ళలోని దృఢ నిశ్చయం ప్రస్ఫుటంగా కనిపించింది. నిఘత్ సాహిబా కుటుంబంలో మొదటి తరం విద్యార్థిగా ఆమె గొప్ప పాత్ర పోషించారు.ఆమె కుటుంబంలో విద్యా గంధం బహు స్వల్పంగా ఉన్నా సాహిత్య పరిమళం ఆనవాళ్ళు అసలే లేవు. ఆమె తండ్రి మాధ్యమిక విద్య పూర్తిచేసి బడి బాట వదిలేశారు.ఇక ఆమె తల్లి ఎప్పుడూ పాఠశాలకు పోలేదు. మొదటి తరం విద్యార్థిగా నేను సాహిత్యంతో ఏది అందిపుచ్చుకోలేదు. మార్గనిర్దేశం చేసేవారుగాని,ఎలాంటి పుస్తకాలు చదవాలో గైడ్ చేసేవారుగాని ఎవరూ లేకపోవడంతో చుక్కాని లేని నావలా ఉండేది ఆమె గడిపిన పరిస్థితి.ఆ ఒంటరి ప్రయాణంలో అన్నీ తనై సమస్యలను పరిష్కరించుకోవడం ఆమెకు గొప్ప అనుభవాన్ని జీవితం అందించింది. నిఘత్ సాహిబాలోని మెరుపులలో కొన్ని ఈ విధంగా ఉండి కాశ్మీరీ కవిత్వంలో కీలకమైన మార్పును సూచిస్తుంది.అలాగే సంఘర్షణల మధ్య మహిళల గొంతులపై దృష్టి పెడుతుంది.

ఆమె సాహిత్య సంకలనం ‘జర్ద్ పనికే దైర్’ ఆమె సాహిత్య పురోగతిని సూచిస్తుంది. సాహిబా కవిత్వం స్త్రీవాది వంటి నిర్బంధ ముద్రలను ప్రతిఘటిస్తూ సామాజిక, రాజకీయ మరింకా లింగ సమస్యలను అన్వేషణ చేస్తుంది.ఇది నిఘత్ సాహిబా రచనను కాశ్మీరీ సాహిత్యానికి ఆమె చేసిన కృషి ప్రాముఖ్యతను పరిచయం చేసే లక్ష్య ఉద్దేశ్యంగా చూపుతుంది. కాశ్మీర్‌లో మానవ అనుభవాన్ని ప్రామాణికంగా బలంగా వ్యక్తీకరించడానికి సాహిబా తన మాతృభాషలో రాయడాన్ని నొక్కివాక్కాణించడమే ఆమె పోయెట్రీ గట్స్.నిఘాట్ సాహిబ్ ప్రసిద్ధ రచనలు, కవితలలో నిఘాట్ సాహిబా కవిత్వం తరచుగా గుర్తింపు, స్త్రీత్వం, ప్రతిఘటన అలాగే కాశ్మీర్ సామాజిక ప్రకృతి చిత్రం అనే ఇతివృత్తాలపై దృష్టి పెడుతుంది. ఆమె ప్రసిద్ధ రచనలలో కవితలు(నజ్మ్) నేను అంచున వ్రాయబడ్డాను (హషియే పర్ లిఖీ హుయ్ హూన్ మైన్), నా కనురెప్పలపై ఇంకా కొన్ని మేఘాలు ఉన్నాయి (అబ్ భీ పాల్కోన్ పె కుచ్ ఘూటేన్ హైన్), తల్లి ఇల్లు (మైకా), దేవుని నుండి (ఖుదా సే), మీరు నన్ను కూడా విచ్ఛిన్నం చేయడంలో సంతోషంగా ఉన్నారు(తు భీ ముజ్కో తోడ్ కే ఖుష్ హై) ఉన్నవి.ఆమె సాహిత్య ప్రభావం: కవిత్వం యొక్క శక్తి మరి భాషా రాజకీయాలకు సంబంధించిన చర్చలలో ఆమె జసింతా కెర్కెట్టాతో పాటు కనిపించింది.రేఖాలో ఆమె ఉర్దూ నజ్మ్‌లు మరి గజల్ల సేకరణను అందిస్తుంది. ఇక సాహిత్య పత్రికలలో ఆమె రచన ‘‘నిఘాట్ సాహిబా: ది బ్రేవ్ న్యూ వాయిస్ ఇన్ కాశ్మీరీ పోయెట్రీ’’ పై నియాతి భట్ రాసిన వ్యాసం, అలాగే సాహిత్య అకాడమీలో ఆమె రచనల ప్రస్తావనలను సాహిత్య అకాడమీ యొక్క ‘ఉన్మేషా’ సాహిత్య జర్నల్ ఉన్నది. ‘గుర్తింపు’ (రికగ్నిషన్), ‘పొగమంచు కలం’(mist pen) వంటిసామాజిక దృశ్యావరణలో చిత్రించిన నిఘత్ సాహిబా విశేష కృషి అభినందనీయం.

కవిత

పుస్తకం - అక్షరామృత కలశం

పుస్తకం
కళ్లకు అందాలు చూపి,
అక్షరాల అద్దంలో ప్రకృతిని ప్రదర్శించాలి,
లోకాన్ని అంతరంగాల్లో ప్రతిబింబించాలి.

పొస్తుకం
మనసుకు ఆనందం ఇచ్చి
సంతోషపు పూలు పూయించాలి,
భావాల తోటలో రంగులు వెదజల్లాలి.

గ్రంథం
కర్ణాలకు శ్రావ్యత కలిగించి
మౌనానికీ సంగీతం నేర్పాలి,
జీవన రాగం వినిపించాలి.

కితాబు
నోర్లకు తేనెచుక్కలు అందించి
పదాల మాధుర్యం పంచాలి,
పఠనమే పానీయమై కడుపులకు తృప్తినివ్వాలి.

బుక్కు
గుండెలకు లయ నేర్పి
వేదనలకు తాళం వెయ్యాలి,
గమ్యాలను తెలియజేసి జీవితాన్ని నడిపించాలి.

పుస్తం
హృదయాలను తాకి
ఉత్తమ భావాలకు ప్రాచుర్యం కలిగించాలి,
ఒక శాశ్వత చిరునామా ఇవ్వాలి.

పుస్తి
మోములపై వెలుగులు చిమ్మి, నవ్వించి
జీవన పోరాటం చేయించాలి.
విజయానికి మార్గం చూపాలి.

పొస్కం
దేహాల్లో ప్రాణం నిలిపి,
అక్షరాలతో ఊపిరి పొయ్యాలి
మనిషిలో మనిషిని మేల్కొలపాలి.

పొస్తకం
ఖడ్గం కాదు
హస్తాలకు భూషణం కావాలి,
భాషకు ప్రతీకగా మారాలి.

పొత్తం -
అక్షరామృత కలశం,
లిఖిత పదాల సంపుటం,
కవుల భావాల సమ్మిళితం.



గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
భాగ్యనగరం.

సామాజికం

సమాజం కోసం పనిచేయడం సేవ కాదు, బాధ్యత

వడ్డేపల్లి మల్లేశం
9014206412

సమాజాన్ని ప్రభావితం చేసిన సామాజిక ఆర్థిక సాంస్కృతిక మేదో రంగాలకు చెందిన నిపుణులు తమ జీవితానుభవాలను రంగరించి కాచి వడపోసిన అంశాలను సూక్తులుగా, నినాదాలుగా, నిత్య సత్యాలుగా ప్రపంచానికి చాటి చెప్పడం చూస్తున్నాం. దీనికి విద్యార్హతలు , డబ్బు, సంపాదన ముఖ్యం కాదు. వారి వారి అనుభవాలు, సాధించిన నైపుణ్యం, సంతరించుకున్న ప్రతిభ ప్రధాన అంశాలుగా నిలబడతాయి . తమ బాధ్యతలు కర్తవ్యానికి మించి ఒక్క శాతం పని చేసినా ,పని చేసినట్లు నటించిన అదేదో సమాజానికి సేవ అన్నట్లుగా పొంగిపోయే వాళ్ళు చాలామంది ఉంటారు. కానీ మానవుడు సంఘజీవి అని అరిస్టాటిల్ నొక్కి చెప్పినప్పుడే సంఘంలో ఒక ప్రతినిధిగా జీవించడం మాత్రమే కాదు సమాజంతోని ప్రభావితం చెందడం, సమాజాన్ని ప్రభావితం చేయడం, ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యవహరి 0చ వలసినటువంటి అనేక సంబంధాలను బాధ్యతలను మనిషి కలిగి ఉన్నాడని గుర్తిస్తే మంచిది. అందుకే సమాజం కోసం మనం చేసే ఏ పని కూడా సేవ అని పొంగి పోవలసినటువంటి అవసరం లేదు . ఇదే అంశాన్ని ప్రముఖ తమిళ రచయిత్రి శివశంకరి గారు సాహిత్య రంగం పైన సామాజిక సేవ పైన సామాజిక బాధ్యత పైన తన స్పష్టమైన వైఖరిని వ్యక్తం చేసిన సందర్భంలో పేర్కొన్న అంశాలు రాజకీయ సామాజిక విద్యాధి రంగాలలో పనిచేస్తున్న వాళ్ళందరి కూడా వర్తిస్తాయి .

తమిళ రచయిత్రి మాటల్లో సంగసేవ సామాజిక బాధ్యత

సంఘ సేవ అన్న మాట అంటే తనకు అసలే ఇష్టం లేదని ,సమాజం కోసం పనిచేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా స్వీకరించాలి కానీ ఏదో సేవ చేసి ఉద్ధరిస్తున్నట్టుగా నటించడం వ్యాఖ్యానించడం సరైనది కాదని తమిళ రచయిత్రి శివశంకరి గారి మాటలను సామాజిక స్పృహ కలిగిన ప్రతి ఒక్కరు కూడా గుణపాఠంగా స్వీకరించాల్సిన అవసరం ఉంది . మనిషిగా పుట్టినందుకు తోటి మనిషిని సాటి మనిషిగా చూడడంతో పాటు సామాజిక స్పృహ కలిగి ఉండే విధంగా జీవించడం చాలా అవసరం అనే బావ న కొట్ట వచ్చినట్లు కనపడుతుంది. "సమాజాన్ని నిరంతరం అధ్యయనం చేస్తున్నటువంటి సామాజిక సాహిత్య కళా రంగాలకు చెందినటువంటి కవులు కళాకారులు మేధావులు మొదలగు వారికి డబ్బులతో వేతనంతో నిమిత్తం లేకుండా సమాజాన్ని ప్రభావితం చేయగల అవకాశం ఎక్కువగా ఉంటుంది . సమాజాన్ని పరిశీలించడం, అధ్యయనం చేయడం, సమస్యలకు పరిష్కారాలను వెతకడం, నూతన ఆలోచనలకు జీవం పోయడం , సమ సమాజ స్థాపన వైపుగా తన ఆకాంక్షలను వ్యక్తం చేస్తూ సామాజిక ఆర్థిక చారిత్రక అంశాలను స్పష్టంగా శాసించే వాళ్లు రచయితలు కవులు కళాకారులు." వీళ్లు సమాజం నుండి స్వార్థపూరితంగా ఏదో ఆశించే వాళ్ళు కాదు కానీ తమకు ఉన్నటువంటి భౌద్ధిక , మేదో శక్తిని సమాజం ఎదుర్కొంటున్నటువంటి అనేక సమస్యలకు పరిష్కారాన్ని వెదికే దిశగా సాహిత్య రంగంలో ప్రధానంగా కృషి చేస్తుంటారు. మానవ సంబంధాలు , కుటుంబ బంధాలు, సామాజిక అంతరాలు, ఆర్థిక అసమానతలు, పేదరికము, నిరుద్యోగము, సామాజిక సంక్షోభము, పాలకుల బాధ్యతారాహిత్యం, ప్రైవేటు పెట్టుబడి దారి విధానం వల్ల సమాజం సంక్షోభానికి గురవుతున్న తీరు పట్ల కఠినంగా స్పందించి నిక్కచ్చిగా పరిష్కారాలను చూపే వాళ్ళు రచయితలు కవులు . అందుకే వీరికి మిగతా వర్గాల కంటే కొంత సామాజిక బాధ్యత ఎక్కువగా ఉంటుందని అంగీకరించాలి కానీ మిగతా వాళ్లకు ఉద్యోగులు , వృత్తి పనివారికి, ప్రజా స్వా మికవాదులకు బాధ్యత లేదని అర్థం కాదు . వాళ్లకు అవగాహన ఉన్నటువంటి రంగాన్ని బట్టి ఆ బాధ్యత కొంత ఎక్కువ తక్కువగా ఉంటుందనడంలో సందేహం లేదు. అందుకే శివశంకర్ గారి మాటల్లో రచయితలు, కవులు తమ రచనల ద్వారా సమాజంలో ఉన్న పరిస్థితులను అంచనా వేస్తూనే వాటికి పరిష్కారాలను చూపే ప్రయత్నం తమ రచనల్లో అందిస్తారు . పాఠకులలో ఆలోచన సరలి తో పాటు ఆశావహ దృక్పథం సానుకూల వైఖరి అలవడే విధంగా చైతన్యాన్ని రగిలించే కోణంలో రచనలు ప్రోత్సహిస్తాయి. ఆ లక్షణాలు కలిగినటువంటి సాహిత్యానికి మాత్రమే సమాజంలో గుర్తింపు ఉంటుంది కానీ ప్రజా జీవితంతో సంబంధం లేకుండా, బాధ్యతారాహిత్యంతో కూడుకున్న ప్రభుత్వాల గురించి పట్టించుకోకుండా, అసమానతలు అంతరాలకు కారకులైన వారి గురించి ప్రస్తావించకుండావుంటే ప్రజాసాహిత్యం కాదు . ఎవరి బాధ్యతల వారికి ఆ ర్థం చేసి చూపెట్టే స్థితిలో ఉండాలి కానీ అనవసరంగా జోక్యం చేసుకుంటే మనకేం వస్తుంది అనే కోణంలో గోడమీది పిల్లి చందంగా చేసే రచనలు సమాజానికి దోహదపడవు. రచయిత తను చెప్పదలుచుకున్న అంశాన్ని స్పష్టంగా వ్యక్తం చేయాలి అంతే కాదు సమాజానికి ద్రోహం చేస్తున్న వర్గం పట్ల కూడా ఉక్కు పాదం మోపాల్సినటువంటి అవసరం ఉంటుంది. ఆర్థికవేత్తలు, శాస్త్రవేత్తలు, వైజ్ఞానిక రంగంలోని వారి కంటే కూడా సమాజాన్ని అంచనా వేసే కవులు రచయితలకు సమాజం యొక్క రూపురేఖల మార్చగలిగినటువంటి అవకాశం ఎక్కువగా ఉంటుంది . ఆ బాధ్యతను హృదయపూర్వకంగా స్వీకరించినప్పుడు మాత్రమే మెరుగైనటువంటి పరిస్థితులను చూడగలము తద్వారా అంతరాలు లేనటువంటి స్థాయిని సమాజం చేరుకోవడానికి, పాలకులను ప్రశ్నించి ప్రభావితం చేయడానికి, వాళ్ల బాధ్యతలను గుర్తింప చేయడానికి రచనలు దోహదపడాలి అనే విజ్ఞుల యొక్క సూచనలు ఆచరణలో అమలైనప్పుడు పాలకులు కూడా ప్రజల పక్షాన పనిచేస్తారు . మెరుగైన ఫలితాలను పొందే అవకాశం ఉంటుంది. తత్వవేత్తలు మేధావులు సామాజికవేత్తల అభిప్రాయం ప్రకారం" రచయితలారా మీరు ప్రజల వైపు ఉండండి ప్రజల కోసం పని చేయండి ప్రజలకు వెన్నుదన్నుగా నిలబడి సామాజిక మార్పుకు పోరాడండి అని హెచ్చరించడం జరుగుతున్నది." నిజంగా రచయితలు చేసే పని కేవలం ఆలోచనలను రచనలుగా అందించడం మాత్రమే కాదు ఒక రకంగా సమాజంలో నెలకొన్న సామాజిక రుగ్మతులపైన పోరాటం చేయడమే అంటే అతిశయోక్తి కాదు. అంటే ప్రతి రచయిత కూడా వ్యక్తిగత జీవితానికి భిన్నంగా సామాజిక జీవితాన్ని ఎక్కువగా గడపడానికి ప్రయత్నించాలి అప్పుడే సామాజిక బాధ్యత నిర్వహించినట్లు లెక్క .

(వ్యాసకర్త సామాజిక రాజకీయ విశ్లేషకుడు, అరసం రాష్ట్ర కమిటీ సభ్యుడు, హుస్నాబాద్, సిద్దిపేట జిల్లా)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ ‘ఓపెన్ వాయిస్’కు, సాహిత్య పేజీ ‘బహుళ’కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

ఆదివాసి బిడ్డను.. పారిపోయే రకాన్ని కాదు

- ప్రజల కోసం, భక్తుల కోసం పంతం నెగించుకునే రకాన్ని
- తప్పుడు ప్రచారంపై నిప్పులు చేరిగిన మంత్రి సీతక్క

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 1: ప్రపంచ ప్రసిద్ధ మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర సందర్భంగా తనపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. మనసా-వాచా-కర్మణా చిత్తశుద్ధితో ఆదివాసీల అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం పరితపించే ఆదివాసి బిడ్డను తాను అని పేర్కొన్నారు. తాను పారిపోయే రకం కాదని, భక్తులు-ప్రజల కోసం పంతం నెగ్గించుకునే రకమని స్పష్టం చేశారు. ఆదివాసి అస్తిత్వం, తల్లుల పట్ల అచంచల భక్తి తన జీవన విధానమని, మేడారం జాతర దిగ్విజయాన్ని జీర్ణించుకోలేక కొందరు చేసే కుట్రలకు భయపడబోనని మంత్రి తెలిపారు. జాతరను విజయవంతంగా నిర్వహించినట్లే, జాతర అనంతరం చేపట్టాల్సిన పనులన్నీ సమర్థంగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. ఐదువేలకు పైగా పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి మేడారం పరిసరాలను పూర్తిగా పరిశుభ్రం చేస్తున్నామని, రేయింబవళ్లు కష్టపడి పనిచేసిన పోలీస్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. వీఐపీల అధిక రాకపోకల కారణంగా కొన్ని చోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడిన మాట వాస్తవమేనని, ఆ సమయంలో ఆర్టీసీ బస్సులు కూడా చిక్కుకుపోయాయని మంత్రి వివరించారు. అయితే ఘట్టమ్మ దేవాలయం వద్ద ట్రాఫిక్ జామ్ లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, ఘట్టమ్మ దర్శనం అనంతరం సమ్మక్కకు వచ్చే సంప్రదాయం దృష్టిలో ఉంచుకుని అక్కడ సజావుగా రాకపోకలు కొనసాగించగలిగామని చెప్పారు. ఈసారి రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించగలిగామని తెలిపారు. గుడి నిర్మాణ బాధ్యతను ప్రభుత్వం భుజాన వేసుకుందని, జాతరకు ముందే శాశ్వత నిర్మాణ పనులు పూర్తి కావడం వల్లే భక్తుల రద్దీ విపరీతంగా పెరిగిందని తెలిపారు. గతంలో జాతరకు ముందు రోజుకు ఒకటి-రెండు లక్షల మంది మాత్రమే వచ్చేవారని, కొత్త గుడి నిర్మాణం అనంతరం ఒక్క రోజులోనే ఎనిమిది లక్షల మంది వరకు భక్తులు తరలివచ్చారని చెప్పారు. తాత్కాలిక ఏర్పాట్లకు బదులు శాశ్వత ఏర్పాట్లు చేయడం వల్లే ఈ రద్దీ సాధ్యమైందని వివరించారు. సమ్మక్కను సకాలంలో గద్దెలపైకి తీసుకురావడంలో పూజారులు సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు. కొంతమంది కొత్త పోలీస్ సిబ్బంది పూజారులను గుర్తించలేక పొరపాటు జరిగిందని, అది ఉద్దేశపూర్వకమైంది కాదని స్పష్టం చేశారు. కేబినెట్ ఒకరోజు మేడారంలోనే ఉండి నిర్ణయాలు తీసుకోవడం చరిత్రాత్మకమని మంత్రి పేర్కొన్నారు. శుక్రవారం వీఐపీ తాకిడి ఎక్కువగా ఉండటంతో కొందరు వీఐపీలు 30 నుంచి 40 వాహనాలతో రావడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడిందని, ఆ సమయంలో కూడా రాజకీయాలు చేయడానికి కొందరు ప్రయత్నించారని విమర్శించారు. అయినా సాధారణ భక్తులు పూర్తి స్థాయిలో సహకరించడంతో పసర దారిలో ట్రాఫిక్ జామ్ లేకుండా నిర్వహించగలిగామని చెప్పారు. భక్తులు సజావుగా దర్శనాలు చేసుకుని ఆనందంతో తిరిగివెళ్లారని, కొంతమంది భక్తులకు కలిగిన అసౌకర్యానికి ప్రభుత్వం చింతిస్తున్నదని తెలిపారు. ఈ జాతర అనుభవాల ఆధారంగా వచ్చే జాతరలో ట్రాఫిక్ జామ్ పూర్తిగా లేకుండా మరింత పటిష్ట చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తల్లుల జనప్రవేశం నుంచి వనప్రవేశం వరకు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించామని, ఆ అప్రమత్తత వల్లే కోట్లాది మంది భక్తులు వచ్చినా సజావుగా దర్శనాలు సాధ్యమయ్యాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మేడారం జాతరలో ప్రమాదాలు జరుగుతాయని కొందరు స్వామీజీలు తప్పుడు ప్రచారాలు చేశారని, సమ్మక్క-సారలమ్మలపై ప్రజల్లో పెరుగుతున్న భక్తిని కొందరు తట్టుకోలేకపోతున్నారని ఆమె వ్యాఖ్యానించారు.

ఘనంగా ప్రారంభమైన స్వదేశీ హయిండ్ శిల్ప్ కళా

ప్రతిపక్షం, వికారాబాద్, ఫిబ్రవరి 1: భారీ డిస్కౌంట్ ఆఫర్లతో స్వదేశీ హయిండ్ శిల్ప్ కళా మేళాను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రదీప్ అన్నారు. ఆదివారం తాండూరు పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణమంటపం లో ప్రారంభమైన స్వదేశీ హయిండ్ శిల్ప్ కళా మేళాలో నూతన స్టాళ్లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ప్రోడక్ట్ పై స్పెషల్ ఆఫర్ ను అందిస్తున్నామన్నారు. హయిండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్ కం సేల్స్ ని నమ్మకమైన ధరల్లో అందిస్తున్నామన్నారు. నాణ్యమైన వస్త్రాలు, పట్టు చీరలు, ఫ్యాన్సీ చీరలు, డిజైనర్ చీరలు, పోచంపల్లి డ్రెస్ మెటీరియల్స్, చుడాదార్స్, నూటింగ్స్ షర్టింగ్స్, జ్యూవెలరీ, బెడ్షీట్ తదితర ప్రోడక్ట్‌లపై భారీ డిస్కౌంట్ ను అందిస్తున్నామన్నారు. పాత కంచిపట్టు, బనారస్, గద్వాల్, వెంకటగిరి, స్వచ్ఛమైన జరి చీరలు రూ. 5.500 నుండి రూ.10,000 చెల్లించి కొనస్నున్నామన్నారు. వివరాలకు 9966217222 నెంబర్ ను సంప్రదించాలన్నారు.

కేసీఆర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక

- కాంగ్రెస్ ప్రభుత్వం అమానుషంగా వ్యవహరిస్తోంది
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు ముక్తవరం సుశీలా రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదారాబాద్, ఫిబ్రవరి 1: తెలంగాణ రాష్ట్ర సాధకుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అమానుషంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు ముక్తవరం సుశీలా రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ దురహంకార వైఖరికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆమె హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ తన సర్వస్వాన్ని త్యాగం చేశారని గుర్తు చేశారు. గాంధేయ మార్గంలో, శాంతియుత ఉద్యమంతో 14 సంవత్సరాల పాటు నిరంతర పోరాటం చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహానేత కేసీఆర్ అని కొనియాడారు. అలాంటి నాయకుడిని రాజకీయ కక్షతో కేసుల పేరిట వేధించడం దుర్మార్గమైన చర్యగా ఆమె అభివర్ణించారు. ఫోన్ ట్యాపింగ్ వంటి కేసుల పేరుతో నోటీసులు జారీ చేస్తూ, విచారణలతో కేసీఆర్‌ను మానసికంగా వేధించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. తెలంగాణ జాతిపితగా ప్రజల మనసుల్లో నిలిచిన కేసీఆర్ పట్ల ఈ విధంగా వ్యవహరించడం ఏమాత్రం సరికాదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా, ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టడమే ఈ ప్రభుత్వ ప్రధాన అజెండాగా మారిందని మండిపడ్డారు. పాలనలో అసమర్థతను దాచిపెట్టేందుకే కేసీఆర్‌పై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆమె అన్నారు. రాబోయేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రజలు మళ్లీ తమ గౌరవాన్ని నిలబెట్టుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. ఆ రోజు వచ్చేసరికి కాంగ్రెస్ నాయకులకు తమ పరిస్థితి ఏంటో అర్థమవుతుందని హితవు పలికారు. సిట్ అధికారులు చట్టాన్ని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కూడా పక్కన పెట్టి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యానికి, న్యాయవ్యవస్థకు ప్రమాదకర సంకేతమని ఆమె హెచ్చరించారు. కేసీఆర్ అంటే ఒక వ్యక్తి కాదని, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని, అలాంటి నాయకుడిపై జరుగుతున్న దాడులను తెలంగాణ ప్రజలు సహించబోరని ముక్తవరం సుశీలా రెడ్డి స్పష్టం చేశారు.

కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యం

- బీజేపీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 1: ఎల్బీ నగర్ నియోజకవర్గం మన్సూరాబాద్ డివిజన్లో బీజేపీ పార్టీ నుండి పోచబోయిన వినోద్ యాదవ్, ఆయన అనుచరులు తదితరులు ఆదివారం టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శజక్కిడి శివ చరణ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కిడి శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజా వ్యతిరేక విధానాలతో బీజేపీ పార్టీ పైన నమ్మకం కోల్పోయిన వినోద్ లాంటి యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం సరైన మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో పోచబోయిన రవి యాదవ్, శంకర్ యాదవ్, వెంకుల యాదవ్ గ,కృష్ణ యాదవ్ గ, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంట శ్రావణ్ , బీసీ సెల్ నాయకులు రఘుపతి, సేవాదళ్ నాయకులు గిరి, కేకేసీ రాష్ట్ర నాయకులు రాజశేఖర్ రెడ్డి, జక్కిడి సత్యతేజ రెడ్డి, అఖిల్ రెడ్డి, రాంబాబు రెడ్డి, తురుపాటి హరిబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసులకు ఆయుధాలు

- ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి
- రూ.కోటి నగదు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం
- అన్ని విధాలా అండగా ఉంటుందన్న మంత్రి జూపల్లి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 1: ఎక్సైజ్ విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు ఆయుధాలను సమకూర్చుతామని జూపల్లి కృష్ణారావు చెప్పారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య(25) కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.కోటి నగదు, ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ కొలువు ఇవ్వనున్నట్లుగా మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. విధి నిర్వహణలో గాజుల సౌమ్య ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఆమె కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆదివారం గాంధీ ఆస్పత్రి మార్చురీ వద్ద ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మృతదేహానికి మంత్రి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు ఆయుధాలను సమకూర్చుతామని జూపల్లి కృష్ణారావు చెప్పారు. గంజాయి స్మగ్లర్ల దాడిలో తీవ్రంగా గాయపడి, నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో భాగంగా అక్రమ గంజాయి రవాణాను అడ్డుకునే ప్రయత్నంలో ఆమె ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించిన సౌమ్య సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని, ఇలాంటి దారుణ ఘటనలు ప్రజాస్వామ్య సమాజానికి మచ్చగా మిగులుతాయని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

సౌమ్య మృతి కలచివేసింది: కవిత

గంజాయి ముఠా దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మృతి చెందడం కలచివేసిందని కవిత అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సౌమ్య కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కవిత కోరారు.

సౌమ్య మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు

ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతిపట్ల సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన

ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో సౌమ్య ప్రాణాలు కోల్పోవడంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. సౌమ్య మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

తొమ్మిది రోజులు మృత్యువుతో పోరాడి

నిజామాబాద్‌లో గంజాయి స్మగ్లర్లను పట్టుకునే ప్రయత్నంలో గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మృతి చెందారు. దాదాపు తొమ్మిది రోజుల పాటు మృత్యువుతో పోరాడిన సౌమ్య.. శనివారం రాత్రి మరణించారు. జనవరి 23న రాత్రి మాధవనగర్ వద్ద సౌమ్యను గంజాయి ముఠా కారుతో ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ సౌమ్యను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడటంతో ఒక కిడ్నీ, ప్లీహం తొలగించారు నిమ్స్ వైద్యులు. అయితే చికిత్స పొందతూ పరిస్థితి విషమించడంతో సౌమ్య మృతి చెందారు. సౌమ్య మృతితో ఆమె స్వగ్రామం మోస్రలో విషాద ఛాయలు అలముకున్నాయి.

నిరంతర విద్యుత్ సరఫరాతో వెలిగిన వనదేవతల సన్నిధి

- తల్లుల దీవెనలు , సిబ్బంది కృషితోనే ఇది సాధ్యం
- అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించాం
- ఎన్పీడీసీఎల్ సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 1: ఆసియాలోనే అతిపెద్ద జాతర మేడారం మహా జాతరలో విద్యుత్ సరఫరాను విజయవంతంగా నిర్వహించినట్లు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, లక్షలాది భక్తులకు జాతర ఆద్యంతం నిరంతర విద్యుత్ సరఫరాను అందించగలిగామని ఆయన పేర్కొన్నారు. స్వయంగా తాను మేడారంలోనే బస చేసి, క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించానని తెలిపారు. నిరంతర విద్యుత్ సరఫరా వెనుక ప్రతి అధికారి, ఉద్యోగి అంకితభావం ఉందన్నారు. అహర్నిశలు నిబద్ధతతో కష్టపడి జాతర విజయవంతం కావడానికి తోడ్పడిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మేడారం తల్లుల దీవెనలు, సిబ్బంది సమష్టి కృషితో, ఇతర అన్ని శాఖలతో సమన్వయం సాధిస్తూ ఈ విజయం సాధ్యమైందన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ రాబోయే ప్రతి జాతరను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నేరాల నియంత్రణకు సామూహిక కృషి అవసరం

ప్రతిపక్షం సిటీబ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 1: సమాజంలో పెరిగిపోతున్న నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, హింసను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని టోలిచౌకి ఎస్ హెచ్ఓ రమేష్ నాయక్ పిలుపునిచ్చారు. జమాతే ఇస్లామీ హింద్ హైదరాబాద్ నగరం ఆధ్వర్యంలో 15 రోజుల పాటు సాగిన 'మానవ గౌరవాన్ని కాపాడదాం' (అహెత్రామ్‌ఎఇన్సానియత్) ప్రచార ముగింపు సభలో ఆయన అతిథిగా ప్రసంగించారు. సామాజిక సమస్యల పరిష్కారానికి జమాత్ చేపట్టిన ఈ చొరవను ఆయన అభినందించారు. "డ్రగ్స్, హింస మరియు దోపిడీ లేని సమాజాన్ని నిర్మించుకోవడం మనందరి లక్ష్యం కావాలి. మానవ గౌరవాన్ని కాపాడటమే శాంతియుత సమాజానికి పునాది అని ఈ ఉద్యమం మనకు గుర్తు చేస్తోంది. పౌరులు మరియు పోలీసు యంత్రాంగం కలిసి పనిచేసినప్పుడే మనం సురక్షితమైన మరియు ఆదర్శవంతమైన వాతావరణాన్ని నిర్మించగలం'' అని రమేష్ నాయక్ పేర్కొన్నారు. టోలిచౌకిలోని బృందావన్ కాలనీ మైదానంలో జరిగిన ఈ మహాసభతో జనవరి 18న ప్రారంభమైన పక్షం రోజుల అవగాహన కార్యక్రమం ముగిసింది. మసీదు అజీజియా ఖతీబ్ మౌలానా ఐజాజ్ మొహియుద్దీన్ వసీం ప్రధాన ప్రసంగం చేస్తూ, సామాజిక పతనాన్ని అరికట్టడంలో నైతిక విలువల పాత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో టోలిచౌకి, షేక్‌పేట్, మణికొండ, గోల్కొండ, నానల్ నగర్ ప్రాంతాల నివాసితులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. జమాతే ఇస్లామీ హింద్ నగర అధ్యక్షుడు డాక్టర్ ముబషిర్ అహ్మద్, ఏసీపీ సయ్యద్ ఫయాజ్, సామాజిక కార్యకర్త ఖాలిదా పర్వీన్, బృందావన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అడ్వకేట్ గియాసుద్దీన్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. నగరంలో మత సామరస్యాన్ని కాపాడటానికి మరియు ప్రతి వ్యక్తి గౌరవాన్ని రక్షించడానికి అవగాహన పెంచడం తప్పనిసరి అని వక్తలు అభిప్రాయపడ్డారు.

గ్రామ స్వచ్ఛతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- సర్పంచ్ మద్యపాగ కృష్ణ

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 1 : గ్రామ స్వచ్ఛతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సర్పంచ్ మద్యపాగ కృష్ణ అన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలోని వీధుల్లో చెత్తా చెదారం తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు గ్రామంలోని యువత కృషి చేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు తడి పొడి చెత్తను వేరువేరుగా చేసి ఆటో రిక్షా వారికి అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జితేందర్ రెడ్డి, వార్డు సభ్యులు మద్యపాగ శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, కృష్ణప్రవీణ్, యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

12 న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

- కార్మికులు, రైతులు, కూలీలు దేశమంతటా పోరుబాట

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 1: మోడీ ప్రభుత్వం తన విదానాలు మార్చుకోవాలని జె.మల్లికార్జున్ పిలుపునిచ్చారు. ఆదివారం రోజు పఠాన్ చెరు శ్రామిక్ భవన్ లో సినర్జీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లికార్జున్ మాట్లాడుతూ ఫిబ్రవరి 12వ తేదీన దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, కూలి, ప్రజ, రైతంగ వ్యతిరేక విధానాలను వెంటనే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు, కార్మికులు రైతులు కూలీలు దేశమంతటా పోరుబాట పట్టారని, మోడీ ప్రభుత్వం తన ఆర్థిక విదానాలను మార్చుకోవాలని ఆయన అన్నారు, లేకపోతే దేశంలో భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు రాక తప్పవని అన్నారు. ఫిబ్రవరి 12 న జరిగే సమ్మె దేశభక్తి సమ్మె అని ఆయన అన్నారు, ప్రజల కోసం జరుగుతున్న సమ్మె అని ఆయన అన్నారు, అందుకే ఈ సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమ్మె వివిధ కేంద్ర కార్మిక సంఘాలు మరియు వివిధ ఫెడరేషన్లు, ఇన్సూరెన్స్, బ్యాంకు, ఎంప్లాయిస్ సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున సమ్మె జరగనున్నదని ఆయన అన్నారు, కార్మిక, ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయని ఆయన అన్నారు. మోడీ ప్రభుత్వం తక్షణమే లేబర్ కోడులను రద్దు చేయాలని, అలాగే ఉపాధి హామీ పథకం లో తెచ్చిన మార్పులను ఉపసంహరించుకోవాలని, విత్తన బిల్లును రద్దు చేయాలని, ఇన్సూరెన్స్ రంగంలో 100% ఎఫ్ డి ఐ రద్దు చేయాలని డిమాండ్ చేశారు, సమ్మె సందర్భంగా కార్మికులు వివిధ రూపాల పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని, సమ్మె రోజు పెద్ద ఎత్తున కార్మికు పాల్గొనని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కే. రాజయ్య, మాణిక్యం, శాంత కుమార్, హరినాథ్, యాదగిరి, కృష్ణారెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిట్ విచారణకు కేసీఆర్ సంపూర్ణంగా సహకరించారు. ప్రతి ప్రశ్నకు కుండ బద్దలు కొట్టినట్లు సమాధానం ఇచ్చారు. ఈ కేసులో లీకులే తప్ప ఆధారాల్లేవు. ఎలాంటి తప్పు జరగలేదని తేలిపోయింది. కేసులో డొల్లతనం బయటపడింది. మున్సిపల్ ఎన్నికల్లో మా అటెన్షన్‌ను దెబ్బ తీయడానికే విచారణ పేరుతో డ్రామా చేశారు.
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రాంతీయం

బీఆర్ఎస్ అభ్యర్థుల రెండో జాబితా విడుదల

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 1: మెదక్ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రెండో జాబితాలో 9 వార్డు లకు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఖరారు చేసినట్టు మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుసేన్ తెలిపారు. ఆదివారం ఆయన అభ్యర్థుల జాబితాను వెల్లడించారు. 6 వార్డులో జీవన్ రావు (అడ్వకేట్), 13 వార్డులో చేదల్ సంధ్య నవీన్ కుమార్, 14 వార్డ్ లో జక్కుల రమాదేవి లక్ష్మణ్, 16 వార్డ్ లో ఆవారి రాజశేఖర్, 17 వార్డ్ లో బట్టి లలిత జగపతి, 22 వార్డ్ లో గౌస్ ఖురేషి, 24 వార్డ్ లో అంకం చంద్రకళ రవి, 27 వార్డ్ లో పల్లె రాణి బాలరాజ్, 30 వార్డులో లింగమయ్యోల కిరణ్ లను అభ్యర్థులుగా ప్రకటించారు.

'ప్రతిపక్షం' క్యాలండర్ ఆవిష్కరించిన బీజేపీ నేతలు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 1: ప్రతిపక్షం దిన పత్రిక క్యాలండర్ ను బీజేపీ నేతలు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరీ శంకర్ ముదిరాజ్, పార్టీ జిల్లా ప్రభారి సంగప్ప, సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్, జిల్లా నాయకులు తొడుపునూరి వెంకటేశం, జర్నలిస్ట్ సంఘం జిల్లా నాయకులు నాయిని సంజీవరెడ్డి, ప్రతిపక్షం నెట్ వర్క్ ఇన్చార్జి చిటుకుల మైసారెడ్డి, జిల్లా ప్రతినిధి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేదోడు వాదోడుగా ఉంటా.. మద్దతు తెలపండి

- బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి గుంటుకు శిరీష

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 1: మున్సిపాలిటీ 14వ వార్డు బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గుంటుకు శిరీష రాజు ఆదివారం వార్డులో ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటుకు శిరీష రాజు మాట్లాడుతూ గతంలో వార్డు ప్రజలు ఆశీర్వదించి కౌన్సిలర్గా గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ వృద్ధాప్య పింఛన్లు అందేలా కృషి చేశామన్నారు. వార్డులో నాణ్యమైన సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడంతో పాటు, ప్రతి ఇంటికి నల్లా నీరు (మిషన్ భగీరథ) అందేలా చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు. కులమతాలకు అతీతంగా పండుగలను వార్డు ప్రజలందరితో కలిసి ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. అదే స్ఫూర్తితో రెండోసారి కూడా తమ ఆశీర్వాదాలు ఉండాలని కోరారు. మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తమను గెలిపించాలని వార్డు ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణను వంచించిన కేంద్ర బడ్జెట్

- సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 1: రాష్ట్రానికి సంబంధించిన విభజన హామీలకు ఎలాంటి కేటాయిపులు, ప్రకటనలు చేయకుండా కేంద్ర బడ్జెట్ తీవ్ర నిరాశ పరిచిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు అవుతున్నా కేంద్రంలో అధికారంలో వున్న బిజెపి విభజన హామీలు స్టీల్ ఫ్యాక్టరీ, హైదరాబాద్ కు మెట్రో, రిజినల్ రింగ్ రోడ్డు, రాష్ట్రంలో ఒక సాగునీటి ప్రాజెక్టు జాతీయ హోదా, బడ్జెట్ లో విస్మరించారని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న తక్షణ సమస్య నిరుద్యోగం, ఆర్థిక అంతరాలకు సంబంధించి ఎలాంటి పరిష్కారం చూపలేదని మంద పవన్ మండిపడ్డారు. ఈ బడ్జెట్ మధ్య తరగతి పేదలకు ఉపశమన ఇవ్వకపోగా, కార్పొరేట్స్ కే అనుకూలంగా ఉన్నదని అన్నారు. మూలిగే నక్కపై తాటి పండు లాగా ఇప్పటికే రుణాలు, ఆర్థిక భారాలతో సతమతమవుతున్న రాష్ట్రాలకు ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి జిరామ్జి పథకం ద్వారా రాష్ట్రాలకు 40 శాతం భారాన్ని మోపరాని, ఆ పథకంలో 40 శాతం రాష్ట్రాలే భరించాల్సి వస్తుందని వారన్నారు. 16వ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 41 శాతం వాటాను కేటాయించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్రం తమ పన్నుల్లో 50 శాతం రాష్ట్రాలకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంపై కేంద్రం వివక్ష చూపడం పట్ల రాష్ట్రం నుంచి ఎన్నికైన కేంద్ర మంత్రులు, బిజెపి ఎంపిలు ప్రజలకు సమాధానం చెప్పాలని మంద పవన్ డిమాండ్ చేశారు.

రైతులకు నీటి విడుదలపై తక్షణ చర్యలు తీసుకోవాలి

- వంగ రాజేశ్వర్ రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 1: సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలానికి ఇంకా రంగనాయక సాగర్ నుంచి సాగునీటి విడుదల జరగకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని వంగ రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతాయనే భయంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నంగునూర్ మండలానికి రంగనాయక సాగర్ నుంచి తక్షణమే కొంతమేర నీటిని విడుదల చేయాలని సంబంధిత ఇరిగేషన్ అధికారులను కోరారు. కాలువల్లో చెట్లు, పొదలు అధికంగా పెరిగి నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోందని తెలిపారు.గట్లమల్యాల, సిద్ధన్నపేట తదితర 3-4 గ్రామాల్లో పేమెంట్లు విడుదలైనప్పటికీ పనులు ఇంకా పూర్తి కాకుండా పెండింగ్ లో ఉన్నాయని, వెంటనే పనులు పూర్తిచేసి కాలువలను శుభ్రం చేసి నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే మిషనరీ లేదా ఇతర వనరుల సహకారం అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.నంగునూర్ మండల రైతులకు తన పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు సానుకూలంగా స్పందించి, ఈ నెలాఖరులోగా రంగనాయక సాగర్ నుంచి నంగునూర్ మండలానికి నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. రైతుల సమస్యపై వెంటనే స్పందించిన ఇరిగేషన్ అధికారులకు వంగ రాజేశ్వర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

విచారణ పేరుతో వేధింపులకు గురిచేయడం సరికాదు

- గుండాలలో బీఆర్ఎస్ నేతల ర్యాలీ

ప్రతిపక్షం, గుండాల, ఫిబ్రవరి 1: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులను విచారణల పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తెల్లం భాస్కర్, మండల నాయకులు గడ్డం వీరన్న ఆరోపించారు. జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు ఆదివారం నిర్వహించిన నిరసన ర్యాలీ అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తన దొంగ వైఖరిని బయటపెడుతోందన్నారు.పార్టీ అగ్ర నేతలు హరీష్ రావు, కేటీఆర్, ఆదివారం తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేరుతో వ్యతిరేక ప్రచారం చేస్తూ, విచారణల పేరిట ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచే బీఆర్ఎస్ పార్టీ నాయకులను లక్ష్యంగా చేసుకుని తప్పుడు కేసులు నమోదు చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని విమర్శించారు.రాష్ట్రంలో ఎన్నికలు వస్తున్నాయంటే చాలు, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బీఆర్ఎస్ ముఖ్య నాయకులను విచారణల పేరిట పిలిపించి డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని అన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చింది ప్రజలకు మంచి చేయాలని తప్ప, ప్రతిపక్ష నాయకులను ఇబ్బందులకు గురి చేయడానికి కాదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ విషయాన్ని గుర్తు తెచ్చుకోవాలని సూచించారు.అధికారం అనేది ప్రజలకు మేలు చేయడానికి ఉండాలి తప్ప, ప్రజల పక్షాన నిలబడి పోరాడే ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెట్టేందుకు కాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు గురించి ప్రజలు ప్రశ్నిస్తున్నారని, వాటి అమలుపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు.ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పాలనపై దృష్టి సారించి, ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి టి. రాము, యువజన విభాగం అధ్యక్షులు సయ్యద్ అజ్జు, ఉపసర్పంచ్ తాటి పాపారావు, ఎస్సీ సెల్ నాయకులు నిట్ట రాములు, ఎస్టీ సెల్ నాయకులు లక్ష్మీనారాయణ, పార్టీ ముఖ్య నాయకులు జాడి ప్రభాకర్, పి. సుధాకర్, తాటి కృష్ణ, కుంజ సుధాకర్, మల్లయ్య, గంగాధరి ప్రమోద్, సతీష్, కిరణ్, ప్రశాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ తప్పు చేయకుంటే

బీఆర్ఎస్ నిరసనలు ఎందుకు?

- ఎమ్మెల్యే నాయని రాజేందర్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 1: కేసీఆర్ ఎలాంటి తప్పు చేయని వారైతే ఇన్ని రాస్తారోకోలు, నిరసనలు ఎందుకు జరుగుతున్నాయంటూ ఎమ్మెల్యే నాయని రాజేందర్ రెడ్డి ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో భాగంగా సిట్ విచారణకు హాజరు కావాలని పిలిచిన నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు రాష్ట్రవ్యాప్తంగా నిరసన బాట పట్టడంపై ఆయన స్పందించారు. నిరసనలు చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందో ప్రజలకు స్పష్టం చేయాలన్నారు. తప్పు చేయని వారికి భయపడాల్సిన అవసరం లేదని, విచారణను ఎదుర్కొనే ధైర్యం ఉండాలన్నారు. కేసీఆర్ చేసిన తప్పులే నేటి పరిణామాలకు కారణమని ఆయన వ్యాఖ్యానించారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో

ప్రత్యేక పూజలు

ప్రతిపక్షం, హుస్నాబాద్, ఫిబ్రవరి 1: వ్యాస పౌర్ణమిని పురస్కరించుకుని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమ పూజ, చండీ హోమం నిర్వహించి, అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఉత్కాల రేణుక కుటుంబ సభ్యులు రవి, అశ్విత ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.ఈ కార్యక్రమాన్ని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ కార్యనిర్వాహణాధికారి పి. కిషన్ రావు పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, శాసనమండలి సభ్యులు బసవరాజు సారయ్య, లక్ష్మి, వడ్డేపల్లి శ్రీనివాస్, లావణ్య, కొండ్ర విజయ్ కుమార్, నిర్మల, కోడూరి శ్రీదేవి, రవీందర్, పచ్చిమట్ల రవీందర్ గౌడ్, సుమలతతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.అలాగే ఆలయ అర్చకులు తాటికొండ పరమేశ్వర్ శర్మ, కొత్తకొండ దేవస్థానం అర్చకులు వినయ్ శర్మ, శ్రావణ్ శర్మ, శశాంక్ శర్మ, ఆలయ సిబ్బంది నీల కుమారస్వామి, పున్న హనుమంతు, గీకూరు రమేష్, వీర రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి 'హెల్పింగ్ హ్యాండ్స్' ఆర్థిక సహాయం

ప్రతిపక్షం, సిద్దిపేట, ఫిబ్రవరి 1: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నిరుపేద కుటుంబానికి చెందిన అజయ్ కుమార్ గౌడ్ కుటుంబానికి సిద్దిపేట కు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ మిత్ర బృందం రూ 6000 ఆర్థిక సహాయం అందించారు. స్థానిక లోహిత్ సాయి ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న అజయ్ కుమార్ గౌడ్ కుటుంబానికి ఆదివారం ఆసుపత్రి కి ఆ సంఘం ప్రతినిధులు వెళ్లి ఈ సహాయాన్ని అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆపద లో ఉన్న వారికి సహాయం చేయడంలోనే నిజమైన ఆనందం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ మిత్ర బృందం ప్రతినిధులు అనిల్ , శ్రీకాంత్ శ్రావణ్ సంతోష్ నవీన్ రాజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌లో చేరికలు

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 1: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణంలో విలీనమైన ఆర్అండ్ఆర్ కాలనీ (లక్ష్మపూర్) కు చెందిన బీజేపీ నాయకులు సందేనమైన బాలక్రిష్ణ , సందేనమైన కనకయ్య ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ సమక్షంలో బీజేపీ నుండి బీఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ అభివృద్ధికి కేసీఆర్ కృషి భవిష్యత్తులో కూడా బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. రైతు వ్యతిరేక పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ లకు బుద్ధి చెప్పాలని రైతు బాంధవుడైన కేసీఆర్ ని మూడోసారి అధికారంలోకి తేవడానికి కృషి చేయాలని వారు కోరారు. వారి వెంట లక్ష్మపూర్ మాజీ సర్పంచ్ కొలిచెల్మ స్వామి, కొలిచెలమే కర్నాకర్, చంద్రం, శ్రీనివాస్, మల్లేశం, తదితరులు ఉన్నారు.

అంకెల గారడీలా కేంద్ర బడ్జెట్

- సిద్దిపేట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట పిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ వాస్తవాలకు దూరంగా అంకెల గారడీలాగా కనిపిస్తోంది అని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ . గతంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ మాదిరిగానే కేవలం అంకెలు మార్చారు అని అన్నారు. మతం పేరుతో ప్రజలను మోసగిస్తూ అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగులకు ఒద్యోగాల ప్రకటనపై ఉపాధి కల్పన కల్పించడంలో విఫలమైంది అని అన్నారు. అంతేకాకుండా మహిళలకు యువతకు ఎలాంటి కేటాయింపులను ఈ బడ్జెట్ లో ప్రవేశ పెట్టకుండా వారిని విస్మరించింది అని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి బడ్జెట్ లో నిధులు కేటాయించలేదు అని కానీ ఆంధ్రప్రదేశ్ కు గత బడ్జెట్ లో ఈరోజు బడ్జెట్ లో నిధులు కేటాయించడం తెలంగాణ పాత కేంద్రంకు ఉన్న చిత్తశుద్ధి బయటపడింది అని అన్నారు. పేద మధ్య తరగతి ప్రజలకు ఈ బడ్జెట్ వల్ల ఎలాంటి ఉపయోగం లేదు అని అన్నారు. 8, 9 సార్లు కేంద్ర ఆర్థిక్ మంత్రిగా బడ్జెట్ ప్రవేశపెట్టుతున్నట్లు గొప్పలు చెప్పింది తప్ప దేశ ప్రజలకు బడ్జెట్ తో ఒరిగింది ఏమీ లేదు అని అన్నారు. ఎప్పటి లాగానే బాధ వ్యాపారస్తులకు లాభం చేకూరేలా ఉంది అని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి నిధులు తేవడంలో ఇద్దరు కేంద్ర మంత్రులు విఫలమయ్యారు అని ఆయన అన్నారు.

సిట్ విచారణ పేరుతో వేధింపులు

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 1: కేసీఆర్ ని సిట్ విచారణ పేరుతో రాజకీయ వేధింపులకు గురిచేస్తున్నారనీ బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం కెసిఆర్ ను వేధింపులకు గురి చేస్తున్నారని నిరసనగా జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు నిరసనకు దిగారు. నల్ల కండువాలు ధరించి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇది విచారణ కాదు, రాజకీయ ప్రతీకారం అంటూ నినాదాలు చేస్తూ, ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో విచారణల పేరుతో ప్రతిపక్ష నాయకులను టార్గెట్ చేయడం అన్యాయమని, ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. అంబేద్కర్ చౌరస్తాలో రాష్ట్ర సాధకునిపై రాజకీయ కుతంత్రాన్ని సిద్దిపేట ప్రజలుగా ముక్త కంఠంతో నిరసిస్తున్నాం అంటూ సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, నాయకులు యెల్లు రవీందర్ రెడ్డి, జాప శ్రీకాంత్ రెడ్డి, కోలా రమేష్, జైపాల్ రెడ్డి, జవ్వాజి , నాయకులు, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

"

కేంద్ర బడ్జెట్ ఫలాలు ఏపీ ప్రగతికి దోహదం చేసేలా ఉన్నాయి. పర్యాటక రంగ ప్రోత్సాహకాలు అరకు అభివృద్ధికి, ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్ రాష్ట్ర తీర ప్రాంత పారిశ్రామిక ప్రగతికి మరింత ఊతం ఇస్తుంది. బడ్జెట్‌లో కొబ్బరి, జీడిపప్పు, కోకో రైతుల కోసం ప్రవేశపెట్టిన పథకాలతో కోనసీమ కొబ్బరి రైతులకు, ఉత్తరాంధ్ర జీడి రైతులకు మేలు జరుగుతుంది.

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

ప్రాంతీయం

మున్సి 'పోల్స్'లో మైనంపల్లి వర్సెస్ హరీశ్ రావు

- మెదక్ లో పోటాపోటీగా పార్టీ రాజకీయ సమీకరణలు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 1: మెదక్ నియోజకవర్గంలోని రెండు పార్టీల మధ్య వైరం పెరిగిపోతున్నది. అగ్ర నాయకుల మధ్య పోరు ఎన్నికల మీద పడింది. మెదక్ నియోజకవర్గంలోని మెదక్ రామయంపేట మున్సిపాలిటీలలో పార్టీ జెండా ఎగరాలని రెండు అగ్ర నాయకులకు మధ్య పోరు కొనసాగుతుంది. మెదక్ పట్టణంలో పోటాపోటీగా పార్టీల రాజకీయ సమీకరణలు జరుగుతున్నాయి. ఈసారి ఎన్నికలు అగ్ర నాయకులకా? మున్సిపాలిటీలకా? అన్న చందంగా తయారైందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మెదక్ (32వార్డులు), రామాయంపేట (12 వార్డులు) అధికార పార్టీ కాంగ్రెస్. రాష్ట్ర నాయకుడు మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు. బీఆర్ఎస్ అగ్ర నేత మాజీ మంత్రి హరీష్ రావు మధ్య మున్సిపల్ పోరు సాగుతోంది. కాంగ్రెస్ పార్టీలో 25 సంవత్సరాల నుండి పనిచేస్తున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సుప్రభాత రావు హరీష్ రావు సమక్షంలో పార్టీలో చేరడంతో రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో చర్చనీయాంశంగా మారింది. పార్టీనే నమ్ముకొని పార్టీ కోసం కష్టాలు పడి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎదిగిన చౌదరి సుప్రభాత రావు పార్టీ వీడడంతో కాంగ్రెస్ పార్టీకి నష్టమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. జిల్లాలో మెదక్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మెదక్ రామయంపేట మున్సిపాలిటీల పైన కాంగ్రెస్ జెండా ఎగరాలని మరోసారి కాంగ్రెస్ సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇప్పటికే మెదక్ రామయంపేట మున్సిపాలిటీలో పర్యటనలు చేస్తున్నారు. ఎలాగోలో కాంగ్రెస్ జెండా ఎగరాలని గెలుపు గుర్రాలకు టికెట్లు ఇచ్చి వారి వెనక పార్టీ గెలుపు కోసం తీవ్రంగా కృషి చేస్తూ ముందుకు నడుస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో గెలుపు గుర్రాలకే టికెట్ ఇవ్వడంతో సీనియర్ నాయకులు అలిగి ఇతర పార్టీలకు వెళ్లడం జరుగుతుందని ఇక్కడ గెలుపు గుర్రాలకు ప్రజలకు సేవ చేసే ప్రజలు అనుకున్న వారిని కాంగ్రెస్ పార్టీ నిలబెట్టడం జరిగిందని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి మెదక్ నియోజకవర్గంలో పూర్వ వైభవం తీసుకురావడం కోసం మెదక్ రామయంపేట గులాబీ జెండా ఎగరాలని సీనియర్ నాయకులు ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, నాయకులు నగేష్ ముదిరాజ్ తో కమిటీ వేసి గెలుపు ధీమాగా ఉన్న కార్యకర్తలను టికెట్ ఇచ్చి బరిలో నిలిపారు. బీఆర్ఎస్ పార్టీలో గెలుపుకు ప్రాధాన్యతమిస్తూ మాజీ మంత్రి హరీష్ రావు తన ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు.

ప్రజల కోసం సేవ చేసే నాయకులను ఎన్నుకోండి
మెదక్ సిటిజన్ ఫోరం కొండల్ రెడ్డి

జరిగే మున్సిపల్ ఎన్నికలలో మెదక్ రామయంపేట నర్సాపూర్ తూప్రాన్ మున్సిపల్ ఎన్నికలలో ప్రజల కోసం సేవ చేసే నాయకులను మాత్రమే ఎన్నుకోండి అని సేవా పేరు ప్రజల సొమ్మును దోచుకున్న నాయకులను దూరం పెట్టాలని ప్రతి ఐదు సంవత్సరాలకు జరిగే ఎన్నికలలో ప్రజలు బాగా ఆలోచన చేసి నాయకుడిగా ఎంచుకోవాలని ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిమిట్టని మెదక్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు బి కొండల్ రెడ్డి తెలిపారు ఇప్పుడున్న ప్రస్తుత రాజకీయ పార్టీ నాయకులు మున్సిపల్ కౌన్సిలర్లు ప్రజాల ద్వారా ఎన్నుకోబడిన వారు ప్రజాసేవ కోసం పనిచేయాలి ప్రజాసేవను అడ్డంపెట్టుకుని తమ స్వలాభం కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు. వ్యాపారవేత్తలు తమ స్వలాభం కోసం ఎన్నో రూపాయలను పెట్టి ఓటర్లను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్న తర్వాత తమ వ్యాపారస్తుల పెంచుకోవడమే తప్ప ప్రజలకు చేసేది ఏమీ లేదని కావున ప్రజల కోసం ప్రజల సేవ చేయడానికి మాత్రమే ప్రజా జీవితంలోకి రావాలని వారికి మాత్రమే ఓటు వేయాలని తమా స్వలాభం కోసం వచ్చే రాజకీయ నాయకులను తరిమికొట్టాలని ప్రజాస్వామ్యవాదులు హెచ్చరిస్తున్నారు.

ఫిబ్రవరి 12న సమ్మె జయప్రదం చేయాలి

- ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం లో పిలుపు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 1 : ఈనెల ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదానికై సన్నాహాలు చేస్తున్నామని సీఐటీయూ మెదక్ జిల్లా కార్యదర్శి మల్లేశం అన్నారు. ఆదివారం పట్టణంలోని కేవల్ కిషన్ భవన్ లో సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇచ్చేటటువంటి పద్ధతుల్లో స్వాతంత్రం పూర్వం సాధించుకున్న 29 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం జరిగిందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చడమే కాదు, పథకం యొక్క మౌలిక స్వరూపాన్ని మార్చేసి కూలీలకు అందకుండా 90% నుండి 60 శాతానికి తన నిధులను రద్దు చేసి, చేతులు దులుపుకుందన్నారు. వ్యవసాయ కార్మికులకు, రైతాంగానికి మోటార్లకు మీటర్లు పెట్టాలని ఉద్దేశం తోనే విద్యుత్ సవరణ బిల్లు తెచ్చాడన్నారు. అలాగే విత్తన సవరణ బిల్లు తీసుకురావడం జరిగింది అన్నారు. దీంతో రైతులు నాసిరకం విత్తనాలు కొనుగోలు చేసి పంట నష్ట పోయే ప్రమాదం ఉందన్నారు. గిట్టుబాటు రాక, తీవ్రంగా అప్పుల పాలవుతున్నారన్నారు. కార్మికులకు నష్టం చేసి పెట్టుబడిదారులకు లాభం చేసే విధంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. కార్మిక సంఘాలన్నీ కూడా ఇప్పటికే లేబర్ కోడ్ లను రద్దుచేసి, పూర్వమున్న కార్మిక చట్టాల్ని పునరుద్ధరించాలని డిమాండ్లతో ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహించడం జరుగుతుందన్నారు. దీంతో మోడీకి గుణపాఠం చెప్పబోతున్నామన్నారు. మండల కేంద్రాల్లో షాప్ వర్కర్లు, టెంట్ హౌస్ వర్కర్లు, పెట్రోల్ బంక్ వర్కర్లు అందరూ కూడా ఒకరోజు పని బంద్ చేసి, ఆరోజు జరిగే సమ్మెలో పాల్గొనేందుకు ముందుకు రావాలని సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశంలో పిలుపునిచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి నర్సమ్మ, టౌన్ కార్యదర్శి సంతోష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోరంకల మల్లేశం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్తూపం సాక్షిగా
ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అబద్ధాలు

- అమర వీరుల స్థూపానికి పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పాలాభిషేకం
- సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 1: సిద్దిపేట అమరవీరుల స్తూపం సాక్షిగా బీఆర్ఎస్ నాయకుడు అర్ఎస్ ప్రవీణ్ కుమార్ దయ్యాలు అబద్ధాలు మాట్లాడారని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఎద్దేవా చేశారు. సిద్దిపేటలో ఆదివారం అరెస్ ప్రవీణ్ కుమార్ అబద్ధాలు మాట్లాడినందుకు నిరసన వ్యక్తం చేస్తూ అమర వీరుల స్థూపానికి అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అత్తు ఇమామ్ మాట్లాడుతూ మాజీ ఐపిఎస్ అధికారి బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఎస్పీలో ఉన్నప్పుడు కేసీఆర్ అవినీతి చేశాడని చెప్పలేదా? అని ప్రశ్నించారు. బీఎస్పీ పార్టీలో ఉన్నప్పుడు దళిత వ్యతిరేకి కేసీఆర్ అని, కేసీఆర్ పైనే పోరాటం చేస్తానని చెప్పిన ప్రవీణ్ కుమార్ దళితులను మోసం చేసేలా బీఆర్ఎస్ పార్టీతో కుమ్మక్కై నమ్మిన సిద్ధాంతాలను వదిలి బీఆర్ఎస్ పార్టీలో చేరారు అని అన్నారు. అప్పుడు అవినీతి చేశాడని చెప్పి ఇపుడు బీఆర్ఎస్ లోకి రాగానే కేసీఆర్ ఏ తప్పు చేయలేదు అనడం సిగ్గుచేటు అని అన్నారు. కేసీఆర్ ను నమ్మి 10 సంవత్సరాల పాటు తెలంగాణ ప్రజలు అధికారం ఇస్తే లక్షల కోట్లు అవినీతి చేసి ప్రజలను మోసం చేశారు అని అన్నారు. తెలంగాణ ఎవరి సొత్తు కాదని అధికారం ఎవరికి ఇవ్వాలో తెలంగాణ ప్రజలు నిర్ణయిస్తారు అని అన్నారు. తీవ్రవాదం దేశ రక్షణ కోసం టెలిగ్రాఫ్ చట్టం తెచ్చారు అని ఇష్టం వచ్చిన వారి కుటుంబ సభ్యుల ఫోన్ వినాలని చట్టం చెప్పలేదు అని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు పక్కా ఆధారాలు ఉన్నాయని, అందుకే నేరం చేసిన వారికే నోటీసులు ఇచ్చి అధికారులు విచారణ చేస్తున్నారు అని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసిన వారు తప్పు చేసినట్లయితే తప్పకుండా జైలుకు వెళ్లడం ఖాయం అని అన్నారు. తెలంగాణ ప్రజల పక్షాన నిలబడాల్సిన అరెస్ ప్రవీణ్ కుమార్ కేసీఆర్ జపం చేయడం ఇకనైనా మానుకోవాలి అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్ష్యపూరితంగా వ్యవహరించడం లేదు అని అనవసరంగా కావాలని రేవంత్ రెడ్డి ని విమర్శించడం మానుకోవాలి అని అన్నారు. మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మంత్రులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శిస్తే తగిన గుణపాఠం చెబుతాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్యాదారి మధు, గాయాజుద్దీన్, హర్షద్, విజయ్, డానియల్, బాబా, అజర్, రవి తేజ, విశాల్, ప్రాషీ, అర్జున తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ మండలంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 1: మండలంలోని దిలాల్పూర్, అహ్మదీపూర్ గ్రామాల్లో ఆదివారం నాడు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహన కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వేధింపులకు పాల్పడుతోందని నిరసన వ్యక్తం చేశారు. దిలాల్పూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు రఘుపతి రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కక్షపూరితంగా బీఆర్ఎస్ నాయకులను అప్రతిష్టపాలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్కు నోటీసులు ఇవ్వడం దురదృష్టకరమని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి నియంత పాలనకు అంతం కావాలని నినాదాలు చేశారు. అదేవిధంగా గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ నేతృత్వంలో రాష్ట్రవ్యాప్త నిరసనల్లో భాగంగా ప్రభుత్వ దిష్టిబొమ్మ దహన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు రవీందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, రాజు గౌడ్, భాస్కర్ రెడ్డి, లచ్చి రెడ్డి, బాలకిషన్, బాల గౌడ్, స్వామి, వెంకట్ గౌడ్, గవాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల నిరసన

ప్రతిపక్షం, మిడిదొడ్డి, ఫిబ్రవరి 1: కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా కేసులు బనాయిస్తూ విచారణ పేరుతో కేసీఆర్ ను ఇబ్బందులకు గురి చేస్తున్నదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మిరుదొడ్డి, అక్బర్ పేట భూంపల్లి మండలాల వ్యాప్తంగా పార్టీ పిలుపుమేరకు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఆందోళన చేపట్టారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షుడు కుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో నాయకులు కిష్టయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు. అక్బర్ పేట భూంపల్లి జాతీయ రహదారిపై సోలిపేట సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున రాస్తారోకోని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుచితంగా వ్యవహరిస్తుందన్నారు. మండల అధ్యక్షుడు నగరం రవి, పంజాల శ్రీనివాస్ గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో చేనేతకు మొండిచేయి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో చేనేతకు మొండిచేయి చూపిందని సిద్దిపేట జిల్లా చేనేత ఐక్యవేదిక అధ్యక్షులు ముదిగొండ శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలో రైతులకు అన్ని రకాల రాయితీలు ప్రోత్సాహకాలు, గిట్టుబాటు ధరలు అందిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఆ స్థాయిలో రైతు తర్వాత చేనేత అని చెప్పుకునే కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కేటాయించిన బడ్జెట్లో కేవలం 10శాతం కూడా చేనేతకు కేటాయించకపోవడం దురదృష్టకరమన్నారు. దేశానికి అన్నం పెట్టేవాడు రైతు అయితే మనిషి మానవ మనుగడకు అద్దం పట్టే బట్టలు నేసిన చేనేతను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగదన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే చేనేత కార్మికులకు ప్రోత్సాహకాలు అందించే విధంగా 29 రాష్ట్రాలలోని అన్ని జిల్లాలలో క్లస్టర్ ద్వారా చేనేత కార్మికులకు ఉపాధి అందించి బ్యాంకు రుణాలు మంజూరు చేసి ఆధునిక చేనేత బట్టలు తయారు చేసే విధంగా జాకాటు మొగ్గలు సబ్సిడీతో అందించాలని, తయారు చేసిన బట్టలను కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆఫీసులలో రైల్వేలో హాస్పిటల్ లోను కొనుగోలు చేసి నేత కార్మికులకు ఉపాధి కల్పించి వారి జీవన విధానం మెరుగుపడే విధంగా తోడ్పాటు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయకపోతే అంధకారంలోకి కార్మిక వర్గం

- ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి
- కార్మిక సంఘాల జిల్లా సదస్సులో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు పిలుపు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులు హరించి వేసి 29 చట్టాలు రద్దుచేసి వాటి స్థానంలో తీసుకువచ్చిన లేబర్ కోడ్ ల వల్ల కార్మిక వర్గం అంధకారంలోకి నెట్టబడుతుందని కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు పరచెంతవరకు పోరాడాలని అందుకు జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు పిలుపునిచ్చారు. ఆదివారం రోజున కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో జరిగిన సమ్మె ప్రిపరేషన్ జిల్లా సదస్సు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు పిండి అరవింద్, హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మధు అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, బీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి మచ్చ నర్సింలు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణపురం, లక్ష్మణ్ హెచ్ఎంఎస్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ హాజరై మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గానికి కష్టం కలిగించే నాలుగు లేబర్ కోర్లను తెచ్చిందని, ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను 2020లోనే రద్దుచేసి 2025 నవంబర్ 21వ తేదీ నుండి ఈ లేబర్ కోడ్లను అమలు చేయాలని నోటిఫికేషన్స్ విడుదల చేసిందన్నారు. లేబర్ కోడలు అమల్లోకి వస్తే కార్మిక సంఘాల ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందని కార్మికుడి యొక్క ప్రశ్నించే తత్వమే కోల్పోతుందని అన్నారు. ఇప్పటివరకు ఎన్నో ప్రాణ త్యాగాలు చేసి ఎర్రజెండా కొట్లాడి సాధించిన ఎనిమిది గంటల పనికి మంగళం పాడి నేడు 10 నుండి 12 గంటల వరకు పని గంటలు పొడిగించారని తెలిపారు. అలాగే కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకోవడానికి 100 మంది ఉంటేనే సంఘం పెట్టుకోవాలని కార్మిక ఉన్నవారిలో 10 శాతం మంది ఉంటేనే సంఘం పెట్టాలని తెలిపారు. అలాగే కనీస వేతనాలు ఇప్పటివరకు ఒక కార్మికుడు కుటుంబం బ్రతకాలంటే అధికారికంగానే 11 వేల రూపాయలు అమలు చేస్తున్నారు అవి కూడా సరిపోవని ఐఎల్ఓ నిబంధన వారి ప్రకారం ఒక కుటుంబానికి 26 వేల రూపాయల వేతనాన్ని ఇవ్వాలని చెప్తుంటే నేడు మినిమం వెజ్ కోడ్ లో కనీస వేతనం రోజుకు 176 రూపాయలు నెలకు 4676 మాత్రమే జీతం చెల్లించాలని ఇందులో పొందుపరిచారు అంటే కార్మిక వర్గాన్ని మరింత ధీన స్థితిలోకి నెట్టు వేయడానికి ఇలా చేశారన్నారు వీటితోపాటు పర్మనెంట్ పనికి పర్మినెంట్ వర్కర్ విధానం ఇప్పటివరకు అమల్లో ఉన్నదని నేడు ఈ లేబర్ కోడల వల్ల ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్ విధానం తీసుకొచ్చి కార్మికుడిని ఉట్టి చేతుల తోనే సంవత్సరం రెండు సంవత్సరాల గడువుతో ఇంటికి పంపే విధంగా ఈ విధానాలు ఉన్నాయని వేటితో పాటు పిఎఫ్ ఈఎస్ఐ ఉద్యోగ భద్రత అంటూ ఏమీ లేవని ఇవి అడగాలంటే కార్మిక సంఘాలు లేకుండా చేయడానికి అనేక అంశాలు పెట్టి ఈ లేబర్ కోడ్ లో పొందుపరిచారని అందుకని వీటి రద్దు వరకు కార్మిక వర్గం ఐక్యంతో విశాల ఉద్యమాలు నిర్వహించేందుకే ఫిబ్రవరి 12వ తేదీన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నామని ఈ సమ్మెలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సదస్సులో సిఐటియు జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, ఉపాధ్యక్షులు ఎం పద్మ, శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు పిట్ల మల్లేశం, బి ఆర్ టి యు నాయకులు దుర్గం శ్రీనివాస్, బండారి నర్సింలు, పట్టణ అధ్యక్షులు బర్ల కాడి శ్రీనివాస్, వివిధ యూనియన్ల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్ సమాజ
జిల్లా అధ్యక్షునిగా మహాదేవుని శ్రీనివాస్

- వర్కింగ్ ప్రెసిడెంట్ గా ప్రశాంత్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 1: వీరశైవ లింగాయత్ సమాజ జిల్లా అధ్యక్షునిగా మహాదేవుని శ్రీనివాస్ (కొమురవెల్లి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని వీరశైవ లింగాయత్ సమాజ భవనంలో జరిగిన జిల్లా కమిటీ ఎన్నికల్లో మహాదేవుని శ్రీనివాస్ జిల్లా అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఆకుల ప్రశాంత్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవి ఒక బాధ్యతగా భావించి జిల్లాలోని అన్ని వర్గాలను కలుపుకొని సమాజ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలో రుద్రభూమి, బసవ భవనం ఏర్పాటు కోసం రాష్ట్రస్థాయి పెద్దల సహకారంతో ముందుకు సాగుతానని అన్నారు. తనపై నమ్మకం ఉంచిన జిల్లాలోని వీరశైవులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికలు సిద్దిపేట పట్టణ అధ్యక్షులు నరుకుల శివప్ప, జిల్లా గౌరవాధ్యక్షులు ఆకుల భద్రప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, పట్టణ కమిటీ నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

“

జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారు. టీడీపీ దాడులను అడ్డుకోవద్దని పైస్థాయి నుంచి ఆదేశాలున్నాయని సిబ్బంది చెబుతున్నారు. ఏపీలో రాష్ట్రపతి పాలన పెట్టాలి. కేంద్ర బలగాలను పంపాలి. లేదంటే వేలాది మంది ప్రాణాలకు ముప్పు.
- వైసీపీ నేత పేర్నినాని

ప్రాంతీయం

కేసీఆర్‌ను ముట్టుకుంటే
తెలంగాణ అగ్నిగుండమే

- అక్రమ కేసులను నిరసిస్తూ తొగుట లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో
- బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి

ప్రతిపక్షం, తొగుట, ఫిబ్రవరి 1: తెలంగాణ ప్రధాత కేసీఆర్ పై అక్రమ కేసులను యావత్ తెలంగాణ ప్రజలు నిరసిస్తున్నారని, కేసీఆర్ ను ముట్టుకుంటే తెలంగాణ అగ్నిగుండమే అవుతుందని తొగుట మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి హెచ్చరించారు.. కేసీఆర్ పై సిట్ విచారణను నిరసిస్తూ తొగుట లో పార్టీ శ్రేణులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌పై సిట్ విచారణ: రాజకీయ ప్రతీకారానికి అద్దం పడుతుందని, తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలు ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటుగా మారుతున్నాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సిట్ విచారణ ప్రారంభించడం ప్రభుత్వం చేసిన అత్యంత నీచమైన రాజకీయ ప్రతీకార చర్యగా స్పష్టంగా కనిపిస్తోందన్నారు.. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికి జైలు పాలైన రేవంత్ రెడ్డి రాజకీయ కక్ష సాధింపు చర్యతో చేస్తున్నట్లు కనిపిస్తుందన్నారు. కేసీఆర్‌ను భయపెట్టలేక, ప్రజల్లో ఆయనకు ఉన్న ఆదరణను తట్టుకోలేక ప్రభుత్వం ఈ విచారణ నాటకాన్ని మొదలు పెట్టిందన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైన ప్రభుత్వం, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్ పేరును ఆయుధంగా మార్చుకుందన్నారు. తెలంగాణ ప్రజలు అమాయకులు కారు. ఉద్యమాన్ని చూసిన ప్రజలు, చరిత్రను సృష్టించిన ప్రజలు. కేసీఆర్‌పై జరుగుతున్న ఈ దాడిని వారు నిశితంగా గమనిస్తున్నారని ఎన్నికలు ఎప్పుడు వొచ్చినా బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. అనంతరం సిట్ విచారణ కు నిరసనగా నల్ల జెండాలు ప్రదర్శిస్తూ నినాధాలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని దహనం చేస్తుండగా సీఐ లతీఫ్ ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమం లో సర్పంచ్ బక్క కనకయ్య, నాయకులు చిలువేరు మల్లారెడ్డి, వేల్పుల స్వామి, కంది రాంరెడ్డి, కుర్మ యాదగిరి, పబ్బతి వెంకట్ రెడ్డి, మంగ నర్సింలు, ఎల్లం, యాదగిరి. అరుణ్ కుమార్. శ్రీనివాస్ గౌడ్, నరేందర్ గౌడ్, బోయిని శ్రీనివాస్, చెరుకు లక్ష్మారెడ్డి, కర్ణాకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి. వెంకటేశం గౌడ్. హబీద్ హుస్సేన్, సుభాష్ గౌడ్. కిరణ్ కుమార్ రెడ్డి. కోల .శ్రీకాంత్ గౌడ్ శ్రీనివాస్ గౌడ్, పవన్, కరుణాకర్, స్వామి, రమేష్, భాస్కర్, కాళిదాస్ శ్రీనివాస్, జహంగీర్, నరేందర్, భూమయ్య, కత్తుల రమేష్, రాంబాబు, మల్లేశం, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

చైతన్యం, సంఘటిత మార్గమే కార్యాచరణ

- అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు గూడూరి ప్రవీణ్

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 1: అంబేద్కర్ ఆశయాలను గ్రామస్థాయిలో అమలు చేయడమే లక్ష్యంగా అంబేద్కర్ సంఘాన్ని క్రమబద్ధంగా నడిపిస్తానని నూతన అధ్యక్షుడు గూడూరి ప్రవీణ్ తెలిపారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఆర్అండ్ఆర్ కాలనీ పల్లెపహాడ్ లోని ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంబేద్కర్ సంఘం అధ్యక్ష ఎన్నికల్లో గూడూరి ప్రవీణ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ అంబేద్కర్ సూచించిన చదువు, చైతన్యం, సంఘటితం, మార్గమే అంబేద్కర్ సంఘానికి కార్యాచరణ అన్నారు. యువతలో అవగాహన పెంచి, హక్కుల సాధన కోసం సంఘటితంగా పనిచేస్తాం అని తెలిపారు. గ్రామంలో సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారంలో అంబేద్కర్ సంఘం క్రియాశీల పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ అంబేద్కర్ అధ్యక్షులు, పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

చేగుంట ఉపసర్పంచ్ కు స్నేహితుల సన్మానం

ప్రతిపక్షం, చేగుంట, ఫిబ్రవరి 1: చేగుంట మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గా ఎన్నికైన మహమ్మద్ రఫీక్ ను పదవ తరగతి బ్యాచ్ కు చెందిన స్నేహితులు ఘనంగా సన్మానించారు. 1996 లో పదవ తరగతి బ్యాచ్ కు చెందిన స్నేహితులు ఏకమై ఉప సర్పంచ్ గా ఎన్నికైన మహమ్మద్ రఫీక్ ను గజమాలతో సన్మానించారు. అనంతరం సర్పంచ్ స్రవంతి సతీష్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తోటి స్నేహితులు విద్యుత్ లైన్ మెన్ చాట్ల సంతోష్, సండ్రుగు రవి, జర్నలిస్టు మురళి, పులబోయిన రమేష్, పోషాద్రి, డిష్ పేర్ల రాజు, నాగకృష్ణ, జూలూరి, కిరణ్, నయీమ్ ,రామస్వామి, బాలయ్య, భోగ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

ప్రతిపక్షం, చేగుంట, ఫిబ్రవరి 1: చేగుంట మండలం బి, కొండాపూర్ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని చేగుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంగళరావుకు ఆహ్వానం అందజేశారు. కొండాపూర్ సర్పంచ్ రంగయ్య గారి రాజిరెడ్డి సమక్షంలో ఆహ్వాన పత్రం అందజేసే ఆహ్వానించారు. ఈనెల మూడవ తేదీ నుండి 8వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు వెంకట్ రెడ్డి, రమేష్ గుప్త, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి ఎదురైంది. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలను ఇస్తే బదులుగా గుండుసున్నా ఇచ్చారు. రూ 34,367 కోట్ల ట్రిపుల్‌ఆర్, మెట్రో ఫేజ్-2 విస్తరణ నిధులు, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ వంటి అంశాలను కేంద్రం విస్మరించింది. వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం వంటి కీలక డిమాండ్లను పట్టించుకోదు. కో-ఆపరేటివ్ ఫెడరలిజం అంటే ఇదేనా?.

- జాగృతి అధ్యక్షురాలు కవిత

'యూరియా బుకింగ్ మొబైల్ యాప్' నేటి నుంచి అమలు

- జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 1: రైతులకు యూరియా ఎరువులు సకాలంలో, పారదర్శకంగా అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన "యూరియా బుకింగ్ - మొబైల్ యాప్" ను ఈ నెల ఫిబ్రవరి 2వ తేదీ నుంచి సిద్దిపేట జిల్లాలో అమలు చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి తెలిపారు. యూరియా అక్రమాల నివారణకు సాంకేతికతను వినియోగిస్తున్నామని, రైతుల ఖాతా ఆధారంగానే యూరియా బుకింగ్ విధానం అమలు చేయబడుతుందని పేర్కొన్నారు. రైతులు కాకుండా ఇతరులు యూరియా కొనుగోలు చేయకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇకపై యూరియా బుకింగ్ మొత్తం మొబైల్ యాప్ ద్వారానే జరుగుతుందని, రైతులు యాప్‌లో పంట వివరాలు నమోదు చేసి అవసరమైన యూరియా పరిమాణాన్ని బుక్ చేసుకోవచ్చన్నారు. పాస్‌బుక్ నంబర్, మొబైల్ నంబర్ నమోదు చేసిన తరువాత ఓటీపీ ద్వారా ధృవీకరణ జరుగుతుందని చెప్పారు. రైతు భూమి విస్తీర్ణం, పంట వివరాల ఆధారంగా అవసరమైన యూరియా పరిమాణం యాప్‌లో కనిపిస్తుందని వివరించారు. భూమి విస్తీర్ణాన్ని బట్టి యూరియా విడతలుగా అందజేస్తామని తెలిపారు. 5 ఎకరాల లోపు రైతులకు రెండు విడుతలలో, 5 నుంచి 20 ఎకరాల రైతులకు మూడు విడుతలలో, 20 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు నాలుగు విడుతలలో యూరియా సరఫరా చేస్తామని వెల్లడించారు. రైతులు డీలర్ వద్దకు వెళ్లే ముందు తప్పనిసరిగా బుకింగ్ నంబర్ తీసుకొని వెళ్లాలని, డీలర్లు బుకింగ్ నంబర్ మరియు ఆధార్ నంబర్ పరిశీలించిన తరువాతే యూరియా ఇవ్వాలని సూచించారు. బుకింగ్ చేసిన 24 గంటలలోపు యూరియా కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ విధానం ద్వారా రైతులు, ఎన్‌డీఏస్ రైతులు, కౌలు రైతులు కూడా బుకింగ్ చేసుకోవచ్చని, యూరియా పంపిణీ పూర్తిగా ఈ-పాస్ (ePOS) , యాప్ విధానంలోనే జరుగుతుందని స్పష్టం చేశారు. ఒక్క ఎకరాకు అవసరమైన పరిమాణంలోనే యూరియా సరఫరా చేయబడుతుందని చెప్పారు. యాప్ ద్వారా జిల్లా వ్యాప్తంగా యూరియా ఎక్కడ అందుబాటులో ఉందో రైతులకు నేరుగా సమాచారం లభిస్తుందని, సహకార సంఘాల నుంచి కూడా యూరియా కొనుగోలు చేసుకునే వెసులుబాటు ఉంటుందని తెలిపారు.

అన్ని వర్గాలకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్

- బీజేపీ పట్టణ అధ్యక్షుడు వెంకట్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 1: ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారతదేశం ఎదిగేందుకు ప్రస్తుత బడ్జెట్ ఎంతో దోహదపడుతుందని సిద్దిపేట బిజెపి పట్టణ అధ్యక్షుడు వెంకట్ అభిప్రాయపడ్డారు. అన్ని వర్గాల ప్రజలకు కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎంతో అనుకూలంగా ఉందని తెలిపారు. కేంద్ర బడ్జెట్లో దేశాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం, రైతాంగం, యువతకు ప్రాధాన్యమిచ్చారు. ఈ బడ్జెట్ ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుంది.

26 వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచారం

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 1: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మెదక్ మున్సిపల్ 26వ వార్డు టిఆర్ఎస్ అభ్యర్థి దీపక్ కుమార్ తెలిపారు. ఆదివారం 26వ వార్డుల విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలే బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయని మెదక్ మున్సిపల్ పైన గులాబీ జెండా ఎగురుతుందని ఆయన దీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 26వ వార్డులో ఇంటిటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో యువజన సంఘం నాయకులు గడ్డి అనిల్, బాబు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక బడ్జెట్‌తో దేశం ఆర్థికంగా మరింత బలోపేతం

- బీజేపీ నేతలు సంగప్ప జన్వాడే, బైరీ శంకర్ ముదిరాజ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ చారిత్రాత్మకమైనదని భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా ప్రభారి సంగప్ప జన్వాడే, జిల్లా అధ్యక్షుడు బైరీ శంకర్ ముదిరాజ్ అన్నారు. అగ్రదేశాలతో పోటీపడుతూ భారతదేశాన్ని ఆర్థికంగా ప్రపంచంలో నాలుగో స్థానంలో నిలబెట్టిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీకే దక్కుతుందని వారు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, ఈ బడ్జెట్ రైతులు, మహిళలు, చిరు వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు ఎంతో మేలు చేసేలా రూపకల్పన చేయబడిందన్నారు. ముఖ్యంగా పేదలు, మధ్యతరగతి ప్రజల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. తాజా బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్న వారు, రాష్ట్రానికి మూడు హైస్పీడ్ రైళ్లను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ ఏర్పాటు ద్వారా ఉత్తర తెలంగాణ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా ట్రంప్ విధిస్తున్న ఆంక్షలను సమర్థవంతంగా ఎదుర్కొంటూ, దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ త్వరలోనే భారత్‌ను ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టే దిశగా ప్రధాని నరేంద్ర మోడీ ముందుకు సాగుతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు తొమ్మిది కేంద్రీయ విద్యాలయాలు, పదహారు జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ చర్యలతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య మరింత చేరువ అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ అధ్యక్షులు బాసంగారి వెంకట్, నాయకులు తొడుపు నూరి వెంకటేశం, డాబా నరేష్, గందే సంతోష్, పవన్ తేజ రెడ్డి, ఏర్వ గణేష్, మహేందర్, శ్రీనివాస్, సాయిబాబా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీకి మొండిచేయి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 1: కేంద్ర బడ్జెట్ లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేవలం 30 వేల కోట్లు కేటాయించి కేంద్ర ప్రభుత్వం మొండిచెయి చూపిందని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. గత సంవత్సరం ఉపాధి హామికి గత సంవత్సరం బడ్జెట్ లో 86 వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్ లో కేవలం 30 వేల కోట్ల ను మాత్రమే కేటాయించి కూలీలకు అన్యాయం చెసిందన్నారు. ఇంకా అమలులోకి విబి గ్రామ్ జి చట్టానికి సైతం అతి తక్కువగా 95 ,672 వేల కోట్ల ను మాత్రమే కేటాయించినదన్నారు. దేశ వ్యాప్తంగా వున్న 33 కోట్ల కూలీలకు నూతన చట్టం ప్రకారం 125 రోజు పని దినాలు కేంద్రం వాటా 60 శాతం నిధల ప్రకారం 2.40 లక్షల కోట్లు అవసరముండగా 95 వేల కొట్లను మాత్రమే కేటాయించారన్నారు. చట్టబద్ద పని హక్కులను కాలక్రమేణ హరిస్తున్నారు. పని హక్కుల పరిరక్షణకు సోమవారం నాడు చలో హైదరాబాదు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాకు కూలీలు తరలి రావాలని శంకర్ కోరారు.

రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోంది

- కేసీఆర్‌కు సిట్ నోటీస్ అప్రజాస్వామికం
- మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి
- ఎన్నికల ఇన్చార్జి మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 1 : రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తున్నారని, ప్రశ్నించే వారి పైన వివిధ రకాల కేసులను పెట్టి వేధించడం సరికాదని, ప్రజల ఆకాంక్షను తుంగలో తొక్కి ప్రశ్నించిన వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు పెడుతూ ఆరాచక పాలన సాగిస్తున్నారని మాజీ డిప్యూటీ స్పీకర్ బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి, మెదక్ ఎన్నికల ఇన్చార్జి మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలసి నల్ల జెండాలు కండువాలు ధరించి బైక్ నిర్వహించి రాందాస్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిట్ పేరుతో ఉద్యమ నాయకుడు, మాజీ సీఎం కేసీఆర్‌ను వేధిస్తున్నారని అన్నారు. కేసీఆర్‌కు సిట్ నోటీసులను ఖండించారు. కాంగ్రెస్, రేవంత్ సర్కార్ వేధింపులను నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు మెదక్ లో బీఆర్ఎస్ శ్రేణులు శాంతియుత ఆందోళనలు చేపట్టామని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్‌కు సిట్ నోటీస్ జారీ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని తీవ్రంగా విమర్శించారు. ప్రజలిచ్చిన ప్రజాస్వామ్య మాండేట్‌ను గౌరవించకుండా, ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని దర్యాప్తుల పేరుతో వేధింపులకు పాల్పడటం సరికాదని అన్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విచారణ జరగాలని, రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా సిట్ వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకే ఇలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన ఏ హామీని సక్రమంగా అమలు చేయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదారి పట్టించటానికి ఫోన్ టాపింక్ పేరుతో తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్‌పై కక్షకట్టి వేధింపులకు పాల్పడుతుందన్నారు. రాష్ట్రంలో రైతులకు సక్రమంగా యూరియా అందించలేని చేతగాని ప్రభుత్వముందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం పోయి, రాక్షస రాజ్యం వచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తి, ప్రజల కష్టాలను తీర్చిన వ్యక్తి గొప్ప వ్యక్తి కేసీఆర్ అన్నారు. 10 సంవత్సరాలు కెసిఆర్ తెలంగాణను అభివృద్ధి పథకంలో నడిపించారన్నారు. ఆసరా పింఛన్లు ,కల్యాణ లక్ష్మి షాది ముబారక్, రైతుబంధు కాళేశ్వరం ద్వారా పంటకు నీళ్లు అందించిన గొప్ప వ్యక్తి కేసీఆర్ పై కక్ష సాధింపులు భాగంగా రేవంత్ రెడ్డి అవమానించారని ఆరోపించారు. ఏ తప్పు చేయకపోయినా కాళేశ్వరం పేరుతో ఫోన్ ట్యాపింగ్లతో కుట్ర కుతంత్రాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. ఇవన్నీటిని తెలంగాణ ప్రజలు తిప్పి కొడతారన్నారు. 40 లక్షల ఎకరాలకు నీళ్లు అందించిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. ఎన్నికల్లో ఓడిపోతామని భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి కుట్రాలకు గురి చేస్తు భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అక్రమ కేసులు పెడుతున్నారు, ఇదేనా ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి, ప్రజల మన్నేలను పొందేలా అభివృద్ధి పైన దృష్టి పెట్టండి, 6 గ్యారంటీలను అమలు చేయండి అని కాంగ్రెస్ ప్రభుత్వం నిలదీశారు. ప్రజలు ఇప్పుడు ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైన బుద్ధి చెప్తారని సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరెళ్ల మల్లికార్జున్ గౌడ్, పట్టణ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు, జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు ఎం లావణ్య రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు విజయలక్ష్మి, మాయ మల్లేశం, భీమరి కిషోర్, నాయకులు జీవన్ రావు, సురేందర్ గౌడ్, జుబెర్ అహ్మద్, తుమ్మ లక్ష్మీనారాయణ, ఇస్మాయిల్, సంతోష్, నరేష్, చంద్రశేఖర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థులు వివిధ వార్డుల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిస్సారమైన బడ్జెట్.. ఆర్భాటం తప్ప ఏమీ లేదు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది పూర్తిగా నిస్తేజంగా ఉందని, ఏమాత్రం ఆసక్తికరంగా లేదని విమర్శించింది. బడ్జెట్ కు ముందు భారీ హైప్ సృష్టించారని, కానీ అందులో విషయం లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. ఆదివారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగంపై మండిపడ్డారు. బడ్జెట్ ప్రసంగంలో పారదర్శకత లోపించిందని జైరాం రమేశ్ ఆరోపించారు. కీలకమైన పథకాలకు, కార్యక్రమాలకు నిధులు ఎంత కేటాయించారో చెప్పలేదని విమర్శించారు. 90 నిమిషాల ప్రసంగం తర్వాత చూస్తే, బడ్జెట్ అంచనాలను అందుకోవడంలో ఘోరంగా విఫలమైందని స్పష్టమవుతోందన్నారు. పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉందన్నారు. జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా బడ్జెట్ తీరును ఎండగట్టారు. ''బడ్జెట్ పత్రాలను పూర్తిగా చదవాల్సి ఉంది. కానీ మంత్రి చదివిన 90 నిమిషాల ప్రసంగం వింటేనే అర్థమైపోయింది. ఈ బడ్జెట్ అంచనాలను అందుకోవడంలో ఘోరంగా విఫలమైంది. కీలకమైన సంక్షేమ పథకాలకు, కార్యక్రమాలకు ఎంత డబ్బు కేటాయించారో ప్రజలకు చెప్పలేదు. కేవలం అంకెల గారడీతో మభ్యపెట్టే ప్రయత్నం చేశారు'' అని జైరాం రమేశ్ విమర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ కూడా బడ్జెట్ పై పెదవి విరిచారు. ఆయన తన సొంత రాష్ట్రం కేరళకు జరిగిన అన్యాయాన్ని ఎత్తిచూపారు. ''బడ్జెట్ ప్రసంగంలో వివరాలు చాలా తక్కువగా ఉన్నాయి. కేవలం 34 హెడ్ లైన్స్ మాత్రమే వినిపించాయి తప్ప లోతు లేదు. మేము కేరళకు 'ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద' వస్తుందని ఆశించాం. ఆయుర్వేదానికి కేరళ పుట్టినిల్లు. మాకు ఆ సంప్రదాయం ఉంది. కానీ బడ్జెట్ లో ఆ ఊసే లేదు. మత్స్యకారులు, కొబ్బరి గురించి ప్రస్తావించారు కానీ, కేరళ పేరు మాత్రం చెప్పలేదు. అది మాకే ఇస్తారో లేదో తెలియదు'' అని థరూర్ ఆవేదన వ్యక్తం చేశారు.

విశ్వ వీక్షణం

రాష్ట్రపతి భవన్‌లో అమృత్ ఉద్యాన్

- ఈ నెల 3 నుంచి ప్రజలకు అందుబాటులోకి..

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్.. మొఘల్ గార్డెన్స్, అందులోని పూల మొక్కలు, వాటి పూలు.. ఎంతగానో ఆకట్టుకుంటాయి. అయితే, అంత అందమైన ఇక్కడి ప్రకృతిని ఎప్పుడు పడితే అప్పుడు చూసేయడం కుదరదు. కానీ, ప్రతి ఏడాది కొంతకాలం పాటు సాధారణ ప్రజలకు సందర్శనకు అనుమతిస్తారు. ఈ ఏడాది కూడా అమృత్ ఉద్యాన్ పేరుతో సందర్శనకు అనుమతించనున్నారు. ఈ నెల 3 మంగళవారం నుంచి మార్చి 31 వరకు సందర్శకుల్ని గార్డెన్ లోపలికి అనుమతిస్తారు. ఢిల్లీలో కాలుష్యం ఎక్కువనే సంగతి తెలిసిందే. ఎప్పుడూ కాలుష్యంతో ఇబ్బందిపడే ప్రజలు.. రాష్ట్రపతి భవన్లో ఉన్న మొఘల్ గార్డెన్ పచ్చదనాన్ని, ప్రకృతిని చూసి పరవశించవచ్చు. ఈ ఏడాది అమృత్ ఉద్యాన్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లాంఛనంగా ప్రారంభించారు. ఈ ఏడాది సందర్శకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాధారణంగా ఇక్కడ ఈ శీతాకాలంలోనే పూల మొక్కలు అందాన్ని సంతరించుకుంటాయి. అందుకే ఈ సమయంలోనే ప్రజల్ని అనుమతిస్తారు. ఈసారి సందర్శకులు 145 రకాల గులాబి మొక్కల్ని చూడొచ్చు. అర్జున, కృష్ణ, అశ్విని వంటి అరుదైన గులాబీలు ఇక్కడ ఉన్నాయి. అలాగే ఇతర 85 రకాల పూల మొక్కలు కనిపిస్తాయి. ప్రతి రోజు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు గార్డెన్ సందర్శించవచ్చు. ఐదు గంటల వరకు ఎంట్రీ ఉంటుంది. హోలీ పండుగ రోజు మాత్రం సెలవు రోజు.

తిట్టకుండా కొట్టకుండా ఎలా?

పిల్లలు అల్లరి పనులు చేయడమే కాకుండా క్రమ శిక్షణ లేకుండా తయారవుతుంటారు. ఇలాంటప్పుడే తల్లిదండ్రులకు కోపం వచ్చి తిట్టడం, కొట్టడం లాంటివి చేస్తుంటారు. వీటివల్ల పిల్లలు క్రమశిక్షణతో ఉంటారని. చాలా మంది పేరెంట్స్ తిట్టడం, కొట్టడం ద్వారానే పిల్లలు క్రమశిక్షణతో ఉంటారని అనుకుంటారు. కానీ మీరు అరవడం వల్ల ఇంత కూడా యూజ్ లేదు. నిజానికి మీరు అరిచి పిల్లల్ని కొడితే వారు మరింత మొండిగా తయారవుతారు. భయం లేకుండా మరింత అల్లరి చేస్తుంటారు. అందులోనూ మీరు ఇలా తిట్టడం వల్ల మీ పిల్లలకు మీరంటే నచ్చరు. అలాగే వారిపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అందుకే పిల్లలకు క్రమ శిక్షణను అలవర్చడానికి మీరు అరవడానికి బదులుగా కొన్ని పనులు చేయండి. దీనివల్ల మీ పిల్లలు అల్లరి మానుతారు. ఇందుకోసం పేరెంట్స్ ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం
పదండి.

పాజిటివ్ అనే టెక్నిక్

పిల్లలు చేసిన ప్రతి మంచి పనికి మెచ్చుకోవడం అలవాటు చేసుకోండి. అంటే టైంకి హోం వర్క్ కంప్లీట్ చేసినా, లేదా ఎవరికైనా సహాయం చేసినా, మీకు అబద్దాలు చెప్పకపోయినా వారిని ప్రశంసించండి. నువ్వు మంచి పని చేశావని వారితో అనండి. నిజానికి ఇవి చిన్న చిన్న మాటలే అయినా మీ పిల్లలపై పెద్ద ప్రభావాన్ని చూపుతాయి. అంటే ఇది వారిలో మంచి పనులు చేసేలా ప్రేరేపిస్తుంది. చెడు పనులకు దూరంగా ఉంచుతుంది. అందుకే పిల్లల్ని క్రమ శిక్షణలో పెట్టడానికి ఇది మీకు బాగా సహాయపడుతుంది.

బలవంతం చేయొద్దు

పిల్లలు ఒకరు చెప్పిన దాన్ని అర్థం చేసుకోవడానికి చాలా టైం పడుతుంది. అందుకే వారు సొంతంగా అర్థం చేసుకునే టైం ఇవ్వండి. ఉదాహరణకు బయట చల్లగా ఉండి స్వెట్టర్ వేసుకోకపోతే వారిని బలవంతం చేయకండి. బయట చల్లగా ఉంది స్వెట్టర్ వేసుకుంటావో, లేదో ఆలోచించుకో అని ప్రేమగా చెప్పండి. ఇది పిల్లల్ని ఆలోచింపజేస్తుంది. ఇది వారి భవిష్యత్తుకు చాలా ముఖ్యం.

సృజనాత్మక కార్యకలాపాలు

మీ పిల్లలు బాగా అల్లరి చేస్తున్నారని వారిపై అరవకండి. కోపగించుకోకండి. దీనికి బదులు వారిని సృజనాత్మక కార్యకలాపాల వైపు మళ్లించండి. అంటే డ్రాయింగ్ వేయించడం వంటి పనులను చేయించండి. ఇది మీ పిల్లల ప్రవర్తనను మంచిగా మారుస్తుంది. అలాగే వారు ఎన్నో విషయాలను నేర్చుకుంటారు. నెగిటీవ్ బిహేవియర్ నుంచి పాజిటీవ్ బిహేవియర్ కు మారేలా చేస్తుంది. అలాగే ఏది మంచి, ఏది చెడో అర్థం చేసుకుంటారు.

కారణం తెలుసుకోండి

మీ పిల్లలు ఎప్పుడూ తప్పులు చేస్తున్నట్లైతే వారిని ఒంటరిగా వదిలేయకండి. తిట్టకండి, కొట్టకండి. బదులుగా వారు తప్పులు చేయడానికి గల కారణాలేంటో తెలుసుకునే ప్రయత్నం చేయండి. మీ పిల్లల్ని దగ్గర కూర్చోబెట్టుకుని ప్రేమగా మాట్లాడండి. దీనివల్ల పిల్లలు సేఫ్ గా ఫీలవుతారు. ఏదైనా సమస్య ఉంటే మీతో చెప్తారు. అంతేకాదు ఇది మీ పిల్లల ప్రవర్తనను మెరుగుపర్చడానికి సహాయపడుతుంది.

పాక్ ఆర్మీ ఆపరేషన్.. 92 మది బలూచ్ మిలిటెంట్లు హతం

బలూచిస్తాన్‌లో దాడులకు పాల్పడుతున్న మిలిటెంట్లను పాకిస్థాన్ మిలిటరీ ఏరివేస్తున్నది. ఈ నేపథ్యంలో భాగంగా చేపట్టిన ఆపరేషన్‌లో 92 మంది బలూచిస్తానీ మిలిటెంట్లను హతమార్చినట్లు పాకిస్థాన్ మిలిటరీ పేర్కొన్నది. ఈ ఆపరేషన్‌లో 15 మంది సెక్యూర్టీ సిబ్బంది, 18 మంది సాధారణ పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు మిలిటరీ వెల్లడించింది. దాడులకు తామే పాల్పడుతున్న గతంలో బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ ప్రకటించుకున్నది. డజన్ల సంఖ్యలో సైనికుల్ని చంపినట్లు ఆ సంస్థ ప్రకటించింది. అయితే బలూచిస్తాన్‌లో రెబల్స్, మిలిటరీ మధ్య తీవ్ర స్థాయిలో ఫైరింగ్ జరుగుతున్నది. బలూచిస్తాన్ ప్రావిన్సు రాజధాని క్వెట్టాతో పాటు సమీప నగరాల్లో జరుగుతున్న దాడులకు మిలిటెంట్లే కారణమని పాకిస్థాన్ మిలిటరీ ఆరోపించింది. బలోచిస్తాన్ బోర్డర్ సమీపంలో క్లియరెన్స్ ఆపరేషన్ చేపట్టామని, విజయవంతంగా రెబల్స్ ప్రణాళికలను దెబ్బతీసినట్లు పాక్ మిలిటరీ పేర్కొన్నది. క్వెట్టాలో కీలకమైన బిల్డింగ్‌లు, రోడ్లను సీజ్ చేశారు. మొబైల్ ఫోన్ సర్వీసులను నిలిపివేశారు. ఆపరేషన్ సమయంలో రైళ్ల రాకపోకలను కూడా ఆపేశారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించే వరకు తమ పోరాటం ఆగదు అని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అన్నారు.

ప్రధాని మోడీ రాజీనామా చేయాలి: మమత

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, కోల్‌కత, ఫిబ్రవరి 1: ''ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో మోదీ పేరు ఉండటం దేశానికి అవమానం. ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో ఏమాత్రం సంబంధం ఉన్నా.. ఇలాంటి ప్రజాస్వామ్య దేశంలో నైతిక బాధ్యతగా పదవి నుంచి తప్పుకొని పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలి. మౌనం వహించడం సరికాదు. మోదీ తనకుతాను పదవి నుంచి తప్పుకొని విచారణ కోరాలి'' అని మమత డిమాండ్ చేశారు. లైంగిక నేరాలకు పాల్పడ్డ నిందితుడు, అమెరికన్ వ్యాపారవేత్త జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఫైల్స్ తాజాగా విడుదలై ప్రపంచాన్ని కుదిపేస్తున్నాయి. పలు వీడియోలు, ఫొటోలు, ఇతర డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో లీకయ్యాయి. వీటిలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తోపాటు ప్రపంచ కుబేరులు ఎలాన్ మస్క్, బిల్‌గేట్స్, బెజోయ్ వంటి ప్రముఖుల పేర్లున్నాయి. ఈ డాక్యుమెంట్లలో తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ పేరు కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒక ఈ మెయిల్‌లో ఎప్‌స్టీన్ ప్రధాని మోదీ పేరు ప్రస్తావించారు. 2017 జూలై 4న మోదీ ఇజ్రాయెల్ పర్యటన సందర్భంగా జరిగిన కొన్ని అంశాల్ని ఈమెయిల్‌లో ఎప్‌స్టీన్ ప్రస్తావించాడు. మోదీ ఇజ్రాయెల్ వెళ్లి అక్కడ ఆ దేశ ప్రధాని నెతన్యాహుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మోదీ ఒక సలహా ప్రకారం అక్కడ పాట పాడారని, డాన్స్ చేశారని, ట్రంప్ కు లాభం కలిగేలా చేశారని ఈమెయిల్‌లో పేర్కొన్నాడు. దీంతో ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో మోదీ పేరు రావడంపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. సెక్స్ స్కాంలో ఇరుక్కున్న ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో మోదీ పేరు ఉన్నందున ఆయన తన పదవి నుంచి తప్పుకోవాలని మమత డిమాండ్ చేశారు. అయితే, మోదీపై వచ్చిన ఆరోపణలను భారత విదేశీ వ్యవహారాల శాఖ ఖండించింది. ఒక క్రిమినల్ పంపిన ఈమెయిల్ నిరాధారమైందని, అర్థంలేనిదని కొట్టిపారేసింది. కాగా.. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో భాగంగా 2,000కుపైగా వీడియోలు, 1,80,000 ఫొటోలు ఆన్‌లైన్‌లో లీకయ్యాయి. వీటిలో అనేక కీలక డాక్యుమెంట్లు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఈ వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.



ఇండియాతో మ్యాచ్.. ఆడేది లేదన్న పాక్

బంగ్లాదేశ్‌ను టీ20 ప్రపంచకప్ నుంచి బహిష్కరించినందుకు నిరసనగా టోర్నీ నుంచి బాయ్‌కాట్ చేస్తామని బెదిరింపులకు దిగిన పాకిస్థాన్.. అంత సాహసం చేయనప్పటికీ ఐసీసీకి మాత్రం ఝలక్ ఇచ్చింది. గ్రూప్ దశలో భారత్‌తో ఫిబ్రవరి 15న జరగాల్సిన తమ మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్టు తెలిపింది. ఈ మేరకు పాకిస్థాన్ ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో 'ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో ఆడేందుకు పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. కానీ ఈనెల 15న భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌కు మాత్రం మా జట్టు బరిలోకి దిగదు' అని పేర్కొంది. టోర్నీలో అత్యంత ఆకర్షణ ఉన్న మ్యాచ్‌ల్లో ఒకటైన దాయాదుల పోరు జరుగకపోవడం ఆర్థికపరంగా బ్రాడ్‌కాస్టర్లతో పాటు ఐసీసీకి భారీ ఎదురుదెబ్బే! అయితే గ్రూప్ దశలో టీమ్‌ఇండియాతో మ్యాచ్‌ను బహిష్కరించిన పాక్..నాకౌట్ దశలో ఎదుర్కోవాల్సి వస్తే ఏం చేస్తుందన్నదానిపై మాత్రం స్పష్టత లేదు. పాక్ గనుక ఇదే నిర్ణయంపై కట్టుబడి ఉంటే భారత్.. కొలంబో వెళ్లాల్సిన అవసరం ఉండకపోగా అదనంగా మ్యాచ్ ఆడకుండానే పాయింట్లు కూడా జమ అవుతాయి.

ప్రతిపక్షం
Prathipaksham.in
10
హైదరాబాద్
సోమవారం
02.02.2026
సినిమా

ఢిల్లీ ఆశలు సజీవం

డబ్ల్యూపీఎల్‌లో మూడుసార్లు ఫైనల్ చేరిన ఢిల్లీ క్యాపిటల్స్ నాలుగో సీజన్‌లోనూ ప్లే ఆఫ్స్ చేరింది. గత మ్యాచ్‌లో 3 పరుగుల తేడాతో గుజరాత్ చేతిలో ఓడిన ఢిల్లీ.. గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌ను చిత్తు చేసింది. మొదట బౌలర్ల విజృంభణతో ప్రత్యర్థిని 122కే కట్టడి చేసి.. ఆపై లారా వొల్వార్ట్ (47), జెమీమా రోడ్రిగ్స్(34 నాటౌట్) మెరుపులతో జయభేరి మోగించింది. 5 వికెట్ల తేడాతో గెలిచిన ఢిల్లీ ఎలిమినేటర్‌కు అర్హత సాధించింది. ఆదివారం ఇక్కడ యూపీ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ.. 5 వికెట్ల తేడాతో గెలిచి నాకౌట్‌కు అర్హత సాధించింది. స్వల్ప ఛేదనలో క్యాపిటల్స్ తడబడినా మధ్య ఓవర్లలో లారా వోల్వార్ట్ (47) ఆఖర్లో కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్ (18 బంతుల్లో 34*, 5 ఫోర్లు) సంయమనంతో ఆడి ఆ జట్టును విజయతీరాలకు చేర్చారు. లక్ష్యాన్ని ఢిల్లీ 18.4 ఓవర్లలో పూర్తిచేసింది. మొదట బ్యాటింగ్ చేసిన యూపీ.. 20 ఓవర్లకు 122/8కే పరిమితమైంది. దీప్తి శర్మ (24) టాప్ స్కోరర్ కాగా ఆల్‌రౌండర్ శిఖా పాండే (23*) ఫర్వాలేదనిపించింది. ఢిల్లీ విజయంతో వారియర్స్‌తో పాటు డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్ కూడా లీగ్ దశలోనే ఇంటిబాట పట్టాయి. మంగళవారం జరుగబోయే ఎలిమినేటర్‌లో ఢిల్లీ.. గుజరాత్‌ను ఢీకొననుంది. చావోరేవో పోరులో ఢిల్లీ సమిష్టి ప్రదర్శనతో సత్తా చాటింది. స్వల్ప ఛేదనలో ఢిల్లీ ఓపెనర్ లిజెల్లీ లీ(10) త్వరగానే వెనుదిరిగింది. ఆ తర్వాత క్రీజులోకొచ్చిన లారా వొల్వార్ట్(47).. దూకుడుగా ఆడింది. డేంజరస్ షఫాలీ వర్మ(29)ను శిఖా పాండే ఓవర్లో తేలికైన క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ఆ తర్వాత కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్(34 నాటౌట్), సోఫీ ఎకిల్‌స్టోన్ ఓవర్లో మరినేకాప్(0) సైతం చెత్త షాట్‌తో వికెట్ పారేసుకుంది. దాంతో.. 28 బంతుల్లో 25 అవసరమయ్యాయి. హిట్టర్ చిన్నెలీ హెన్రీ సైతం ఇబ్బంది పడింది. ఆమెను దీప్తి రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్ పంపగా ఒత్తిడి పడింది. కానీ, గత మ్యాచ్‌లో చివరిదాకా పోరాడిన నిక్కీ ప్రసాద్(4 నాటౌట్).. అండగా జట్టును విజయ తీరాలకు చేర్చింది జెమీమా. దీప్తి వేసిన 19వ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు బాది 5 వికెట్లతో గెలిచిన ఢిల్లీ 8 పాయింట్లతో ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో యూపీ గెలిస్తే ముందంజ వేయాలనుకున్న ముంబై ఇండియన్స్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.

పాక్‌ను చిత్తు చేసి.. సెమీస్‌కు యంగ్ ఇండియా

ఐసీసీ అండర్19 వన్డే ప్రపంచకప్‌లో యువ భారత జట్టు సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది. సూపర్ సిక్స్ గ్రూప్‌డీలో భాగంగా ఆదివారం పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్.. 58 పరుగుల తేడాతో చిరకాల ప్రత్యర్థిని చిత్తుచేసి ఇటీవల ఆసియా కప్ ఫైనల్‌లో ఆ జట్టు చేతిలో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకుంది. బౌలింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై బ్యాట్‌తో మోస్తరు స్కోరు చేసినప్పటికీ బంతితో దాయాదిని మట్టికరిపించింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత అండర్ 19 జట్టు.. 49.5 ఓవర్లలో 252 పరుగులకే ఆలౌట్ అయింది. పాక్ బౌలర్లు కట్టడి చేసినా వేదాంత్ త్రివేది (98 బంతుల్లో 68, 2 ఫోర్లు, 1 సిక్స్), కన్షిక్ చౌహాన్ (35) భారత్‌ను ఆదుకున్నారు. ఛేదనలో పాకిస్థాన్.. లక్ష్యాన్ని 33.3 ఓవర్లలోనే ఛేదిస్తేనే సెమీస్‌కు అర్హత సాధించే అవకాశం ఉండగా భారత బౌలర్లు కట్టడిచేయడంతో ఆ జట్టు సెమీస్ ఛాన్స్‌తో పాటు మ్యాచ్‌నూ కోల్పోయింది. 31 ఓవర్లకు 151/3గా ఉన్న పాక్.. ఆ తర్వాత 40 పరుగులకే కుప్పకూలి (46.2 ఓవర్లలో 194 రన్స్‌కు ఆలౌట్) ఓటమిని మూటగట్టుకుంది. ఖిలాన్ పటేల్ (3/35), అయూశ్ మాత్రె (3/21) మెరిశారు. సెమీస్‌లో భారత్.. అఫ్గానిస్థాన్‌తో ఆడనుండగా ఇంగ్లండ్, ఆస్ట్రేలియాతో తలపడుతుంది.

క్రీడా పరికరాల తయారీకి రూ. 500 కోట్లు

బడ్జెట్‌లో కేటాయింపులు

వార్షిక బడ్జెట్‌లో క్రీడా రంగానికి ఊతమిస్తూనే.. కీలకమైన వాటికి నిధులు తగ్గించింది కేంద్రం. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో క్రీడల అభివృద్ధికి చర్యలు తీసుకంటున్నామని చెబుతూ క్రీడా పరికరాలు, వస్తువుల తయారీకి రూ.500 కోట్లు కేటాయించారు. దేశంలో క్రీడల అభివృద్ధికి ఇంత భారీ మొత్తం నిధులు ఇవ్వాలని నిర్ణయించడం ఇదే మొదటిసారి. అయితే.. జాతీయ డ్రగ్స్ నిరోధక సంస్థకు మాత్రం రూ.3 కోట్లు, ఖేలో ఇండియా కార్యక్రమానికి సైతం రూ.36 కోట్లు కోత విధించారు. క్రీడలకు పెద్ద పీట వేస్తున్నామని చెప్పిన నిర్మల పరికరాల తయారీకి రూ.500 కోట్లు కేటాయిస్తున్నట్టు తెలిపారు. క్రీడా పరికరాలు, వస్తువుల తయారీకి ఊతమిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. 'మేకిన్ ఇండియా ' ద్వారా క్రీడా వస్తువుల తయారీ, పరిశోధన, ఆవిష్కరణలకు ఉపకరించేలా నిధులు కేటాయించామని నిర్మల వెల్లడించారు. ఈసారి బడ్జెట్‌లో రూ. 4,479.88 కోట్లు కేటాయించారని, గత ఏడాదితో పోల్చితే రూ.1,133.34 కోట్ల కేటాయింపు అదనంగా జరిగిందని యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ పేర్కొంది. క్రీడా పరికరాల తయారీకి బడ్జెట్‌లో రూ.500 కేటాయించడం పట్ల క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవీయ పేర్కొన్నారు.

సాయ్‌కు 917.38 కోట్లు

ప్రతిభావంతులను గుర్తించి, సానబెట్టే భారత స్పోర్ట్స్ సమాఖ్యకు బడ్జెట్ రూ. 880 కోట్ల నుంచి రూ.917.38 కోట్లకు పెరిగింది. అదే సమయంలో జాతీయ డ్రగ్స్ నిరోధక సంస్థకు రూ.3 కోట్ల కోత విధిస్తూ.. రూ.20.30 కోట్లు ప్రకటించారు. గత ఏడాది నాడాకు కేటాయించే బడ్జెట్‌లో రూ.28.55 కోట్ల నుంచి రూ.24.30 కోట్లకు తగ్గించిన విషయం తెలిసిందే. ఇక ఖేలో ఇండియా కార్యక్రమానికి కూడా కోత తప్పలేదు. నిరుడు రూ. 1,000 కోట్లు కేటాయించిన కేంద్రం ఈసారి రూ.924.35 కోట్లతో సరిపుచ్చింది. ఈ ఏడాది కామన్‌వెల్త్ గేమ్స్‌ను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్‌లో రూ.50 కోట్లు ప్రకటించారు ఆర్థిక మంత్రి.

ఈ ఆనందానికి అవధుల్లేవు: చిరంజీవి

రామ్ చరణ్, ఉపాసన కొణిదెల దంపతులకు కవలలు ఒక బాబు, ఒక పాప జన్మించడంతో మెగా కుటుంబంలో అపూర్వమైన ఆనందం నెలకొంది. ఈ ప్రసవం హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో జరిగింది. ఈ శుభవార్త చిరంజీవి కుటుంబంలో రెట్టింపు వేడుకలని తీసుకొచ్చింది. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ..'అందరికీ నమస్కారం. మా శ్రేయోభిలాషులు, మా అభిమానులు, మా మంచి కాంక్షించే ప్రతి ఒక్కరికి మా ఇంటి జరిగిన ఈ శుభవార్త మీతో పంచుకోవడం చాలా చాలా సంతోషంగా ఉంది. ఇటు కొణిదెల ఫ్యామిలీ అటు కామినేని ఫ్యామిలీ రెండు కుటుంబాలు కూడా చాలా సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నాము. రామ్ చరణ్ ఉపాసన రాత్రి కవలలకు జన్మనిచ్చారు. ఉపాసన, బిడ్డలు చాలా ఆరోగ్యంగా ఉన్నారు. ఈ సంతోషాన్ని మీతో పంచుకుంటున్నాము. మా ఇంట ఈ మంచి జరగాలని మీరు ఎప్పటినుంచో కోరుకుంటున్నారు. భగవంతుడి దయవల్ల, హనుమాన్ కృప వలన ఒక పాప, ఒక బాబు జన్మించారు. ఇది మా అందరికీ చాలా సంతోషాన్ని కలిగించే విషయం. మమ్మల్ని అభిమానించే వారికి మా మంచి కోరుకునే వారికి ఈ వార్తని పంచుకోవడం అనేది నాకు చాలా ఆనందకరంగా ఉంది. ఇంత సుఖ ప్రసవం జరిగినందుకు అపోలో వైద్యులకు, వారి సిబ్బందికి ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మా అభిమానులు అందరూ కూడా ఇది మరింత పండుగలాగా జరుపుకుంటూ వాళ్ళ ఆనందానికి అవధులు లేకుండా ఉంది. నేను ఎంత చెప్పినా సరే ఈ ఆనందానికి అవధులు లేవు. అందరికీ థాంక్యు" జూన్ 20, 2023న రామ్ చరణ్-ఉపాసన దంపతులు తమ తొలి సంతానంగా కుమార్తె క్లింకారకు జన్మనిచ్చారు. ఇప్పుడు, కవలల రాకతో, కొణిదెల, కామినేని కుటుంబాలలో ఆనందం రెట్టింపు అయింది. అభిమానులు, శ్రేయోభిలాషులందరిలోనూ పండగ వాతావరణం నెలకొంది.



అందం.. తెలుగుతనం

శివాని నగరం... చూడగానే ఆకట్టుకునే రూపం, చురుకైన కళ్లతో కుర్రకారు మనసు గెలుచుకుంటున్న ఈ చిన్నది, కేవలం అందంతోనే కాకుండా తన నటనతోనూ విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. స్వచ్ఛమైన తెలుగింటి కళతో పాటు గ్లామర్ టచ్ ఇస్తూ టాలీవుడ్‌లో కొత్త ఆశలను రేకెత్తిస్తోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారిన ఈ బ్యూటీ, తనదైన శైలిలో రాణిస్తూ అగ్ర కథానాయికల సరసన చేరేందుకు సిద్ధమవుతోంది. తాజాగా ఆమె ఫొటోషూట్ సోషల్ మీడియా లో షేర్ చేసింది..'లిటిల్ హార్ట్స్ ' నుండి 'హే భగవాన్' వరకు: శివాని నగరం ఇటీవల విడుదలైన 'లిటిల్ హార్ట్స్ ' సినిమాతో తన అద్భుతమైన నటనను ప్రదర్శించి అందరి దృష్టిని ఆకర్షించింది. మొదటి సినిమాతోనే మెచ్యూర్డ్ పెర్ఫార్మెన్స్ ఇచ్చి, పరిశ్రమలో తనకంటూ ఒక బలమైన పునాదిని వేసుకుంది. ఈ విజయంతో ఆమెకు అవకాశాలు క్యూ కడుతున్నాయి. తాజాగా టాలెంటెడ్ హీరో సుహాస్ సరసన 'హే భగవాన్' సినిమాలో కథానాయికగా నటిస్తోంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సినిమాతో శివాని కెరీర్ మరో మలుపు తిరుగుతుందని, సుహాస్-శివానిల కెమిస్ట్రీ తెరపై కొత్తగా ఉంటుందని ఫాన్స్ ఆశిస్తున్నారు. ఆధునికతతో కూడిన సంప్రదాయ సౌందర్యం అభిమానులను ఆకట్టుకుంది.

ఫహాద్ ఫాజిల్ 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'

హైదరాబాద్‌లో షూటింగ్ స్టార్ట్

ఫహాద్ ఫాజిల్ తన మొదటి స్ట్రెయిట్ తెలుగు సినిమా చిత్రీకరణను ప్రారంభించారు. 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' షూటింగ్‌ను ఆదివారం (ఫిబ్రవరి1)న గ్రాండ్‌గా ప్రారంభించారు. అయితే ఈ క్రమంలో హైదరాబాద్‌లో వేసిన సెట్ కి ఆయన అభిమానులు భారీగా వచ్చారు. వెర్సటైల్ యాక్టర్ ఫహాద్ ఫాజిల్ తన మీద అభిమానంతో వచ్చిన ఫ్యాన్స్‌ను చూసి హ్యాపీగా ఫీలయ్యారు. అభిమానుల సందోహం మధ్యే ఆయన తన షూటింగ్‌ను ప్రారంభించారు. షూటింగ్ నుంచి కాసేపు విరామం తీసుకుని ఫహాద్ ఫాజిల్ తన అభిమానుల్ని పలకరించారు. అభిమానుల ప్రేమ, ఉత్సాహాన్ని గుర్తించి అక్కడకు వచ్చిన వారిని హృదయపూర్వకంగా పలకరించాడు. వచ్చిన అభిమానులు ఫహాద్ ఫాజిల్‌ను చూసి ఆనందపడటం, ఫ్యాన్స్‌ని చూసి ఫహాద్ ఫాజిల్ సంతోషించడంతో అక్కడంతా పండుగ వాతావరణం నెలకొంది. సెట్ లో సినిమా మొదటి రోజు ఓ పండుగ వైబ్ కనిపించినట్టు అయింది. 'ప్రేమలు' సినిమాతో పంపిణీదారుగా ఎస్ ఎస్ కార్తికేయ భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఇక షోయింగ్ బిజినెస్ బ్యానర్ ద్వారా నిర్మాతగా మారారు. అర్కా మీడియావర్క్స్, షోయింగ్ బిజినెస్ సంయుక్తంగా నిర్మిస్తోన్న 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' చిత్రంతో నిర్మాతగా ఎస్‌ఎస్ కార్తికేయ ఎంట్రీ ఇవ్వబోతోన్నారు. భారతదేశం, ప్రపంచ వ్యాప్త సినీ అభిమానులు అత్యంత ఆతృతగా ఎదురుచూస్తున్న 'వారణాసి'ని కూడా కార్తికేయ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. 'బాహుబలి' ఫ్రాంచైజీతో ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన ప్రఖ్యాత నిర్మాతలు శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేనిలను మళ్లీ ఈ చిత్రం ఒకచోటకు చేర్చినట్టు అయింది.

'హనీ' థియేటర్స్‌లో చూడాల్సిన సినిమా

ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో హీరో నవీన్ చంద్ర

నవీన్ చంద్ర, దివ్య పిళ్లై ప్రధాన పాత్రల్లో కరుణ కుమార్ రచన, దర్శకత్వం వహించిన సైకలాజికల్ హారర్ మూవీ హనీ. OVA ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని శేఖర్ స్టూడియోస్ సమర్పిస్తోంది. సైకాలజికల్ డెప్త్, సోషల్ రిలవెన్స్, హారర్ అంశాలతో రూపొందిన 'హనీ' ఫిబ్రవరి 6న థియేటర్ లో రిలీజ్ అవుతుంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ట్రైలర్ ని లాంచ్ చేశారు. హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ.. ''ట్రైలర్ కి చాలా అద్భుతమైన రెస్పాన్స్ రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా ఫిలిం మేకింగ్ ప్రాసెస్ నేను చాలా ఎంజాయ్ చేశాను. ఇది మౌత్ టాక్ తో నిలబడే సినిమా. మాకు ఉన్న బడ్జెట్లో థియేటర్స్ కి తీసుకొచ్చి ఆడియన్స్ కి ఒక డిఫరెంట్ ఎక్స్పీరియన్స్ ఇవ్వాలని నేను ఎప్పుడు ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. ఫిబ్రవరి 6న దయచేసి ఒకసారి థియేటర్ కి రండి. ఇది థియేటర్ కి చాలా బాగుంటుంది. దివి చాలా అద్భుతమైన నటి. తను తప్పకుండా పెద్ద స్టార్ అవుతుంది. దివ్య కూడా చాలా చక్కగా నటించింది. ఈ సినిమా వెంటాడుతూనే ఉంటుంది. ఇది ఆలోచన రేకెత్తించే సినిమా. డిఓపి మ్యూజిక్ డైరెక్టర్ అద్భుతమైన వర్క్ ఇచ్చారు. ఇందులో ఉన్న పాప కూడా చాలా చక్కగా నటించింది. మట్కా సినిమా సమయంలో కరుణ కుమార్ గారితో చాలా దగ్గర అయ్యను. ఈ కథకు ఆయన నన్ను ఎంచుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఆయన నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నేను నిలబెట్టుకున్నానని అనుకుంటున్నాను. ఈ సమాజంలో ఆశ కోసం ప్రజలు ఏవేవో చేస్తున్నారు. ఇందులో ఒక డార్క్ సొసైటీని చూపించాము. ఈ కథ విన్న తర్వాత నేను చాలా జాగ్రత్తగా ఉన్నాను. మానసికంగా బలహీనంగా ఉన్నప్పుడే ఇలాంటి వాటికి మనం విక్టిమ్ అవుతాం. ఈ సినిమా చేసిన్నప్పుడు చాలా మ్యాడ్‌నెస్ లో ఉన్నాను. చాలా ఇంటెన్సిటీ ఉన్న క్యారెక్టర్ ఇది. ఈ సినిమా షూటింగ్లో ఒక సంఘటన జరిగింది. ఈ క్యారెక్టర్ ప్రభావం వల్ల ఒక వ్యక్తితో నేను దురుసుగా ప్రవర్తించాను. అయితే అది నేను కాదు. ఆ క్యారెక్టర్ అలా ప్రవర్తించింది. తప్పకుండా ఫిబ్రవరి 6న ఈ సినిమాని అందరూ థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను. " అన్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200